


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



ఆర్ఎస్ఎస్ గతం, వర్తమానాలను ఎందుకు కప్పిపుచ్చలేరు? 06

గాజా అంతఃకలహాల్లో 27మంది మృతి
ఇదంతా నోబెల్ బహుమతి కోసం చేయలేదు : ట్రంప్ 02



సంపుటి 08, సంచిక: 313 | మంగళవారం | 14-10-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## సృజనాత్మక విధ్వంసమే మార్కెట్‌కు రక్ష!

### ఆర్థికశాస్త్రంలో ముగ్గురికి నోబెల్ బహుమతి

**స్టాక్‌హోం:** ఆర్థికశాస్త్రంలో ముగ్గురు శాస్త్రవేత్తలకు నోబెల్ కమిటీ ఉమ్మడిగా బహుమతి ప్రకటించింది. నార్త్‌వెస్టర్న్ యూనివర్సిటీకి చెందిన జోయల్ మోకిరీ, ఫ్రాన్స్ ఉన్నత కళాశాల–లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌కు చెందిన ఫిలిప్ అఘియన్, బ్రౌన్ యూనివర్సిటీకి చెందిన పీటర్ హోవిట్‌లకు నోబెల్–2025 పురస్కారం లభించింది. నూతన సాంకేతిక ప్రపంచంలో సరికొత్త ఆవిష్కరణల ప్రాతిపదికపై ఆర్థిక వృద్ధి ఆధారపడి ఉంటుందని ఈ శాస్త్రవేత్తలు తమ పరిశోధనల ద్వారా వివరించారు. ఆర్థిక వృద్ధి ఎప్పుడూ తరువాయి 12లో



## సంక్షేమ హాస్టళ్ల అత్యవసర ఖర్చులకు
# రూ.60 కోట్లు

- వివిధ శాఖల సీనియర్ అధికారులకు చెక్కు అందజేసిన ముఖ్యమంత్రి
- సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బందికి ఫేసియల్ రికగ్నైజేషన్
- వైద్య కళాశాలలతో హాస్టళ్ల అనుసంధానం, విద్యార్థులకు వైద్య పరీక్షలు
- వైద్య సేవలు, విద్యా సాంకేతికత, తనిఖీలకు ప్రత్యేక యాప్‌లు
- సంక్షేమ వసతి గృహాల సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలలో అత్యవసర పనులకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) నుంచి రూ.60 కోట్లు కేటాయించింది. ఈ నిధులను హాస్టళ్లలో డైట్ ఛార్జీలు, తాత్కాలిక సిబ్బంది జీతాల విడుదల, హాస్టళ్లలో మోటార్ల మరమ్మతులు, ఇతర అత్యవసర పనులకు వినియోగించుకునే వెసులుబాటు కలిగించింది. హాస్టళ్లకు కేటాయించిన నిధుల చెక్కులను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వివిధ శాఖల సీనియర్ అధికారులకు అందజేశారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సంక్షేమ గృహాలు, విద్యా సంస్థలపై ఐసిసిసిలో సిఎం రేవంత్ రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది ముఖ గుర్తింపునకు ఏర్పాట్లు చేయాలని సిఎం ఆదేశించారు. పూర్తి స్థాయి డేటా, జవాబుదారీతనం ఉండాలని ఆయన అన్నారు. హాస్టల్ విద్యార్థులకు అందించే యూనిఫామ్‌లు, పుస్తకాలు సకాలంలో, సక్రమంగా అందే విధంగా సీనియర్ అధికారులు చూసుకోవాలని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు నిర్ధరించాలని సిఎం సూచించారు. హాస్టళ్లలో ఉన్న సౌకర్యాలు, ఇతర వసతులు, వాటి నిర్వహణకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఎప్పటికప్పుడు డాష్ బోర్డ్‌లో అప్‌లోడ్ చేయాలని సిఎం ఆదేశించారు.

### విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

హాస్టళ్లలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులను హాస్టళ్లతో అనుసంధానించాలని సిఎం సూచించారు. హాస్టళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అత్యవసర సమయాల్లో వైద్యులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలని సిఎం తరువాయి 2లో

## 20 మంది ఇజ్రాయెల్
# బందీలు విడుదల

బాహ్య ప్రపంచంలోకి 2000 మంది పాలస్తీనా ఖైదీలు

యుద్ధం ముగిసింది : ట్రంప్ ప్రకటన





**టెల్‌అవీవ్:** హమాస్ వద్ద మిగిలి ఉన్న 20 మంది సజీవులైన బందీలు సోమవారం విడుదలయ్యారు. మరోవైపు ఇజ్రాయెల్ జైళ్ళ నుండి దాదాపు 2000 మంది ఖైదీలు బాహ్య ప్రపంచంలోకి అడుగుపెట్టారు. రెండేళ్ళ తర్వాత హమాస్ చెరవీడి ఇజ్రాయెల్ చేరిన బందీలు టెల్‌అవీవ్‌లో తమకు ఎదురుపడిన కుటుంబీకులను గాఢాలింగనాలు చేసుకోవడంతో ఆ ప్రాంతమంతా తీవ్ర భావోద్వేగాలతో నిండిపోయింది. కాగా నిర్జీవులైన నలుగురి మృతదేహాలను మాత్రమే స్వాధీనం చేశారు. ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ఒప్పందం అమలులోకి వచ్చిన నాలుగోరోజు సోమవారం ఈ కీలక పరిణామాలు సంభవించాయి. మరోవైపు వెస్ట్‌బ్యాంక్ రమల్లాలో కూడా బంధువులు వందలమంది గుమిగూడి విడుదలైన పాలస్తీనా ఖైదీలకు ఆహ్వానం పలికారు. ఒప్పందంలో భాగంగా జైళ్ళ నుండి 250 మంది ఖైదీలు, నిర్బంధంలో ఉన్న 1,718 మంది పాలస్తీనియన్లను విడుదల చేశామని ఇజ్రాయెల్‌ప్రధానమంత్రి నెతన్యాహూ తొలుత ప్రకటన చేశారు. ఇక యుద్ధం ముగిసిందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ పరిణామాలపై యూరోపియన్ యూనియన్ దేశాలు హర్షం ప్రకటించాయి. గాజాలో శాంతి డోనాల్డ్ ట్రంప్ వల్లనే సాధ్యపడిందని ఆ దేశాలు ప్రశంసించాయి. చైనా దేశం కూడా ఒక అధికారిక ప్రకటన చేస్తూ, విజయవంతంగా ఒప్పందం అమలులోకి రావడంపట్ల హర్షం ప్రకటించింది. ఐతే ఇంకా 24 మంది నిర్జీవులైన బందీలను హమాస్ స్వాధీనం చేయాల్సి ఉండగా, వీరి విడుదలపై ఇంకా అనిశ్చితి నెలకుంది. బందీలు అందరూ ఇజ్రాయెల్‌కు చేరుకున్నారని ధృవీకరించిన తర్వాత పాలస్తీనా ఖైదీలను విడుదల చేస్తామని బెంజిమన్ నెతన్యాహూ తొలుత ప్రకటించారు. విడుదలయ్యే ఖైదీలు 2000 మాత్రమే కాగా, ఇంకా దాదాపు 10,000 మంది తరువాయి 12లో



## రాహుల్ ఓటు చోరీ వ్యాఖ్యలపై పిల్‌ను తోసిపుచ్చిన సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ :** లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ 'ఓట్ చోర్ గద్దీ చోడ్' అనే నినాదంతో 'ఓటర్ అధికార్ యాత్ర' నిర్వహించారు. ఈ యాత్రలో ఆయన బిజెపి కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఓట్ల చోరీకి పాల్పడుతున్నదని పలుమార్లు ఆరోపించారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై సిట్ విచారణ కోరుతూ దాఖలైన పిల్‌ను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాలా బాగ్చిలతో కూడిన ధర్మాసనం పిల్‌ను విచారణకు స్వీకరించేందుకు తరువాయి 12లో

## గురుకుల విద్యార్థిని ఆత్మహత్య 03

మహబూబ్‌నగర్ జిల్లా రాంరెడ్డిగూడ బాలికల వసతి గృహంలో ఘటన

## మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి మృతి

సిఎం, ఐజెయు, టిపిసిసి సంతాపం



## ఐఆర్‌సిటిసి కేసులో సిబిఐ ఛార్జిషీట్

### బిహార్ ఎన్నికల వేళ లాలూ కుటుంబానికి షాక్!



**న్యూఢిల్లీ:** బిహార్ ఎన్నికలకు ముందు రాష్ట్రీయ జనతా దళ్ అధ్యక్షుడు, మాజీ కేంద్ర మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబానికి సిబిఐ షాక్ ఇచ్చింది. ఐఆర్‌సిటిసి హోటళ్ల కాంట్రాక్టులు కేటాయించడంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై 2017లో నమోదైన కేసుపై సిబిఐ తాజాగా ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఛార్జిషీట్‌లో లాలూ ప్రసాద్‌తో పాటు ఆయన భార్య మాజీ సిఎం రబ్రీ దేవీ, వారి కుమారుడు తేజస్వీ యాదవ్‌పై అవినీతి, నేరపూరితమైన కుట్ర, మోసం అభియోగాలను మోపింది. ఈ క్రమంలోనే రైల్వే మంత్రిగా తన పదవిని దుర్వినియోగం చేశారని న్యాయస్థానం తరువాయి 12లో



## 18న బిసి జెఎసి రాష్ట్ర బంద్‌కు
# సిపిఐ సంపూర్ణ మద్దతు

- బంద్‌లో ప్రత్యక్షంగా పాల్గొంటాం : సిపిఐ రాష్ట్ర కార్యదర్శికూనంనేని సాంబశివ రావు ప్రకటన
- అన్ని రాజకీయ పార్టీలనూ కలుపుకుని ముందుకు సాగాలని బిసి జెఎసికి సూచన
- బిసి కోటాపై కొందరు వంకరగా మాట్లాడుతున్నారని ఆగ్రహం

ప్రజాపక్షం/హైదరాబాద్

బిసి రిజర్వేషన్ల సాధనకు వివిధ బిసి సంఘాలతో ఏర్పడిన 'బిసి ఐక్య కార్యాచరణ కమిటీ' (బిసి జెఎసి) 'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, బంద్‌లో ప్రత్యక్షంగా పాల్గొంటామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు ప్రకటించారు. రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే అన్ని రాజకీయ పార్టీలనూ కలుపుకుని ముందుకు సాగాలని బిసి జెఎసికి సూచించారు. రిజర్వేషన్ల విషయంలో కొందరు వంకరగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసి బిల్లులను ఆమోదించి, రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైనే ఉందని స్పష్టం చేశారు. 'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరుతూ 'బిసి ఐక్య కార్యాచరణ కమిటీ' (బిసి జెఎసి) చైర్మన్ ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, కో చైర్మన్లు రాజారామ్ యాదవ్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో సోమవారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు లేఖను అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి తరువాయి 2లో

## జిల్లా, మండల కేంద్రాలలో 15న రాస్తారోకోలు

- నిరసన ప్రదర్శనలను నిర్వహించాలి
- 'బిసి హక్కుల సాధన సమితి' రాష్ట్ర కౌన్సిల్ పిలుపు
- మద్దతు ప్రకటించిన బిసి జెఎసి

ప్రజాపక్షం/హైదరాబాద్

స్థానిక సంస్థలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒపైన హైకోర్టు స్టే విధించడాన్ని ఖండిస్తూ ఈనెల 15న జిల్లా, మండల కేంద్రాలలో రాస్తారోకోలు, నిరసన ప్రదర్శనలను నిర్వహించాలని 'బిసి హక్కుల సాధన సమితి' రాష్ట్ర కౌన్సిల్ సమావేశం పిలుపునిచ్చింది. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని మఖ్దూంభవన్ లో జరిగిన సమావేశ నిర్ణయాలను బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనంజయ నాయుడు సోమవారం వెల్లడించారు.తరతరాలుగా అణిచివేతకు, వివక్షతకు గురవుతున్న బిసిల పట్ల పాలక పార్టీలు అవలంబిస్తున్న విధానాలను కౌన్సిల్ సమావేశం నిరసించిందని, బిసిలు చైతన్యంతో సంగటితమై చేసిన పోరాటాల ఫలితంగానే స్థానిక తరువాయి 2లో

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నామినేషన్ షురూ

### తొలిరోజు 10 మంది దాఖలు




ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సోమవారం నోటిఫికేషన్ విడుదల కావడంతో నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలువురు నామినేషన్‌లు దాఖలు చేశారు. ఈ ఉపఎన్నికకు తొలిరోజు 10 నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో రెండు రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు కాగా, 8 స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. తెలంగాణా పునర్ నిర్మాణ సమితి తరుపున పూస శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. నవతరం పార్టీ నుంచి అర్వపల్లి శ్రీనివాస రావు నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా సిలివేరు శ్రీకాంత్, పెసరకాయల పరీక్షిత్ రెడ్డి, చలిక చంద్ర శేఖర్, సపవత్ సుమన్, వేముల విక్రమ్ రెడ్డి, ఇబ్రహీం ఖాన్, సయ్యద్ ముస్తఫా హుస్సేన్, సల్మాన్ ఖాన్‌లు నామినేషన్‌లు దాఖలు చేశారు. దీంతో తొలిరోజు నామినేషన్ ప్రక్రియ పూర్తి అయ్యింది. హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల కావడంతో నామినేషన్లు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఈనెల 21వ తేదీ వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను తరువాయి 2లో



## కరూర్ తొక్కిసలాటపై సిబిఐ విచారణ

### సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ :** టివికె అధినేత విజయ్ తమిళనాడులోని కరూర్‌లో నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట ఘటనపై సిబిఐ దర్యాప్తునకు సుప్రీంకోర్టు ఆదేశించింది. సిబిఐ దర్యాప్తు పర్యవేక్షణకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీ ఏర్పాటు చేస్తూ ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. ఈ దుర్ఘటన తీవ్రమైన పరిణామాలు, పౌరుల ప్రాథమిక హక్కులపై దాని ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ తీర్పును ఇచ్చినట్లు జస్టిస్ జె మహేశ్వరి వ్యాఖ్యానించారు. కరూర్ ఘటన దేశ మనస్సాక్షిని తరువాయి 12లో

## జువైనల్ హోమ్ బాలలపై లైంగిక దాడి



### హోం సంరక్షకుడే నిందితుడు : అరెస్టు

ప్రజాపక్షం /హైదరాబాద్

బాల నేరస్థులకు శిక్షలు పడ్డ తర్వాత జువైనల్ హోంకు తరలిస్తారు. మరి అలాంటి జువైనల్ హోంలో బాలలకు రక్షణ లేకుండా పోయింది. సైదాబాద్ జువైనల్ హోం సంరక్షకుడు రహమాన్ గత కొంతకాలంగా ఆరుగురు బాలురపై అసహజ లైంగిక వాంఛతీర్చుకున్నాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రహమాన్ వికృత చేష్టలకు భయపడి దసరా సెలవుల అనంతరం ఇంటి నుంచి జువైనల్ హోంకు ఓ బాలుడు తిరిగి వెళ్లడానికి భయపడుతున్నాడు. జువైనల్ హోంకు వెళ్లనని ఆ బాలుడు భీష్మించుకుని కూర్చున్నాడు. తల్లి గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తే అసలు విషయం బయట పడింది. బాలుడిపై ప్రతీ రోజు సంరక్షకుడే అసహజ పద్ధతిలో లైంగిక వాంఛ తీర్చుకునేవాడు. బాలుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రహమాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు రహమాన్ ను విచారణ చేయగా మొత్తం ఆరుగురు బాలురిపై లైంగిక దాడి జరిగినట్లు వెల్లడైంది. బాధిత బాలుడికి వైద్య పరీక్షలు చేస్తే లైంగిక దాడి జరిగినట్లు రుజువైంది. మరో ఐదుగురు బాలురకి వైద్య పరీక్షలు చేస్తున్నారు.లైంగిక దాడి ఘటనపై దర్యాప్తు అధికారిగా తననునియమించినట్లు మహిళా సూపరింటెండెంట్ మైథిలి చెప్పారు. బాల సదన్‌లో విచారణ చేపట్టామని, పలువురు పిల్లలతో మాట్లాడామన్నారు. మైనర్ బాలుడుపై లైంగిక దాడి జరిగిన మాట వాస్తవమేనని. ఇదే విషయంపై నివేదిక తరువాయి 2లో

## ఐపిఎస్ అధికారి పూరణ్ కుమార్ ఆత్మహత్య దారుణం



- ప్రధాని, హోంమంత్రి రాజ్యాంగ బాధ్యతను నిర్వర్తించాలి
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు
- చండీగఢ్‌లో బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాపక్షం/హైదరాబాద్

'తెలంగాణకు చెందిన సీనియర్ ఐపిఎస్ అధికారి వై.పూరణ్ కుమార్ మరణం నన్ను తీవ్రంగా బాధించింది. ఇది నిజంగా చాలా దురదృష్టకరమైన ఘటన' అని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఇటీవల కుల వివక్ష భావన, ఉన్నతాధికారుల మానసిక వేధింపుల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడిన అడిషనల్ డిజి పూరణ్ కుమార్ కుటుంబాన్ని సోమవారం భట్టి విక్రమార్క మల్లు పరామర్శించారు. ఈ సందర్భంగా కుమార్ భార్య ఐఎఎస్ అధికారి అమ్‌నీత్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోన్‌లో పరామర్శించి సంఘీభావం తెలిపారు. పూరన్ కుమార్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు భరోసా ఇచ్చారు. అనంతరం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్థానిక మీడియాతో మాట్లాడారు. హరియాణాలో అదనపు డిజిగా పని చేసిన ఆయన, అత్యంత ప్రతిష్టాత్మకమైన 'రా' విభాగంలో కూడా సేవలందించారు అని తెలిపారు. ఉత్తమ సేవలకు గాను రాష్ట్రపతి మెడళ్ళను కూడా అందుకున్న ప్రతిభావంతులు ఆయన. అలాంటి గొప్ప అధికారి ఈ నెల 7న ఆత్మహత్య చేసుకోవడం తీవ్రంగా కలచి వేసే అంశం అని డిప్యూటీ సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు ఆయన రాసిన , మరణ వాగ్మూలంలో డిజిపి కపూర్, ఎస్‌పి నరేంద్ర అనే ఇద్దరు అధికారులు తనను అడుగడుగునా అవమానించి, వేధించడం వల్లే చనిపోతున్నానని స్పష్టంగా పేర్కొన్నారు అని తెలిపారు. చట్టం ప్రకారం ఇలాంటి సాక్ష్యం ఉన్నప్పుడు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి కదా అన్నారు. అయితే, ఏడు రోజులు గడుస్తున్నా హర్యానా ప్రభుత్వం, చండీగఢ్ పోలీసులు నిందితులపై ఎలాంటి చర్యలు తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## గాజావల్ల ఇక మాకు భయం లేదు: ఐడిఎఫ్

**జెరూసలెం:** రెండేళ్ళపాటు గాజాలో చేసిన యుద్ధంలో విజయం సాధించామని ఇజ్రాయెల్ సైనిక దళాల ప్రధానాధికారి లెఫ్టినెంట్ జనరల్ ఎయల్ జామిర్ ప్రకటించారు. ఇక గాజా నుండి తమకు ఎలాంటి ప్రమాదం పొంచిలేదన్నారు. హమాస్‌పై తాము అన్నివైపుల నుండీ తీవ్రమైన ఒత్తిడిపెట్టామని, మరోవైపు మిత్రదేశాలు కూడా దౌత్యపరమైన ప్రయత్నాలు ముమ్మడం చేయడం ద్వారా చివరకు బందీలను ఒప్పగించే విధంగా లొంగదీశామని అన్నారు. ఇరవైమంది ఇజ్రాయెలీ బందీలను హమాస్ సోమవారం తెల్లారుజామునుండి మధ్యాహ్నం వరకూ రెండు విడతలుగా విడుదల చేసిన తర్వాత ఐడిఎఫ్ ప్రధానాధిపతి ఈ ప్రకటన చేశారు. గాజా స్ట్రిప్ నుండి ఇజ్రాయెల్ పౌరులకు ఎలాంటి భయం, బెదిరింపులు రాకుండా తమ భద్రతా చర్యలను కొనసాగిస్తామని, ఈ భద్రతా వ్యవస్థకు ఒకరూపం ఇచ్చి పూర్తి భరోసా ప్రజలకు కల్పిస్తామన్నారు. హమాస్ వద్ద రెండేళ్ళుగా ఉండిపోయిన బందీలందరూ తిరిగి రావడంతో మా యుద్ధ లక్ష్యం నెరవేరిందన్నారు. బందీలు, సైనికుల భద్రతే లక్ష్యంగా తాము వ్యూహాలు పన్ని యుద్ధాన్ని ముందుకు తీసుకువెళ్ళామన్నారు.

## ఇదంతా నోబెల్ బహుమతి కోసం చేయలేదు

### లక్షల ప్రాణాలు కాపాడేందుకే చేశా :ట్రంప్



**విమానంలో:** గాజాలో యుద్ధం ముగిసిందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. విమానంలో ఇజ్రాయెల్ మీదుగా ఈజిప్టు వెళ్ళేందుకు మేరీలాండ్ నుండి ఎయిర్‌ఫోర్స్–1లో సోమవారం ఉదయం బయల్దేరిన ట్రంప్ ప్రయాణమార్గంలో పాత్రికేయులతో మాట్లాడుతూ.. ''ఇదంతా (గాజాలో శాంతిస్థాపన కృషి, ఇతర యుద్ధాల నివారణ) నోబెల్ బహుమతి కోసం చేయలేదని, లక్షలమంది ప్రజల ప్రాణాలు కాపాడటంకోసమే చేశానని అన్నారు. టెల్‌అవీవ్‌లో ఆదివారం, సోమవారం ఐదు లక్షలమంది ప్రజలు తమ ప్రియతములైన బంధువులు, స్నేహితులకోసం ఎదురుచూస్తున్నారని, ఇదెంతో ఉద్వేగభరితమైన క్షణాలని అన్నారు. ముస్లిం దేశాలు, అరబ్ దేశాలన్నీ ఎంతో సంతోషంలో మునిగి ఉన్నాయన్నారు. ''నెతన్యాహూ ఇంతవరకూ ఈ యుద్ధం ముగిసిందని ప్రకటించలేదు, మరి మీ దృష్టిలో యుద్ధం ముగిసినట్టేనా?'' అని ఒక పాత్రికేయుడు ప్రశ్నించగా, ''యుద్ధం ముగిసింది, యుద్ధం ముగిసింది, సరేనా? మీకు అర్థమైంది కదా!'' అని ట్రంప్ పునరుద్ఘాటించారు. తర్వాత బెన్‌గురియన్స్ విమానాశ్రయంలో దిగినప్పుడు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ దంపతులు సహా పలువురు ప్రముఖులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఇజ్రాయెలీ పార్లమెంటుకు వెళ్ళి ఆ చట్టసభలో సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం ఈజిప్టు తీర ప్రాంత నగరం షర్మ్–ఎల్–షేక్‌లో 20 దేశాల నాయకులు, అంతర్జాతీయ సంస్థల అధిపతులు హాజరైన శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్ని గాజాలో శాంతి స్థాపన ఒప్పందంపై సంతకాలు చేశారు. తనకంటే ముందు అమెరికా అధ్యక్షుడుగా పనిచేసిన జో బైడెన్ యూరప్‌లో, మధ్యప్రాచ్యంలో జరుగుతున్న రెండు యుద్ధాలను నివారించేందుకు సక్రమ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. బైడెన్ పాలనాకాలంలో ఉక్రేన్, గాజాలలో జరుగుతున్న యుద్ధాలపట్ల తప్పుడు విధానాలు అనుసరించి తప్పుడు నిర్ణయాలు తీసుకున్నారని, అసమర్థంగా వ్యవహరించారని ట్రంప్ విమర్శించారు. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూతో తనకు చాలా మంచి సంబంధాలు ఉన్నాయని, ఆయనే తనను నోబెల్ బహుమతిస్థాయికి సిఫార్సు చేశారని అన్నారు. గాజాలో శాంతి ఏర్పడేందుకు జరిగిన ఒప్పందం కుదిరే విషయంలో ఖతార్ ప్రభుత్వం నిజంగా ఎంతో గొప్ప సహాయం తమకు చేసిందని ప్రశంసించారు. ఖతార్ ఎమిర్ తమిమ్ బిన్ హమద్ అల్–థానీ ఎంతో గొప్ప వ్యక్తి అని ప్రశంసల జల్లుకురిపించారు. మధ్యప్రాచ్యంలో ఖతార్ తమకు ఎంతో విలువైన మిత్రదేశమని, ఆ దేశంతో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని నెతన్యాహూకు గతంలో రెండుసార్లు ట్రంప్ హెచ్చరిక చేశారు. ట్రంప్ శాంతి ప్రణాళికపై చర్చించేందుకు హమాస్ అగ్ర నాయకత్వం దోహాలో సమావేశమైనప్పుడు ఇజ్రాయెల్ సైనికులు గతనెలలో ఆ సమావశ భవంతిపై దాడి చేసి ప్రపంచవ్యాప్తంగా విమర్శలకు గురైంది. ట్రంప్ కూడా ఈ చర్యపట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత నెతన్యాహూతో ఖతార్‌కు ట్రంప్ క్షమాపణలు చెప్పించారు.

## గాజా అంతఃకలహాల్లో 27 మంది మృతి

**గాజా:** గాజా నుండి ఇజ్రాయెల్ సైన్యాలు వైదొలగిన 72 గంటల తర్వాత హమాస్ ఫైటర్లు తిరిగి తన ఉనికిని చాటుకోవడం ప్రారంభించారు. ఇస్లాం సైన్యంగా ప్రకటించుకున్న డాగ్ముష్ (దుగ్ముష్) తెగ కుటుంబాలపై 300 మంది హమాస్ భద్రతాదళాలు సోమవారం సామూహిక కాల్పుల దాడికి పాల్పడ్డాయి. దక్షిణ గాజా టెల్ అల్ హనా సమీపంలోని భవనంలోకి హమాస్ దళాలు చొచ్చుకుపోయి కాల్పులు జరిపాయి. ఈ పరస్పర కాల్పుల్లో 19 మంది డాగ్ముష్ తెగ కుటుంబీకులు, 8 మంది హమాస్ ఫైటర్లు హతులయ్యారు. ఈ కాల్పుల ఘటన ప్రారంభం కాగానే ఈ చుట్టుపక్కల ప్రజలు భయాందోళన చెంది ఇళ్ళు వదలి పారిపోయారు. అక్కడి ప్రజలు ఇప్పటికే భయం భయంగా జీవితాలు గడుపుతున్నారు. ఇప్పటికే రెండు మూడుసార్లు ఇళ్ళు వదలి పారిపోయి మళ్ళీ మెల్లిగా ఇళ్ళకు తిరిగి వచ్చారు. ఆహారం, మానవతాసహాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ పరిస్థితులమధ్య ఈ అంతఃసంఘర్షణ చెలరేగింది. 2023 నవంబరులో సబ్ర,గాజాలలో ఉన్న మసీదులపై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో డాగ్ముష్ తెగకు చెందిన 44 మంది హతులయ్యారు. గత ఏడాది మార్చిలో ఐడిఎఫ్ చేసిన దాడుల్లో డాగ్ముష్ తెగ నాయకుడు సలేహ్ డాగ్ముష్ హతుడయ్యాడు. ఒకప్పుడు జోర్డాన్ ఆసుపత్రిగా ఉన్న ప్రస్తుత నివాసభవనంలోకి హమాస్ ఫైటర్లు చొచ్చుకువెళ్ళి అందులో తలదాచుకున్న డాగ్ముష్ తెగ కుటుంబీలపై కాల్పులు జరిపారు. దాదాపు 100 సంవత్సరాల కంటే ముందే ఈజిప్టు నుండి డాగ్ముష్ తెగ కుటుంబాలు గాజాకు వచ్చి స్థిరపడ్డాయి. వివిధ పాలస్తీనా ఇస్లామిక్ గ్రూపులతో ఈ తెగ కుటుంబాలకు సంబంధాలు ఉన్నాయి. దశాబ్దాలకాలంగా డాగ్ముష్ తెగ–హమాస్ దళాల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. గాజాలో శాంతి నెలకున్న తర్వాత సైన్యం వెనక్కి వెళ్ళిపోయిన నాలుగు రోజులకు ఈ ఘర్షణల కొనసాగింపులో భాగంగా హమాస్ భద్రతా దళాలు సామూహిక దాడి చేయడంతో మళ్ళీ మొదటిసారి గాజాలో అంత్యత పాశవికమైన హింసాత్మక అంతర్గత సంఘర్షణకు తెరలేచింది. దాదాపు ఏడువేల మంది హమాస్ ఫైటర్లు గాజాలోని అనేక జిల్లాలో ప్రాంతాలను మోహరించాయని వచ్చిన వార్తలను హమాస్ ఖండించింది.

హమాస్‌కు చెందిన ఇద్దరు భద్రతా సిబ్బందిని డాగ్ముష్ తెగ కుటుంబీకులు హత్యచేశారని, వారిపై ప్రతీకారం తీర్చుకోవడానికే సామూహిక దాడి చేశామని హమాస్ వాదిస్తుండగా, వారే తమపై హింసాత్మక దాడి చేశారని డాగ్ముష్ తెగ కుటుంబీకులు చెబుతున్నారు. 2008లో గాజాలో అంతర్యుద్ధం తర్వాత హమాస్ పాలస్తీనాపై ఆధిపత్యం సాధించింది. ఇక అప్పటినుండీ డాగ్ముష్–హమాస్ దళాలమధ్య తరచు హింసాత్మక ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. పాలస్తీనాలో హమాస్ ప్రమే యం లేని ప్రభుత్వ స్థాపన జరగాలని ఐక్యరాజ్యసమితి, ఇతర అగ్రదేశాలు ఇటీవల అభిప్రాయాలు వ్యక్తం చేశాయి. హమాస్ ఆయుధాలు వదిలిపెట్టాలన్నది కూడా ట్రంప్ ప్రకటించిన 20 అంశాల ప్రణాళికలో ప్రధానాంశంగా ఉంది. మొదటిదశ గాజా ఒప్పందంలో భాగంగా 20 మంది బందీలను హమాస్ విడుదల చేసిన రోజునే గాజాసిటీలో ఈ అంతఃకలహాలు మొదలయ్యాయి.


## అవినీతి కేసుల్లో నెతన్యాహుకు క్షమాభిక్ష ఇవ్వండి

### ఇజ్రాయెల్ పార్లమెంటులో ఆ దేశాధ్యక్షుణ్ణి కోరిన ట్రంప్

**జెరూసలెం:** అవినీతి కేసుల నుండి నెతన్యాహూకు క్షమాభిక్ష ఇవ్వాలని ఇజ్రాయెల్ దేశాధ్యక్షుడిని ట్రంప్ కోరారు. అదేవిధంగా మధ్యప్రాచ్యంలో సరికొత్త ఉషోదయానికి తెర లేచిందని ఇజ్రాయెల్ పార్లమెంటులో సుదీర్ఘ హర్షధ్వానాల మధ్య ట్రంప్ ప్రకటించారు. గాజా నుండి ఇజ్రాయెల్ బందీల విడుదల–ఇజ్రాయెల్ జైళ్ళ నుండి 2000 మంది పాలస్తీనా ఖైదీల విడుదల వంటి చరిత్రాత్మక ఘట్టాలను స్వయంగా వీక్షించేందుకు టెల్‌అవీవ్‌కు చేరుకున్న ట్రంప్ సోమవారం మధ్యాహ్నం ఇజ్రాయెల్ పార్లమెంటు 'క్నెస్సెట్'లో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ చట్టసభ సభ్యులు లేచినిలబడి ఎంతో గౌరవంగా ఎక్కువసేపు కరతాళ ధ్వనులు చేస్తూ ట్రంప్ పట్ల గౌరవం ప్రకటించారు. ఈ ప్రపంచానికి మరింత మంది ట్రంప్‌లు కావాలని నెతన్యాహూ ప్రసంసించారు.

ఇప్పుడు ఇజ్రాయెల్‌ను మళ్ళీ అందరూ ప్రేమించడం ప్రారంభించారని కరతాళ ధ్వనులమధ్య ట్రంప్ తన ప్రసంగంలో ప్రకటించారు. ఆయుధబలంతో గెలవగలిగినదంతా ఇజ్రాయెల్ గెలుచుకుందని, ఇక మధ్యప్రాచ్యంలో శాంతి నెలకొనాల్సి ఉందని అన్నారు. గాజా నుండి ఇజ్రాయెల్ సైనికులు వెనక్కు వెళ్ళిపోవడం ద్వారా ఆ ప్రాంతం నిస్సైనికమండలంగా మారిందని, అదేవిధంగా బందీలు విడుదలయ్యారని, ఇక హమాస్ ఆయుధాలను వదిలిపెట్టవలసి ఉంటుందని, ఐతే, ఈ విషయంపై వారు ఇంకా తమ నిర్ణయాన్ని చెప్పి అంగీకారం తెలియజేయాల్సి ఉంటుందని ట్రంప్ అన్నారు. ట్రంప్ తన ప్రసంగంలో ఎక్కువగా నెతన్యాహూపై ప్రశంసలు కురిపించారు. ఇజ్రాయెల్–అమెరికా సంబంధాలు ఎంతో బలంగా ఉన్నాయని పదే పదే ఉద్ఘాటించారు. ఇజ్రాయెల్‌కు ఆయుధాలు ఇవ్వాలని పదే పదే నెతన్యాహూ తనకు ఫోన్లు చేసిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ ఆ ఆయుధ బలమే ఈనాడు శాంతికి దారితీసిందన్నారు. ఇకమీద భవిష్యత్తులో అవినీతి కేసుల్లో ఎలాంటి విచారణకు లేకుండా నెతన్యాహూకు క్షమాపణలు ప్రసాదించాలని తన ప్రసంగంలో ఇజ్రాయెల్ దేశాధ్యక్షుడికి ట్రంప్ విజ్ఞప్తి చేశారు. ''ఐ లవ్ ఇజ్రాయెల్, ఇజ్రాయెల్‌కు అన్ని విధాలా, అన్నివేళలా అండగా ఉంటాను'' అంటూ ఆయన తన ప్రసంగం ముగించారు. ట్రంప్ ప్రకటించిన 20 అంశాల గాజా శాంతి ప్రణాళికలో కొన్ని అంశాలను హమాస్ అంగీకరించలేదు. చాలా అంశాలపై తదుపరి ఇంకా చర్చలు జరగాల్సి ఉంటుందని హమాస్ ప్రతినిధులు గతవారం షర్మ్–ఎల్–షేక్‌లో మధ్యవర్తుల ద్వారా జరిగిన చర్చల్లో స్పష్టం చేశారు. కొన్ని మౌలిక అంశాలను మాత్రం వారు అంగీకరించారు.

## తీవ్ర పరిణామాలు : రష్యా



**మాస్కో:** ఉక్రేన్‌కు తోమాహక్ క్షిపణులను సరఫరా చేస్తే ఆ దేశానికి తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని అమెరికాకు రష్యా తిరిగి హెచ్చరిక జారీ చేసింది. క్రెమ్లిన్ కార్యాలయంలో పుతిన్ అధికార ప్రతినిధి ద్మీత్రీ పెస్కోవ్ సోమవారం పాత్రికేయులకు ఈ విషయం చెప్పారు. ఉక్రేన్‌కు తోమాహక్ క్షిపణులు సరఫరా చేస్తే ఖచ్చితంగా వాటిని నిర్వహించడానికి అమెరికా నిపుణులు అవసరం అవుతారని, ఈ విధంగా అమెరికా యుద్ధ నిపుణులను, తోమాహక్ క్షిపణులను ఉక్రేన్‌లో మోహరిస్తే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయన్నారు. రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ ఛైర్మన్ ద్మీత్రీ మెద్వెదేవ్ సోషల్ మీడియాలో చేసిన పోస్టింగ్‌పై స్పందించాలని పెస్కోవ్‌ను కోరినప్పుడు, తోహాహక్ క్షిపణులను ఉక్రేన్‌కు ఇస్తే, వాటిని ఆ దేశ సైన్యం ప్రయోగించలేదని, ఖచ్చితంగా అమెరికా యుద్ధ నిపుణుల జోక్యం ఉక్రేన్‌లో అవసరం అవుతుందని, ఇది యుద్ధంలో అమెరికా ప్రత్యక్ష జోక్యంకిందకే వస్తుందని ఈ విషయాన్నే మెద్వెదేవ్ తన పోస్టింగ్ ద్వారా వివరించారని పెస్కోవ్ చెప్పారు.

## పుతిన్‌కు ట్రంప్ హెచ్చరిక



**వాషింగ్టన్ :** ఉక్రేన్‌లో యుద్ధాన్ని వీలైనంత త్వరగా పరిష్కరించాలని రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కోరారు. యుద్ధాన్ని ఇదేవిధంగా కొనసాగిస్తే, ఇక ఉక్రేన్‌కు తాము అత్యంతశక్తిమంతమైన తోమాహక్ క్షిపణులను సమకూర్చవలసి వస్తుందని పుతిన్‌కు హెచ్చరిక చేశారు. తోమాహక్ క్షిపణులు దీర్ఘశ్రేణి క్షిపణులుకాగా, ఇవి సుదూరుప్రాంతాలలో ఉన్న లక్ష్యాలను ఖచ్చితత్వంతో దెబ్బతీస్తాయి. 2022 ఫిబ్రవరిలో ఉక్రేన్‌పై రష్యా యుద్ధం ప్రారంభించింది. ఇప్పటివరకూ 40 శాతం ఉక్రేన్ భూభాగాన్ని స్వాధీనం చేసుకుంది. ఉక్రేన్‌లో యుద్ధం నెలరోజుల్లో ఆపుతానని డోనాల్డ్ ట్రంప్ గత ఏడాది జరిగిన అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ప్రజలకు హామీ ఇచ్చారు.



## బిసిల ఉద్యమ సెగ చూపిస్తాం

### బిసి జెఎసి ఛైర్మన్ ఆర్.కృష్ణయ్య, అమరవీరుల స్థూపం వద్ద బంద్ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** బిసిల 42శాతం రిజర్వేషన్ల సాధన ధ్యేయంగా ఈ నెల 18న నిర్వహించ తలపెట్టిన రాష్ట్రబంద్‌లో బిసిల ఉద్యమ సెగ ఏంటో చూపిస్తామని బిసి జెఎసి ఛైర్మన్ ఎంపి ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ ఛైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ గన్‌ఫౌండ్రీలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద బిసిల రాష్ట్ర బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జెఎసి వైస్ ఛైర్మన్ విజిఆర్ నారగోని, కో–ఛైర్మన్ రాజారామ్ యాదవ్, కో–ఆర్డినేటర్ గుజ్జ కృష్ణ తదితరుల బిసి నేతలతో కలిసి వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసిల ఆత్మగౌరవం వంచనకు గురైందన్నారు. రిజర్వేషన్లను అడ్డుకొనే అగ్రకులాల కుట్రలను పటాపంచలు చేస్తామన్నారు. 42శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం సరికాదన్నారు. చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా చేపట్టే ఈ బంద్‌కు విద్యావేత్తలు, వ్యాపారసంస్థలు, ఉద్యోగులు, యువకులు, విద్యార్థులు సహకరించాలని కోరారు. తెలంగాణ యావత్తు బిసి సమాజం బంద్‌లో పాల్గొని, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిసి సంఘం నేతలు గుజ్జ సత్యం, నీలం వెంకటేశ్, కుందారపు గణేశాచారి, జిల్లపల్లి అంజి, కుల్కచర్ల శ్రీనివాస్, అనంతయ్య, సి.రాజేందర్, వేముల రామకృష్ణ తదితర నేతలు పాల్గొన్నారు.

## 15న రాస్తారోకోలు

(మొదటి పేజీ తరువాయి)

సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ జిఒ జారీ అవుతే , అగ్రకులాలకు చెందిన బిసి ద్రోహులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం దుర్మార్గమని వారు తెలిపారు. ఇప్పటికైనా బిసిద్రోహులు తమ వైఖరిని మార్చుకుని పిటిషన్‌ను వెనక్కి తీసుకోవాలని,లేదంటే బిసిల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని సమావేశం హెచ్చరించింది. సమావేశ నిర్ణయాలు: బిసిలకు 42శాతం రిజర్వేషన్ పై హైకోర్టు విధించిన స్టేను ఎత్తివేయాలని, బిసి రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే 9వ షెడ్యూల్‌లో చేర్చాలని సమావేశం డిమాండ్ చేసింది. ఈనెల 15న జిల్లా, మండల కేంద్రాలలో నిరసనలు, రాస్తారోకోలు నిర్వహించాలని, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు కలిసి వచ్చే సంఘాలన్నింటితో కలిసి ఐక్య ఉద్యమాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించినట్టు వెంకట్రాములు, ధనుంజయ నాయుడు తెలిపారు. బిసి రిజర్వేషన్ల సాధన కోసం 'బిసి హక్కుల సాధన సమితి' ఈనెల 15న తలపెట్టిన రాస్తారోకోకు తమ సంపూర్ణ మద్దతు శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు.

## నోటిఫికేషన్ జారీ

(మొదటి పేజీ తరువాయి)

స్వీకరిస్తామన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయం 100 మీటర్ల వరకు ఆంక్షలు అమలులో ఉన్నాయని చెప్పారు. 100 మీటర్ల వరకు ఎలాంటి ర్యాలీలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. 4 వేల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉన్నారన్నారు. నియోజవర్గ పరిధిలో 45 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని కర్ణన్ వెల్లడించారు. వెబ్‌సైట్ https://encore.eci.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో కూడా నామినేషన్ పత్రాలను అప్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అప్‌లోడ్ చేసిన తరువాత వచ్చే ప్రింటెడ్ హార్డ్ కాపీని రిటర్నింగ్ ఆఫీసర్‌కు తప్పకుండా అందించాలని సూచించారు.

### పేదరిక నిర్మూలనకు

## తెలంగాణ మోడల్‌గా టిజిఐఎల్‌పి ఉండాలి

### మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిల్డింగ్ రిసోర్సెస్ అక్రాస్ కమ్యూనిటీ (బ్రాక్) తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న 'తెలంగాణ సమ్మిళిత జీవనోపాధి' కార్యక్రమాన్ని (టిజిఐఎల్‌పి) పేదరికంపై తుది పోరాటంగా మారాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆకాంక్షించారు. ఆ పోరాటంలో తమ ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరిస్తుందన్నారు. పేదరికంపైన జరిగే తుది పోరులో విజయం సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి సీతక్కను బ్రాక్ ప్రతినిధుల బృందం సోమవారం మర్యాదపూర్వకంగా కలిసింది. సెర్ప్ సిఇఒ దివ్యా దేవరాజన్ తెలంగాణలో టిజిఐఎల్‌పి సాధించిన పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పేదరిక నిర్మూలన దిశలో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషికి బ్రాక్ సంస్థ తమ వంతు సహకారం అందించాలన్నారు. అత్యంత పేద కుటుంబాలను గుర్తించి, వారికి స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడమే టిజిఐఎల్‌పి లక్ష్యమన్నారు. స్థానిక వనరులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా జీవనోపాధి కార్యక్రమాలను రూపకల్పన చేయాలన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో విరివిగా లభించే ఇప్ప పువ్వు ఆధారంగా నూనె, ఆహార పదార్థాలు తయారీకి సంబంధించిన కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేయాలన్నారు. స్వచ్ఛమైన ఇప్పపువ్వు ఆరోగ్య పరిరక్షణకు ఎంతో మేలు చేస్తుందని, దీని విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి ఆదాయ వనరుగా మలచవచ్చని మంత్రి వివరించారు. ప్రస్తుతం ఐదు జిల్లాల పరిధిలోని ఎనిమిది మండలాల్లో టిజిఐఎల్‌పి అమలవుతోందని, ఇప్పటి వరకు 3,554 అత్యంత పేద కుటుంబాలను గుర్తించామని బ్రాక్ ప్రతినిధులు మంత్రి సీతక్కకు నివేదించారు. ఈ సమావేశంలో గ్రెగరీ చెన్ (మేనేజింగ్ డైరెక్టర్, అల్టా పూర్ (గ్రాడ్యుయేషన్ ఇనిషేటీవ్), శ్వేతా బెనర్జీ (ఇండియా లీడ్), ఉషా రాణి (ప్రోగ్రాం లీడ్), వి. రమేష్ (సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్), తదితరులు పాల్గొన్నారు.

## రూ.60 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు తరచుగా హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని సిఎం ఆదేశించారు.

**బకాయిల చెల్లింపునకు కార్యాచరణ ప్రణాళిక**

బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ హాస్టళ్లకు స్కాలర్‌షిప్‌లు, సిబ్బంది జీతాలు, డైట్ ఛార్జీలు, నిర్మాణ ఖర్చులు, ఇతర ఖర్చులు, బకాయిల చెల్లింపు, హాస్టళ్ల నిర్వహణకు అయ్యే నెలవారీ ఖర్చులు, బకాయిల చెల్లింపుకు అవసరమైన మొత్తానికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సమర్పించాలని సిఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌లను ఆదేశించారు.

హాస్టళ్ల కోసం కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి నిధులను సమీకరించాలని, వాటికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్‌ను వెంటనే విడుదల చేయాలని సిఎం ఆదేశించారు. విద్యార్థులకు 24 గంటలూ ఆన్‌లైన్‌లో వైద్యులు అందుబాటులో ఉండేలా హాట్‌లైన్‌లో ఏర్పాటు చేయాలని, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఎడ్‌టెక్‌ను ఉపయోగించుకోవాలని సిఎం సూచించారు. హాస్టల్ విద్యార్థులకు అందించే సేవలను సోషల్ మీడియా ద్వారా తెలియజేయాలని, ఉద్దేశపూర్వకంగా చేసే తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవాలని సిఎం సూచించారు. వీటన్నింటికీ అవసరమైన యాప్ లను రూపొందించాలని సిఎం ఆదేశించారు.

సమీక్షకు ముందు సంక్షేమ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ హాస్టళ్లలోని పరిస్థితులపై ప్రజెంటేషన్ ఇచ్చారు. సమీక్షలో రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, సిఎం ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, సిఎం ఓఎస్‌డి వేముల శ్రీనివాసులు, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ, వికలాంగుల శాఖల అధికారులు జ్యోతి బుద్ధప్రకాష్ జ్యోతి, బి.షఫియుల్లా, అనితా రామచంద్రన్, క్షితిజ, నిర్మల క్రాంతి వెస్లీ, కృష్ణ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ సంపూర్ణ మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, జాతీయ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం నాయకులు డి.జి.సాయిలు గౌడ్, బొమ్మగాని నాగభూషణం, మారగోని ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పేద వర్గాల కోసం పనిచేయడం, పోరాటం చేయడమే కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతం అన్నారు. బొమ్మగాని ధర్మభిక్షం గీత పనివారల సంఘాన్ని మొట్ట మొదట ఏర్పాటు చేసిన తర్వాత, ఆ పరంపరలోనే వృత్తి సంఘం, డిహెచ్‌పిఎస్ తదితర ప్రజా సంఘాలు ఏర్పాటయ్యాయని కూనంనేని గుర్తు చేశారు. వర్గ ప్రయోజనాలను కాపాడుతూనే, కులంలో ఉన్న సామాజిక, సంస్కృతిక వెనుకబాటుతనాన్ని తొలగించేలా పనిచేయాలని, ఆ దిశగా పోరాటం చేయాలని సూచించారు. 10 శాతం ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు ప్రవేశపెట్టగానే 50 శాతం ఉన్న రిజర్వేషన్ల పరిమితి తొలగిపోయిందన్నారు. బలహీనవర్గాల హక్కులను కాదనే ధైర్యం ఏ రాజకీయ పార్టీలకూ లేదన్నారు. ప్రభుత్వ శాఖలలో కూడా ఉద్యోగాలు తగ్గిపోతున్నాయని, ప్రైవేటు సంస్థలు కూడా రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బిపి మండల్ కమిషన్‌కు మద్దతు పలకడంతో పాటు ఆ కమిషన్‌కు వ్యతిరేకంగా జరిగిన కమండల్ యాత్రకు వ్యతిరేకంగా పోరాటం చేశామని కూనంనేని గుర్తు చేశారు. బిసి హక్కుల సాధన సమితి ఈ నెల15న చేపట్టనున్న రాస్తారోకోకు కూడా మద్దతు ఇవ్వాలని ఆయన బిసి జెఎసిని కోరారు. నెల్లి కంటిసత్యం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం తరహాలోనే బిసి రిజర్వేషన్ల ఉద్యమాన్ని ఒక సామజిక ఉద్యమంగా చేపట్టాలన్నారు. న్యాయబద్ధమైన రిజర్వేషన్లను గవర్నర్ వ్యవస్థ ద్వారా బిల్లులను ఆపారన్నారు. ఎస్‌సి వర్గీకరణకు కూడా మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ రిజర్వేషన్ల విషయంలో సిపిఐ మద్దతును మొట్ట మొదటిసారిగా నాడు సురవరం సుధాకర్ రెడ్డి ప్రకటించారని, నిరుద్యోగ, ఉద్యగ, రిజర్వేషన్లు, ఇలా ఎప్పుడు ఏ ఉద్యమాలు చేపట్టినా సిపిఐ మద్దతుగా నిలబడిందని, ప్రత్యక్షంగా పాల్గొన్నదని గుర్తు చేశారు. ప్రస్తుతం బిసి ఉద్యమంలో కూడా కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ హైకోర్టు, సుప్రీంకోర్టు వేదికగా కొందరు బిసి రిజర్వేషన్లకు గండి కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్లను అడ్డుకుంటామని సవాల్ విసురుతున్నారన్నారు. పేదలు, రిజర్వేషన్లు ఇలా అనేక అంశాలలో సిపిఐ మద్దతు ప్రకటించడంతో పాటు ప్రత్యక్ష ఉద్యమాలు చేపట్టిందని గుర్తు చేశారు. బిసి రిజర్వేషన్ల సాధన కోసం 'బిసి హక్కుల సాధన సమితి' ఈనెల 15న తలపెట్టిన రాస్తారోకోకు తమ సంపూర్ణ మద్దతు శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. కార్యక్రమంలో బిసి జెఎసి మీడియా కోఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, నాయకులు కుందారం గణేష్ చారి, వేముల రామకృష్ణ, కులకచర్ల శ్రీనివాస్, నందగోపాల్, రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫైర్ బ్రిగేడ్‌ను సందర్శించిన ఫైర్ డిజి

**ప్రజాపక్షం/హైదరాబాద్:**తెలంగాణ అగ్నిమాపక శాఖ సామర్థ్యాలను మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ సోమవారం ముంబై ఫైర్ బ్రిగేడ్‌ను సందర్శించారు. ఈ సందర్శనలో అక్కడి ఆపరేషనల్ విధానం, సాంకేతిక సదుపాయాలు, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఒపిలు) వంటి అంశాలను సమీక్షించారు. ముంబై ఫైర్ బ్రిగేడ్‌లో అమలులో ఉన్న ఆధునిక విధానాలను పరిశీలించి, తెలంగాణ రాష్ట్ర అగ్నిమాపక వ్యవస్థలో వాటిని అన్వయించుకునే అవకాశాలను ఈ సందర్శనలో గుర్తించారు. కంట్రోల్ రూమ్ మౌలిక సదుపాయాల బలోపేతం, ఆధునిక ఫైర్ రెస్పాన్స్ వాహనాల స్వీకరణ, సమన్వయం, సామర్థ్యాన్ని పెంచేందుకు ఎస్ఒపిలను మెరుగుపరచడంలాంటి ప్రధాన అంశాలపై అక్కడి అధికారులతో చర్చించారు. తెలంగాణ అగ్నిమాపక శాఖ ప్రజా భద్రత రంగంలో నిరంతర అభివృద్ధి, అంతర్‌శాఖ సహకారానికి కట్టుబడి ఉన్నదని ఆయన తెలిపారు.



## ఆత్మహత్య దారుణం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది అని డిప్యూటీ సిఎం తెలిపారు. అంతేకాదు, ఆయన శవపరీక్ష కూడా జరగలేదు. ఆయన మృతదేహానికి ఇప్పటికీ పోస్ట్‌మార్టం కూడా చేయకపోవడం, వృద్ధురాలైన ఆయన తల్లికి, భార్యకు, కూతుళ్లకు కనీసం శవాన్ని చూడటానికి కూడా అనుమతించకపోవడం అత్యంత అమానుషం, దారుణం అన్నారు. ఇది మౌలిక మానవ హక్కుల ఉల్లంఘన. నిందితులలో ఒకరైన మిస్టర్ కపూర్‌పై అప్పటికే కులవివక్ష ఆరోపణలు ఉన్నా, ఆయనను ప్రభుత్వం డిజిపిగా కొనసాగించడం సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ఆయన భార్య, తల్లి, ఇద్దరు కూతుళ్లకు, పూర్తి రక్షణ, న్యాయం కల్పించాలన్నారు. డిప్యూటీ సిఎం వెంట ఎఐసిసి ఎస్‌సి సెల్ అధ్యక్షుడు కొప్పుల రాజు, చండీగఢ్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ లక్కీ, సంవిధాన్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ వినయ్ తదితరులు ఉన్నారు.

## లైంగిక దాడి

(మొదటి పేజీ తరువాయి)

తయారు చేసినట్లు ఆమే పేర్కొన్నారు. నివేదికను సిడబ్ల్యుసి అధికారులకు అందజేశామని అనంతరం చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.'ఈ నెల 11 న బాల సదన్ కు సైదాబాద్ పోలీసులు వచ్చారు. బాధిత బాలుడి ఫోటో చూపించి వివరాలు అడిగారు. ఇంట్లో తల్లిదండ్రులతో పండగ చేసుకుంటానంటే షార్ట్ లీవ్ ఇంటికి పంపాము అని చెప్పాము.11వ తేదీన తల్లితో కలిసి బాబు తనపై లైంగిక దాడి జరిగిందని ఫిర్యాదు చేశారని పోలీసుల ద్వారా తెలిసింది. బాల సదన్ స్టాఫ్ గార్డ్ రెహమాన్ లైంగికంగా వేధించాడని ఫిర్యాదు చేశారు. బాధిత బాలుడు ఫిర్యాదు మేరకు పోలీసులు బాల సదన్ లో విచారణ చేపట్టారు.తనపై లైంగిక దాడికి సంబంధించిన విషయాన్ని బాధిత బాలుడు మరో ముగ్గురికి షేర్ చేసుకున్నాడు.ఆ ముగ్గురు పిల్లలనుండి కూడా పోలీసులు వాంగ్మూలాలు తీసుకున్నారు. స్టాఫ్ గాడ్ రెహమాన్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్టాఫ్ గార్డ్ రెహమాన్ అరెస్టు తర్వాత ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాము. ఒక బాబుపై మాత్రమే లైంగిక దాడి జరిగినట్లు ప్రస్తుతం పోలీసులు చెబుతున్నారు. మిగతా వివరాలు పోలీసులు విచారణలో బయటపడతాయి. మార్చిలో ఈ ఘటన జరిగింది అని పోలీసులు చెప్పారు. అప్పటినుండి ఇప్పటివరకు విషయం బయటికి రాలేదు. బాల సదన్‌కు జ్యుడీషియల్ ఆఫీసర్లు, సి డబ్ల్యూ సి, కౌన్సిలర్లు వచ్చి కౌన్సిలింగ్ చేస్తూ ఉంటారు. వారి ద్వారా కూడా విషయం బయటికి రాలేదు. బాధిత బాలుడు సెప్టెంబర్ 2024 లో బాల సదన్ లో చేరాడు. లైంగిక దాడికి పాల్పడ్డ రెహమాన్ 2022 నుండి పని చేస్తునాడు. పిల్లలకు గ్రీవెన్స్ బాక్స్ ఏర్పాటు చేస్తాం.. దాని ద్వారా సమస్యలు తెలుసుకుని క్లియర్ చేస్తాం. ఘటనపై పై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఇలాంటి పరిస్థితులను ఉపేక్షించము' బాల సదన్ సూపరింటెండెంట్ సయ్యద్ అఫ్జల్ తెలిపారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సమస్యలను పరిష్కరిస్తా :ఆర్‌టిసి ఎండి



ప్రజాపక్షం/హైదరాబాద్: ఆర్‌టిసి కార్మికుల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తానని ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి అన్నారు. ఇటీవల ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వై.నాగిరెడ్డిని భస్‌భవన్‌లోని తన కార్యాలయంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ అభినందనలు తెలియజేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్‌టిసిలో పనిచేస్తున్న కార్మికులు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కొరకు యూనియన్ నేతలు నాగిరెడ్డికి వినతిపత్రం అందించారు. సమస్యలపై సానుకూలంగా స్పందిస్తానని నాగిరెడ్డి వారికి హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పి. కమాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎండి. మౌలానా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.నరేందర్, వైస్ చైర్మన్ చెన్నారెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శులుడి.సాయిలు సయ్యద్ రహీముద్దీన్ కె.స్వామి. ఎంహెచ్ అలీ, జోనల్ కార్యదర్శి వి.బాబు రాష్ట్ర కార్యదర్శులు శీను అనిల్ కుమార్ హరికిషన్ పాల్గొన్నారు.



ఇటీవల సిపిఐ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన పల్లా వెంకట్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిలుగౌడ్, నాయకులు బొమ్మగాని నాగభూషణం, కె.వి.ఎల్, మారగోని ప్రవీణ్‌కుమార్‌గౌడ్. చిత్రంలో ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం ఉన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ శాఖ (భూసేకరణ)

**ఫారం-7**

చట్టం నెం.30/2013 లోని సబ్ -రూల్ (1) ఆఫ్ రూల్ -25 మరియు సెక్షన్ 19(1) చూడుము

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013)

**డిక్లరేషన్**

G1/2679/2025 తేది: 27.09.2025
నెం.జి/3091/1/2024 తేది: 28.08.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ఆదేశానుసారం నల్లగొండ జిల్లా, అడవిదేవులపల్లి మండలం, అడవిదేవులపల్లి గ్రామంలో భూమి విస్తీర్ణం ఎక **2.3275 గుంటలు** ప్రజాప్రయోజనార్థం అప్రోచ్ చానల్, ఫోర్ బే, పంప్ హౌస్, ట్రాన్స్ ఫార్మర్ యార్డ్, స్టాఫ్ క్వార్టర్స్, అప్రోచ్ రోడ్, డెలివరీ సిస్టెర్న్ మరియులేయింగ్ ఆఫ్ ప్రెజర్ మెయిన్ ఆఫ్ దున్నపోతుల గండి - బాల్నేపల్లి - చంప్లతండ లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణానికి ఈ దిగువ చూపిన భూమి అవసరం ఉన్నదని భావించినందున, భూసేకరణకై ఇట్టి డిక్లరేషన్ జారిచేయనైనది.

కావున, ఈ ప్రాజెక్టు నల్లగొండ జిల్లా, అడవిదేవులపల్లి మండలం, అడవిదేవులపల్లి గ్రామంలో భూమి విస్తీర్ణం ఎక **2.3275 గుంటలు** గల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం డిక్లరేషన్ జారిచేయనైనది.

షెడ్యూల్

గ్రామము: అడవిదేవులపల్లి మండలము: అడవిదేవులపల్లి జిల్లా: నల్గొండ

| క్రమ సంఖ్య | సర్వే నెం. | సబ్-డివిజన్ నెం. | భూమి స్వభావం | విస్తీర్ణం ఎకరె గుంటలు | భూమిని కోల్పోయే రైతు పేరు మరియు తండ్రి / భర్త పేరు | [illegible] |
|---|---|---|---|---|---|---|
| 1 | 489 | 2 | పట్టా | 0.0050 | పల్లపోతుల ఆంజనేయులు తండ్రి ముత్యాలు | |
| 2 | | | పట్టా | 0.0250 | పల్లపోతుల చిన్నాయన తండ్రి హన్మంత్ | |
| 3 | | | పట్టా | 0.01 | పల్లపోతుల కిష్టయ్య తండ్రి హన్మంత్ | |
| | మొత్తం | | | 0.04 | | |
| 4 | 490 | 2 | పట్టా | 0.03 | రమావత్ సేవ తండ్రి హనుమ | |
| 5 | | | పట్టా | 0.0150 | పల్లపోతుల ఆంజనేయులు తండ్రి ముత్యాలు | |
| | మొత్తం | | | 0.0450 | | |
| 6 | 491 | 2 | పట్టా | 0.02 | పోలిశెట్టి ముత్తరావు | |
| 7 | | | పట్టా | 0.0250 | పల్లపోతుల కిష్టయ్య | |
| 8 | | | పట్టా | 0.0250 | పోలిశెట్టి ముత్తరావు | |
| 9 | | | పట్టా | 0.07 | రమావత్ హరియ తండ్రి చిన్న సామ్య | |
| 10 | | | పట్టా | | రమావత్ చంద తండ్రి చిన్న సామ్య | |
| 11 | | | పట్టా | | బత్తుల పున్నయ్య తండ్రి దిబ్బయ్య | |
| 12 | | | పట్టా | 0.04 | బత్తుల కాశయ్య తండ్రి దిబ్బయ్య | |
| 13 | | | పట్టా | | బత్తుల ఇద్దయ్య తండ్రి దిబ్బయ్య | |
| 14 | | | పట్టా | | బత్తుల పాపయ్య తండ్రి దిబ్బయ్య | |
| 15 | | | పట్టా | 0.01 | రమావత్ సేవ తండ్రి హనుమ | |
| | మొత్తం | | | 0.19 | | |
| 16 | 500 | 2 | పట్టా | 0.01 | క్రొర భీమ | |
| 17 | | | పట్టా | 0.02 | క్రొర సెల్య తండ్రి రెడ్య | |
| 18 | | | పట్టా | 0.05 | పోలిశెట్టి ముత్తరావు | |
| 19 | | | పట్టా | 0.0250 | పోలిశెట్టి ముత్తరావు sister | |
| 20 | | | పట్టా | 0.02 | పోలిశెట్టి ముత్తరావు | |
| | మొత్తం | | | 0.1250 | | |
| 21 | 501 | 2 | పట్టా | 0.01 | రమావత్ బిచ్య తండ్రి తుచ్య | |
| 22 | | | పట్టా | 0.0750 | క్రొర భీమ | |
| | మొత్తం | | | 0.0850 | | |
| 23 | 502 | 2 | పట్టా | 0.0350 | రమావత్ నాను తండ్రి తవుర్య | |
| 24 | | | పట్టా | 0.0150 | రమావత్ అంజి తండ్రి రథ్య | |
| 25 | | | పట్టా | 0.0270 | రమావత్ దెన్య తండ్రి రథ్య | |
| 26 | | | పట్టా | 0.0250 | రమావత్ సేవ్యా | |
| 27 | | | పట్టా | 0.0275 | రమావత్ కోట్య తండ్రి గోప్య | |
| 28 | | | పట్టా | 0.02 | రమావత్ బిచ్య తండ్రి తుచ్య | |
| | మొత్తం | | | 0.15 | | |
| 29 | 503 | 2 | పట్టా | 0.0150 | కనిగిరి శ్రీను తండ్రి హరినారాయణ | |
| 30 | | | పట్టా | 0.06 | రమావత్ హనుమ తండ్రి తవుర్య | |
| | మొత్తం | | | 0.0750 | | |
| 31 | 504 | 2 | పట్టా | 0.03 | రమావత్ హేమ తండ్రి హనుమ | |
| 32 | | | పట్టా | 0.015 | కనిగిరి శ్రీను తండ్రి హరినారాయణ | |
| | మొత్తం | | | 0.0450 | | |
| 33 | 526 | 2 | పట్టా | 0.03 | పూజల రామయ్య తండ్రి వెంకయ్య | |
| 34 | | | పట్టా | 0.0050 | రోడ్ | |
| 35 | | | పట్టా | 0.02 | రమావత్ రాము తండ్రి వాల్య | |
| 36 | | | పట్టా | 0.0250 | రమావత్ అంజి తండ్రి వాల్య | |
| | మొత్తం | | | 0.08 | | |
| 37 | 527 | 2 | పట్టా | 0.08 | పల్లపోతుల బాలసైదులు తండ్రి బిచ్చాలు | |
| 38 | | | పట్టా | 0.01 | పల్లపోతుల హనుమంతు తండ్రి చిన్న హనుమంతు | |
| | మొత్తం | | | 0.09 | | |
| 39 | 528 | 2 | పట్టా | 0.09 | జంపాల మంగమ్మ | |
| 40 | 658 | 2 | పట్టా | 0.08 | జడ కోటయ్య తండ్రి హనుమంతు | |
| 41 | | | పట్టా | 0.0025 | కుర్ర తవుర్య | |
| 42 | | | పట్టా | 0.03 | రమావత్ శ్రీను తండ్రి హరి చందు | |
| | మొత్తం | | | 0.1125 | | |
| | పూర్తి మొత్తం | | | 2.3275 | | |

ప్రతిపాదిత భూమి,భూసేకరణ చట్టము, 2013లోని సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013 ) ప్రకారం సంబంధిత యజమానుల నుండి ముసాయిద నోటిఫికేషన్ పై ప్రతిపాదిత భూసేకరణ విషయములో వచ్చిన అభ్యంతరములను పరిశీలించిన పిదప సెక్షన్ 19/1 ప్రకారము డిక్లరేషన్ జారీ చేయనైనది. భూసేకరణకు సంబంధించిన ప్రదేశములో ప్రజల నివాసల స్థాన భ్రంశం ఉండదు మరియు సమీపంలోని మౌలిక సదుపాయాలకు ఎటువంటి భంగం ఉండదు, భూసేకరణ వలన ప్రభావవంతమైన వ్యక్తి యొక్క జీవనోపాధి పై కనీస ప్రతికూల ప్రభావం ఉండుటలేదు,అందువల్ల, RFCT LA RR చట్టం,2013 (2013 చట్టం 30 ) యొక్క సెక్షన్ 31 మరియు రెండవ షెడ్యూల్ పరంగా ప్రత్యేక R&R అవార్డును పాస్ చేయవలసిన అవసరం లేదు. తెలంగాణ ప్రభుత్వ నీటిపారుదల శాఖ జి.ఓ.నెం.09, తేదీ : 11.03.2025 జారీ చేసినారు అట్టి G.O నందు భూసేకరణ చట్టం 2013 (చట్టం నెం. 30 ఆఫ్ 2013) లోని 2013 చట్టం కింద అధ్యయం II మరియు అధ్యయం III ఈ ప్రాజెక్టు నుండి మినహాయించబడింది.

భూసేకరణ తలపెట్టిన భూమిలో, బొగ్గు, ఇనుము, ప్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో ఆ ఖనిజములు ప్రాజెక్టు నిర్మాణముకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూసేకరణ చేయ భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో కార్యాలయ పనివేళ లలో భూసేకరణాధికారి మరియు సబ్ కలెక్టర్, మిర్యాలగూడ గారి కార్యాలయములో పరిశీలించుకొను నిమిత్తము అందుబాటులో ఉండును.

సం/- భూసేకరణ అధికారి మరియు సబ్-కలెక్టర్, మిర్యాలగూడ.
సం/- అదనపు కలెక్టర్, నల్గొండ జిల్లా.
సం/- జిల్లా కలెక్టర్, నల్గొండ.

DIPR RO NO. 701/LA/PP/Advt/Pub/2025-26

## రాష్ట్ర మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గం



సత్యనారాయణ రెడ్డి గౌరవాధ్యక్షుడు



ఎం.ఎస్.మూర్తి ప్రెసిడెంట్



వి.వేణుకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్



పి.ఇందిరా శ్రీలక్ష్మి ప్రధాన కార్యదర్శి

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి) గౌరవాధ్యక్షులుగా సత్యనారాయణ రెడ్డి, అధ్యక్షులుగా ఎం.ఎస్.మూర్తి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా వి.వేణుకుమార్, ప్రధాన కార్యదర్శిగా పి.ఇందిరా శ్రీలక్ష్మి తో పాటు 124 మందితో కార్యవర్గాన్ని రాష్ట్ర 5వ మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. వైద్య రంగంలోని వివిధ సమస్యల పరిష్కారానికి 'నవంబర్ 7'న ''డిమాండ్స్ డే'' గా పాటిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా అన్ని వైద్య సంస్థల ఎదుట ''నిరసన ప్రదర్శనలు'' నిర్వహించాలని మహాసభ నిర్ణయించింది. హైదరాబాద్, హిమాయత్‌నగర్, సత్యనారాయణ రెడ్డి భవన్‌లో సోమవారం 'తెలంగాణ రాష్ట్ర మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్' ప్రతినిధుల సభ జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నది.

ఎంప్లాయిస్ యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసాచారి, ఎస్.శివానంద్, ఉపాధ్యక్షులుగా పి.నర్సయ్య, పి.స్వాతి, అమృతరావు, కవిత, వెంకటరావు, కార్యదర్శులుగా ఎం. మధుసూదన్ రెడ్డి, పి.సరస్వతి, ఆర్.జగన్ మోహన్ రావు, పి.రామారావు, పి.కిషన్, కోశాధికారిగా కె.సుశీలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ప్రతినిధుల సభలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జులై 2023 నుండి అమలుకావాల్సిన వేతన సవరణను 44శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని, ఐదు విడతల కరువు భత్యం విడుదల చేయాలని, పూర్వపు పెన్షన్ విధానాన్ని పునఃరుద్ధరించాలని, 317 జి.ఓ ద్వారా ఇప్పటికీ న్యా యం జరుగని ఉద్యోగులందరినీ తక్షణం ఆదుకోవాలని తీర్మానం చేసింది. వైద్య విధాన పరిషత్‌ను రద్దు చేసి, ఆ స్థానంలో సెకండరీ హెల్త్ సర్వీసెస్ డైరెక్టరేట్‌ను ఏర్పా టు చేయాలని, తద్వారా ఉద్యోగుల ట్రెజరీ ద్వారా వేతనాలు పొందేందుకు వీలవుతుందని, అర్హులైన ఉద్యోగులందరికీ పదోన్నతు లు కల్పించాలని, వైద్య ఉద్యోగులకు హెల్త్ కార్డులు అందజేయాలని, పదవీ విరమణ పొందిన ఉద్యోగులందరికీ రావాల్సిన బెనిఫిట్స్‌ను తక్షణమే చెల్లించాలని, ఇఎస్ఐ రంగంలో ఉద్యోగులకు 126 జి.ఒను. సవరించి అమలు చేయాలని, ఇన్ సర్వీస్ ఉద్యోగులకు ల్యాబ్, ఎక్స్‌రే, ఇ.సి.జి, శిక్షణను పునఃప్రారంభించాలని, టివివిపిలో క్యాడర్ స్ట్రెంథ్‌ను సవరించేందుకు ఏర్పాడిన అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ నివేదికను సవరించాలని చేసిన తీర్మానాలను ప్రతినిధుల సభ ఆమోదించింది.

## ప్రజా ఉద్యమంలా ఓట్ చోరీ సంతకాల సేకరణ

వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/ఖమ్మం : రాహుల్‌గాంధీ పిలుపుతోనే దేశంలో ప్రజా ఉద్యమంలా ఓట్‌చోరీ సంతకాల సేకరణ జరుగుతున్నదని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపులో భాగంగా సోమవారం ఖమ్మం నగరంలో ఓట్ చోరీ గద్దె చోడ్ నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కాంగ్రెస్ పారీ కార్యాలయం వరకు సాగింది. ప్రతీ పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ఓట్ చోరీ ఉద్యమం జరుగుతుందని చెప్పారు. మోడి మూడో సారి ఓట్ చోరీతోనే అధికారంలోనికి వచ్చారని చెప్పారు. మోడి సర్కార్ రాజ్యాంగ విధాలను అవలంబిస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కల్పిస్తోందని, ఈ ఈ ఓట్ చోరీ ఉద్యమంతో దేశ ప్రజలు మరింత చైతన్య వంతులుగా మారుతారని చెప్పారు. సంతకాల సేకరణ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరవడం అభినందనీయమని, ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ ర్యాలీలో మేయర్ నీరజ, డిప్యూటీ మేటర్ జోహార్ ఫాతిమా, మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, కార్పోరేటర్ కమర్త మురళీ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా మహబూబ్‌నగర్ రూరల్ మండలం రామిరెడ్డి గూడలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న యు.ప్రియాంక సోమవారం ఉదయం 7.10 నిమిషాల ప్రాంతంలో గురుకుల కళాశాల హాస్టల్ బాత్‌రూం కిటికికి ఉరి వేసుకుని చనిపోయిన ఘటనపై అధికారులతో విచారణ జరుపనున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. కలెక్టర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విద్యార్థిని మృతదేహాన్ని ఉంచిన ఐసియు వార్డుకు వెళ్లి విద్యార్థిని తండ్రి యు.నాగయ్యను పరామర్శించారు. సంఘటన గురించి గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ వాణిశ్రీతో మాట్లాడి తెలుసుకున్నారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రంగా అజ్మీరాతో మాట్లాడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తదితరులు ఉన్నారు.

# క్రమశిక్షణతోనే క్రీడాకారుల రాణింపు

అత్యున్నత క్రీడా శిక్షణకు కృషి
క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి





ప్రజాపక్షం/హైదరాబాద్: క్రమశిక్షణ సాధించాలన్న పట్టుదల కలిగిన క్రీడాకారులు మాత్రమే జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని తెలంగాణ రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో సోమవారం జరిగిన 'తెలంగాణ క్రీడా శాఖ ఇటలీకి చెందిన జువెంటస్ ఫుట్‌బాల్ సంయుక్త నిర్వహణలో 'తెలంగాణ జువెంటస్ స్పోర్ట్స్ డిప్లమసి ఇనిషియేటివ్' కార్యక్రమానికి ఆయన రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఎపి జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ యువజన అభివృద్ధి పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డిలతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏ క్రీడాకారుడైన ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే క్రమశిక్షణ అతి ముఖ్యమైనదని, ప్రభుత్వాలు సంస్థలు కోచులు చేస్తున్న ప్రయత్నాలకు క్రీడాకారుడు చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తేనే అంతిమ విజయం సాధ్యమవుతుందని అన్నారు. ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఎంతో చారిత్రాత్మకమైన ఫుట్‌బాల్ క్రీడా వారసత్వం కలిగిన హైదరాబాద్ నగరంలో ఫుట్‌బాల్ క్రీడా పునర్ వైభవం కోసం ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేస్తుందని అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ క్రీడాకారులకు ప్రతి క్రీడాంశంలో అత్యున్నతశ్రేణి మెరుగైన శిక్షణ ఇప్పించేందుకు అనేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. జువెంటస్ ఫుట్‌బాల్ క్లబ్ ప్రపంచంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఫుట్‌బాల్ సంస్థల్లో ఒకటి, ఆటగాళ్ల ,కోచ్‌ల అభివృద్ధిలో తమ దశాబ్దాల అనుభవాన్ని ఈ ప్రత్యేక భాగస్వామ్యంలో తీసుకువస్తోందని వివరించారు. ఇటలీ నుండి వచ్చిన జువెంటస్ నిపుణ కోచ్‌ల బృందం 2025 అక్టోబర్ 11 నుండి 17 వరకు హైదరాబాద్‌లో యువ ఫుట్‌బాల్ క్రీడాకారులు మరియు స్థానిక కోచ్‌లకు గట్టి శిక్షణా శిబిరాలను నిర్వహించనుంది. ఈ శిబిరాలు టెక్నికల్ ఎక్సలెన్స్, టీమ్‌వర్క్, డిసిప్లిన్ మరియు గ్లోబల్ స్పోర్ట్స్ మన్‌షిప్ వంటి జువెంటస్ తత్వం యొక్క ముఖ్య విలువలపై దృష్టి సారిస్తాయనితెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ క్రీడా శాఖ తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ గత ఏడాదిన్నర నుండి క్రీడల అభివృద్ధికి విశేషమైన కృషి చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ ఈండ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, ఇటలీ కన్స్యులేట్ జనరల్ (బెంగుళూరు) గిండోమెనికో మీలానోశ్రీనిధి విద్యాసంస్థల చైర్మన్ కే టి మహి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే కొండా లక్ష్మారెడ్డి మృతి





ప్రజాపక్షం/హైదరాబాద్: చేవెళ్ల మాజీ శాసనసభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్ఎస్ వార్తా సంస్థ మేనేజింగ్ ఎడిటర్ కొండా లక్ష్మారెడ్డి సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన వయస్సు 84 సంవత్సరాలు. లక్ష్మారెడ్డి రాజకీయ జీవితం అంతా కాంగ్రెస్ పార్టీతోనే ముడిపడి ఉంది. లక్ష్మారెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కొండా వెంకట రంగారెడ్డి మనుమడు. కాంగ్రెస్ పార్టీలో లక్ష్మారెడ్డి పలు హోదాల్లో పని చేశారు. ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ అధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ గ్రీవెన్స్ సెల్ అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1983లో ఆయన చేవెళ్ల నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1999, 2014లో రెండు పర్యాయాలు లక్ష్మారెడ్డి హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ కూడా చేశారు. జర్నలిజం పట్ల గల ఆసక్తి, నిబద్ధతతో 1980లో ఆయన 'న్యూస్ అండ్ సర్వీసెస్ సిండికేట్ (ఎన్ఎస్ఎస్) వార్తా సంస్థను ప్రారంభించారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా, జర్నలిస్టుల సహకార గృహ నిర్మాణ సంఘం అధ్యక్షులుగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ కార్యవర్గ సభ్యులుగా లక్ష్మారెడ్డి సేవలందించారు. కొండ లక్ష్మారెడ్డి అంత్యక్రియలు సోమవారం సాయంత్రం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో జరిగాయి. పలువురు బంధుమిత్రులతో పాటు పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఈటల రాజేందర్, తెలంగాణ మీడియా అకాడమి అధ్యక్షులు కె.శ్రీనివాస్ రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు కె.వి.పి.రామచంద్రరావు, పలువురు సంపాదకులు, సీనియర్ జర్నలిస్టులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని లక్ష్మారెడ్డికి నివాళులు అర్పించారు.

**సిఎం, ఐజెయు, టిపిసిసి సంతాపం**

చేవెళ్ల మాజీ ఎంఎల్‌ఎ కొండా లక్ష్మా రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎన్ఎస్ఎస్ వార్తా సంస్థ వ్యవస్థాపకులుగా, శాసనసభ్యులుగా, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా, జూబ్లీహిల్స్ జర్నలిస్ట్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులుగా లక్ష్మారెడ్డి విశేషమైన సేవలను అందించారని సిఎం కొనియాడారు. కొండా లక్ష్మారెడ్డి మృతి పట్ల ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) అధ్యక్షులు కె.శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్(టియుడబ్ల్యూజె) అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

జర్నలిస్టులకు సంబంధించిన వివిధ సంఘాలలో కొండా లక్ష్మా రెడ్డితో కలిసి పనిచేసిన సందర్భాలను, ఆయన సేవలను వారు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కొండా లక్ష్మారెడ్డి మృతి పట్ల టిపిసిసి అధ్యక్షులు డి.మహేష్ కుమార్ గౌడ్ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుగా, ఎంఎల్‌ఏగా లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీకి సేవలు చేశారని ఆయన కొనియాడారు. రాజకీయాలలో ఉంటూనే జర్నలిజం పట్ల మక్కువతో ఎన్ఎస్ఎస్ వార్తా ఏజెన్సీ ప్రారంభించారని ఆయన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

**లక్ష్మారెడ్డి మృతికి మంత్రి శ్రీధర్‌బాబు సంతాపం**

కొండా లక్ష్మారెడ్డి మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు. చేవెళ్ల మాజీ శాసన సభ్యుడు, సీనియర్ కాంగ్రెస్ నేత కొండా లక్ష్మారెడ్డి మృతి పట్ల ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. లక్ష్మారెడ్డి కాంగ్రెస్ పార్టీలో పలు హోదాల్లో పనిచేశారని, రెండు పర్యాయాలు హైదరాబాద్ లోక్ సభ స్థానంలో పోటీ చేసారని వెల్లడించారు. ఎన్ఎస్ఎస్ (ఎన్ఎస్ఎస్) వార్తా సంస్థను స్థాపించి మీడియా రంగానికి విశేష సేవలు అందించారని శ్రీధర్ బాబు గుర్తు చేసారు. నిబద్ధతతో పనిచేసిన లక్ష్మారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని ఆయన పేర్కొన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్టు శ్రీధర్ బాబు తెలిపారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను కోరారు.



ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురైన టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్‌ను ఎఐసిసి రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సోమవారం బంజారా-హిల్స్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు.

**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం**
Email: knrcmnr@rediffmail.com
నెం. E1/DB/MCK/8201/236/MCK/2025-25 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీస్ తేది: .10.2025
మున్సిపల్ జనరల్ ఫండ్స్ కింద నగర పరిధిలో **దీపావళి పండుగ 2025** మరియు **ఆల్ సోల్స్ డే వేడుకలు 2025** సందర్భంగా **12** నిర్వహణ పనులు - **రూ.18.47** లక్షల అంచనా వ్యయం.
బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది : 13.10.2025 - 04.00 PM
బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ఆఖరి తేది : 16.10.2025 - 04.00 PM
మరిన్ని వివరాలకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- కమిషనర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్.
DIPR R.O. No.: 9059-PP/CL/ADVT/1/2025-26, Date: 13-10-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఇఇ, డివిజన్-29, సికింద్రాబాద్, జిహెచ్‌ఎంసి.
NIT No. 28/EE-Div.29/SBZ/GHMC/2025-26, 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన తేది: 13.10.2025
**పని పేరు:** జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్, సర్కిల్-29లోని 142, 143, 144 & 145 వార్డులలో దీపావళి పండుగ పనులు-2025 కోసం జంగిల్ కటింగ్ చేయడం. **అంచనా విలువ / ఇసివి :** రూ.5.55లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం :** 14.10.2025న ఉ.11.00గం.ల నుండి 17.10.2025న ఉ.11.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్. సెల్ నెం. 9704405076. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.eprocurement.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.29, సికింద్రాబాద్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 9076-PP/CL/ADVT/1/2025-26, Date: 13-10-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
డివిజన్-14 జిహెచ్‌ఎంసి.
NIT No. 47/E.E.-14/GHMC/2025-26, తేది: 13.10.2025
**పని పేరు:** జిహెచ్‌ఎంసి, కెజెడ్, డివిజన్-14 కింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు. **అంచనా విలువ :** రూ.13.60లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం :** బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 14.10.2025న ఉ.11.00గం.ల నుండి మరియు బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 17.10.2025న ఉ.11.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-14, జిహెచ్‌ఎంసి, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.14, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 9102-PP/CL/ADVT/1/2025-26, Date: 13-10-2025

**5వ వర్ధంతి**
మంచికి మానవత్వానికి మారుపేరైన మీరు మా అందరి నుండి దూరమై నేటికి 4 సంవత్సరాలు గడిచిననూ మీ మధుర జ్ఞాపకాలు మా అందరి హృదయాల్లో పదిలం. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...



కీ॥శే॥ పుస్తకాల నారాయణ గారు
మరణం : 14-10-2021
భార్య : కీ॥శే॥ పుస్తకాల రుక్కమ్మ
మనుమలు: పి. మధన్ చక్రవర్తి - శైలజ
పి. వంశీ,
మనుమరాండ్లు: పి. సుమిత - రఘువీర్, పి. శ్రీనిత్య, టి. కార్తీక్, పి. రుతిక, లొక్యశ్రీ, పి. అనుషిత్
కుమారులు - కోడళ్లు
పుస్తకాల నర్సింగ్‌రావు - వనిత
సిపిఐ సీనియర్ రాష్ట్ర నాయకులు, సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి.
పుస్తకాల సుదర్శన్ - అనిత
కుమార్తెలు - అల్లుళ్లు
పి. అంజమ్మ - వెంకటేష్
ఎ. క్రిష్ణవేణి - అశోక్
కె. సత్యకళ - చెన్నయ్య
డి. శ్యామల - సదానంద్
పుస్తకాల వారి కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు
అడ్రస్: పుస్తకాల సుక్కమ్మ నారాయణ రెసిడెన్సీ, ఉప్పర్‌పల్లి (ఉప్పర్‌పల్లి కోర్టు దగ్గర) రాజేంద్రనగర్, హైదరాబాద్. ఫోన్: 9246873646 / 9394778982



# జనరల్
STATE & REGIONAL NEWS

## పిడిఎస్ బియ్యం గోదామ్‌పై విజిలెన్స్ దాడులు

ప్రజాపక్షం/హైదరాబాద్:గద్వాల జిల్లా లీజా, గాజులపేట గ్రామాలలో అక్రమంగా నిల్వచేసిన పిడిఎస్ బియ్యం గౌడాన్‌పై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిజి శిఖాగోయాల్ ఆదేశాల మేరకు అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.2,69,500 విలువగల 77 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పిడిఎస్ బియ్యాన్ని సరఫ రా చేస్తున్న టిజి 33 టిఏ 0482 అశోక్ లీలాండ్ వాహనాన్ని సీజ్ చేశారు. పట్టుబడున బియ్యాన్ని జోగులాంబ గద్వాల్ జిల్లా పౌర సరఫరాల అధికారులకు అప్పగించారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న అక్రమార్కుల గురించి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందించాలని శిఖాగోయల్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## తాలిబన్లు ప్రగతిశీలురా?

సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్

ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్రంలో మోదీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం ప్రతిరోజు అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రతిమాట కుతంత్రాలతో మాట్లాడుతూ ప్రతి పని మోసపూరితంగా చేయటంతో ప్రజలు విసిగిపోయి ప్రభుత్వాన్ని శిక్షించటానికి సిద్ధంగా ఉన్నారని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. ఇటీవల తాలిబన్ నాయకులను మన దేశం ఆహ్వానించి వారితో మంతనాలు జరిపి మంచి ఆతిథ్యం ఇవ్వడం దేశ ప్రజలందరు గమనించారని, ఈ చర్య ద్వారా మోదీ ప్రభుత్వం తాలిబన్లను శాంతికాముకులుగా గుర్తిస్తున్నదా అని ఆయన ప్రశ్నించారు. తాలిబన్లను శాంతికాముకులుగా మన దేశంలోని నక్సలైనట్లను ఉగ్రవాదులుగా చూస్తున్న మోదీ ప్రభుత్వ ద్వందనీతిని ఆయన ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. తాలిబన్లను ఒకప్పుడు భారతదేశంతో పాటు ప్రపంచ దేశాలు ఉగ్రవాదులుగా ప్రకటించాయని, నేడు భారత ప్రభుత్వం వారిని ఉగ్రవాదులుగా కాకుండా మరోరకంగా చూడటంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మోదీ దేశంలో, మరి ఇతర ప్రాంతాల్లో ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్న తన మిత్రుడు ట్రంప్‌తో కలిసి రూపుమాపుతామని ప్రగల్భాలు పలికి నేడు తాలిబన్లతో చేయి కలపం పలాయన వాదం కాదా అని ప్రశ్నించారు. భారతదేశంలో ఉన్న నక్సలైట్లు ప్రస్తుత సమాజంలో మార్పు రావాలని అంతరాలు లేని, దోపిడీలేని సమాజం కావాలని కోరుకుంటున్నారన్నారు. కానీ తాలిబన్ల ఉద్దేశం, ఆలోచన, కార్యక్రమం ఆ రకంగా లేదని, అయినా మోదీ వారిని గౌరవించి భారతదేశానికి పిలవడం భారతదేశ సంస్కృతికి, సాంప్రదాయానికి విరుద్ధమన్నారు. దీనిపై మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారతదేశంలో తాలిబన్లు నిర్వహించిన పత్రికా సమావేశంలో మహిళా విలేకరులను అనుమతించకపోవటంతో దేశంలోని అభ్యుదయవాదులతో పాటు పత్రికా రంగం దేశవ్యాపితంగా తమ నిరసనను తెలియజేశారన్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఖండన లేకపోవటంతో ఆ పత్రికా సమావేశంతో తమ ప్రభుత్వానికి ఏలాంటి సంబంధం లేదని ప్రకటించటం సిగ్గుచేటని, దేశ గౌరవానికి భంగకరమన్నారు. భారతదేశ ప్రభుత్వానికి ప్రమేయం లేకుండా ఇతర దేశ నాయకులు మన దేశంలో పత్రికా సమావేశం పెట్టడం ఎలా సాధ్యమవుతుందో మోదీ చెప్పాలన్నారు. తాలిబన్లు మహిళా పాత్రికేయులను అనుమతించకపోవడం మనువాద సిద్ధాంతానికి అనుకూలంగా ఉన్నందునే మోదీ ప్రభుత్వం తాలిబన్ల ప్రవర్తనను ఖండిరచలేదన్నారు. దేశంలో కేవలం భారత రాజ్యాంగమే అమలువుతుందని మనువాదం కాదనేది మోదీ, అమిత్ షా అర్థం చేసుకోవాలన్నారు. దేశ ప్రజలు మోదీ ప్రభుత్వాన్ని శిక్షించక తప్పదని ఆయన హెచ్చరించారు. దేశంలోని నక్సలైట్లపై ఒక రకంగా తాలిబన్లపై మరోరకంగా ప్రవర్తించడం మోదీ ప్రభుత్వంలోని సిద్ధాంత తారతమ్యం ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజలంతా జాగ్రత్తగా ఆలోచించి వాస్తవాలు గ్రహించి రాజ్యాంగ ద్రోహులకు సరైన బుద్ధి చెప్పటానికి సన్నద్ధం కావాలని పిలుపునిస్తున్నామన్నారు.

## బిసి రిజర్వేషన్ల అమలు విషయంలో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో బిసి రిజర్వేషన్ల అమలు విషయంలో వీలైనంత త్వరలో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. ఢిల్లీలో సోమవారం పేస్ మేకర్ అమర్చుకున్న ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను మహేష్‌కుమార్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఖర్గే ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవలి రాజకీయ, సామాజిక పరిణామాలను ఖర్గేకు వివరించినట్లు తెలిపారు. బిసిల రిజర్వేషన్లపై హైకోర్టులో జరిగిన వ్యవహారాన్ని, సుప్రీంకోర్టులో అప్పీల్ చేయాలనుకుంటున్న అంశాన్ని కూడా మల్లికార్జున ఖర్గేకు తెలియజేసినట్లు ఆయన వెల్లడించారు. ప్రభుత్వం వేసే పిటిషన్‌కు కాంగ్రెస్ పార్టీలోని నాయకులు కూడా ఇంప్లీడ్ అవుతారన్నారు. కాంగ్రెస్ నాయకుల మధ్య ఎటువంటి భేదాభిప్రాయాలు లేవని, సమాచార లోపం వల్ల మంత్రుల మధ్య తలెత్తిన వివాదం చాలా చిన్న అంశమని, తమ కుటుంబ సమస్య అని, దీనిని తామే పరిష్కరించుకుంటామని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు.

## గీత పనివారల సంఘం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించాలి

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం 68వ ఆవిర్భావ దినోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని సంఘం నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం సమావేశం అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన హైదరాబాదులోని రాజ్‌బహదూర్ గౌర్ హాల్‌లో సోమవారం జరిగింది. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిల్ గౌడ్, రాష్ట్ర కోఆర్డినేటింగ్ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం, ఉపాధ్యక్షులు కెవిఎల్, కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈనెల 18వ తేదీన బిసిల రిజర్వేషన్‌కు మద్దతుగా బిసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఇచ్చిన 'బంద్ ఫర్ జస్టిస్'కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ కార్యక్రమం జయప్రదం చేయాలని గీత పనివారల సంఘం విజ్ఞప్తి చేసింది.

## ఇందిరమ్మ రాజ్యమంటే ఇల్లు కూలగొట్టడమా?:కెటిఆర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఇందిరమ్మ రాజ్యమంటే ఇల్లు కూలగొట్టడమా? అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు ప్రశ్నించారు. రహమత్ నగర్ ఎస్‌పిఆర్ హిల్స్ గ్రౌండ్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ బిఆర్ఎస్ విస్తృత కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో హైదరాబాద్‌లో ఒక్క సీటు ఇవ్వకుండా కెసిఆర్‌కు అండగా నిలిచారన్నారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. ఎంతో మంది నిరుపేద, గరీబోళ్లను రోడ్లపైకి కాంగ్రెస్ ప్రభుత్వం చేర్చిందన్నారు. జూబ్లీహిల్స్‌లో కొట్టే దెబ్బకు ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్టానం అదిరిపడాలన్నారు. కెసిఆర్ ఉన్నప్పుడు నల్లా బిల్లులు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ముక్కుపిండి బిల్లులు వసూలు చేస్తుందన్నారు. నెల రోజులపాటుఇంటింటికీ బాకీ కార్డు పట్టుకుని వెళ్లాలని, దొంగ ఓట్లు పడకుండా అందరినీ ఓట్లు వేసేలా ప్రోత్సహించాలని కోరారు. రాబోవు నెల రోజులపాటు కాంగ్రెస్‌పై వ్యతిరేకత పూర్తిస్థాయిలో ఓట్ల రూపంలో పడాలన్నారు. గోపినాథ్ ఆశాయాలు ముందుకు తీసుకెళ్తానని బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత అన్నారు.

## బిఆర్ఎస్‌కు ఓటు వేయడం వేస్ట్

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ఓటు వేయడం వేస్ట్ అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఒక వేళ బిఆర్ఎస్ గెలిచినా అభ్యర్థి ఆ పార్టీలో ఉండరన్నారు. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు పార్టీ మారారని, వారు ఏ పార్టీలో ఉన్నారో కూడా తెలియడం లేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బిజెపి అభ్యర్థిని నేడో, రేపో ప్రకటిస్తామని తెలిపారు. గతంలో బిఆర్ఎస్‌తో కలిసి కాపురం చేసినా ఈ ఎన్నికల్లో కనిపించడం లేదన్నారు. ఈ ఎలక్షన్‌లో ఎంఐఎం ఎందుకు తమ పార్టీ అభ్యర్థిని రంగంలోకి దింపడం లేదని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేస్తున్నదా? లేదా? ఎంఐఎం పోటీ చేస్తున్నాదా? అనేది అర్థం కావడం లేదన్నారు. ఇప్పుడు బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి గతంలో ఎంఐఎం నుంచి పోటీ చేశారని, అందుకే ఈ గందరగోళమన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలను మోసం చేస్తున్న ఈ పార్టీల తీరును ఎండగట్టాలని పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిజెపికి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. రాంచందర్ రావు అధ్యక్షతన ఖమ్మం జిల్లాకు చెందిన డాక్టర్లు, దేవరకొండకు చెందిన పలువురు చేరగా రాంచందర్ రావు వారికి కండువా కప్పారు. పార్టీలోకి ఆహ్వానించారు. పాలేరు నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా గతంలో పోటీ చేసిన కాసాని మారుతి గౌడ్‌తో పాటు మరికొందరు వ్యాపార వేత్తలు బిజెపిలో చేరారు.

## బాణసంచా గోడౌన్‌పై పోలీసుల దాడి

రూ.8 లక్షల టపాసులు స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్: మలక్‌పేట్‌లో అక్రమంగా నిల్వచేసిన బాణాసంచా గౌడాన్‌పై సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం దాడి చేశారు. ఈ సందర్భంగా గౌడాన్‌లో అక్రమంగా నిల్వ చేసిన రూ.8 లక్షల విలువైన టపాసులను స్వాధీనం చేసుకున్నారు. గౌడాన్ యజమాని రామ్ గుప్తా మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శాలివాహన నగర్‌లో సహస్ర ఫుట్‌వేర్ దుకాణం వెనుకాల ఉన్న గౌడాన్‌లో టపాసులను అక్రమంగా నిల్వచేశాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్. సైదాబాబు పర్యవేక్షణలో ఎస్‌లు ఎం. మధు, కె. రామారావు, కానిస్టేబుళ్లు నయీమ్ ఖాన్ మరియు సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం అఫ్జల్‌గంజ్ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు.నిందితుడు రామ్‌గుప్తాను అరెస్టు చేశారు.



## పట్టాలపై వ్యర్థ సమాగ్రిని తీసివేయాలి



ప్రజాపక్షం/హైదరాబాద్: ట్రాక్‌ల నుండి తీసిన వ్యర్థ సామగ్రిని సకాలంలో తొలగించడం వల్ల ప్రమాదాలను నివారించవచ్చని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, వివిధ శాఖలకు చెందిన ప్రధాన విభాగాధిపతులతో కలిసి ఆయన జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రతపై వివరణాత్మక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, గుంతకల్లుతో పాటు నాందేడ్ డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్లు (డిఆర్ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ భద్రతా సమీక్ష సమావేశంలో ప్రయాణీకుల, రైలు నిర్వహణలో భద్రతను నిర్ధారించడానికి ట్రాక్‌ల నుండి తీసిన వ్యర్థ సామగ్రిని సకాలంలో తొలగించడం యొక్క ప్రాముఖ్యతపై దృష్టిసారించారని తెలిపారు. స్టేషన్లలో హింగ్డ్ స్కాచ్ బ్లాక్‌ల ట్రయల్ అమలును ఆయన సమీక్షించారు.తరువాత జనరల్ మేనేజర్ లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద ఓపెన్ రోడ్ ట్రాఫిక్‌ను అప్రమత్తంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని హైలైట్ చేశారు మరియు గేట్‌మెన్ మరియు రైల్వే సిబ్బందిని సరైన రీతిలో విధులను కేటాయించి వారిని వినియోగించుకోవాలని తెలిపారు. నిఘాను పెంచడానికి గూడ్స్ షెడ్‌లు, ప్రైవేట్ సైడింగ్‌ల వద్ద సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. సజావుగా రైలు కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడానికి వాటి కార్యాచరణను నిర్ధారించే ఫాగ్ సేఫ్ పరికరాలు మరియు జి.పి.ఎస్ ట్రాకర్ల కార్యాచరణ సంసిద్ధత చేసుకోవాలన్నారు.

## విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేసేందుకు బిజెపి కుట్ర

సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి రాఘవులు విమర్శ




ప్రజాపక్షం/హైదరాబాద్ : విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోందని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి రాఘవులు విమర్శించారు. ప్రమాదకరమైన విద్యుత్ సవరణ వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజలు, రైతులు, సంఘాలుఉద్యమించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కొత్త డిస్కంల ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం ఎంబి భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు టి జ్యోతితో కలిసి రాఘవులు మాట్లాడుతూ సవరణ చట్టం అమలులోనికి వస్తే రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యుత్ సబ్సిడీలు కూడా రద్దయ్యే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటు పరం చేస్తే ఈ రంగం అదానీ ఆధీనంలోకి వెళ్తుందన్నారు. విద్యుత్ రంగం రాష్ట్రాల పరిధిలో ఉన్నప్పటికీ రాష్ట్రాలకు హక్కు లేకుండా కేంద్రం చట్ట సరవణ చేస్తున్నదన్నారు. సవరించిన కొత్త చట్టం ప్రకారం ఖర్చుకు అదనంగా లాభం జోడించి, విద్యుత్ చార్జీలను నిర్ణయిస్తారని, తద్వారా వినియోగదారులపైన కూడా విద్యుత్ చార్జీల భారం పడుతుందని, ఈ చట్టం వస్తే ఏప్రిల్ ఒకటి నుంచి విద్యుత్ చార్జీల పెంపు అమలులోనికి వచ్చేలా మార్పులు చేస్తున్నారని విమర్శించారు. కొత్త డిస్కంల అంశంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కుట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం పడిందని, కేంద్ర కుట్రలో రాష్ట్ర ప్రభుత్వం భాగం కావొద్దని కోరారు. బిహార్ తూర్పు ప్రాంతంలో వామపక్షాలు బలమైన శక్తిగా ఉన్నాయని, ఎక్కువ స్థానాల్లో పోటీ చేసేందుకు తమకు అవకాశమున్నప్పటికీ బిజెపిని ఓడించేందుకు తాము అవసరం మేరకే పోటీ చేస్తున్నామని రాఘవులు వివరించారు. ఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసి కూడా అలాంటి పద్ధతిని అనుసరిస్తే బిజెపిని ఓడించడం సులభమని, కానీ వంద స్థానాల్లో పోటీ చేస్తే పరోక్షంగా బిజెపి విజయానికి సహకరించిందనే అపవాదు మూటగట్టుకోవాల్సి వస్తుందని సూచించారు.

**బిసి రిజర్వేషన్లను అడ్డుకుంటున్న బిజెపి : జాన్ వెస్లీ**

జాన్‌వెస్లీ మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుకుంటుందని విమర్శించారు. రిజర్వేషన్ల విషయంలో న్యాయపోరాటంతో పాటు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు పోరాటం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చే విధంగా చూడాలని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్లపై రాష్ట్రంలోని కేంద్ర మంత్రులకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, లేదంటే ఆ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల విషయంలో బిజెపిని ఓడించే పార్టీకి మద్దతినిస్తామని, త్వరలోనే దీనిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని జాన్ వెస్లీ తెలిపారు.

## మద్యం పాలసీ స్టేకి నిరాకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రభుత్వం రూపొందించిన మద్యం పాలసీ విధానపరమైనదని, ఈ వ్యవహారంలో స్టే ఇవ్వబోమని హైకోర్టు చెప్పింది. జీవో 93 ద్వారా ఆగస్టు 14న జారీ చేసిన మద్యం విధాన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలంటూ హైదరాబాదీ జి.అనిల్‌కుమార్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ శ్రవణ్‌కుమార్ విచారించారు. అప్లికేషన్ ఫీజు నాన్‌రిఫండ్ అమౌంట్ రూ. 3లక్షలుగా నిర్ణయించడం అన్యాయమని పిటిషనర్ వాదన తర్వాత న్యాయమూర్తి స్పందిస్తూ, అంత భారం అనుకుంటే అప్లికేషన్ పెట్టకుండా ఉండొచ్చు కాదా అని ప్రశ్నించారు. షాపుల కేటాయింపు, ఫీజుల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్‌లు కల్పించాలని పిటిషనర్ న్యాయవాది కోరారు. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన న్యాయమూర్తి విచారణను వచ్చే నెల 3వ తేదీకి వాయిదా వేశారు.

## బిసి వర్గీకరణ తర్వాతే ఎన్నికలు

ప్రజాపక్షం/హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్‌లను ఎబిసిడిలుగా వర్గీకరించాకే ఎన్నికలు పెట్టాలంటూ దాఖలైన పిటిషన్‌ను సోమవారం హైకోర్టు విచారించింది. గతంలో ఇదే తరహాలో దాఖలైన పిటిషన్లతో కలిపి విచారిస్తామని చెప్పింది. ఈలోగా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలంది. వర్గీకరణ చేసే వరకు జీవో 9 అమలును నిలిపివేయాలనే పిటిషన్ చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ విచారణను వాయిదా వేసింది. బిసి రిజర్వేషన్లను వర్గీకరణ చేయకుండా గుంపగుత్తగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తే కొన్ని బిసి కులాలే లబ్ధి పొందుతాయని పిటిషన్‌లో పేర్కొన్నారు.

## కేసు నమోదుకు ఆదేశాలివ్వండి

ప్రజాపక్షం/హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని భూదాన్ భూములపై స్టేటస్‌కో ఆర్డర్ ఉన్నప్పటికీ ఆ భూములు అన్యాక్రాంతం జరిగేలా చేసిన అధికారులపై పోలీసులు కేసు నమోదుకు ఆదేశాలివ్వాలని పిటిషన్ దాఖలైంది. నాగారం గ్రామంలోని సర్వే నెం.181లోని దాదాపు 50 ఎకరాల భూదాన భూముల లావాదేవీలపై దర్యాప్తునకు మహేశ్వరం పోలీసులను ఆదేశించాలని పిటిషన్ దాఖలైంది. భూదాన్ బోర్డు కస్టోడియన్‌గా నవీన్ మిట్టల్, అప్పటి ఎమ్మార్వో మహమ్మద్ అలీ ప్రైవేట్ వ్యక్తులతో చేతులు కలిపి కోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా చేశారంటూ దస్తగిరి అనే వ్యక్తి వేసిన పిటిషన్‌పై మంగళవారం విచారణ కొనసాగిస్తామని న్యాయమూర్తి ప్రకటించారు. కింది కోర్టు పిటిషన్‌ను కొట్టేయడాన్ని పిటిషనర్ సవాలు చేశారు.

## ఖమ్మం జిల్లా పరిధిలో మున్సిపల్ వర్కర్స్ సమస్య పరిష్కరించాలి

ఎఐటియుసి నేత యేసు రత్నం డిమాండ్



ప్రజాపక్షం/హైదరాబాద్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, మధిర ,వైరా , సత్తుపల్లి, ఏదిలాపురం, కల్లూరు తదితర మున్సిపాలిటీలలో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేసు రత్నం డిమాండ్ చేశారు. హైదరాబాదులోని తెలంగాణ కమిషనర్, డైరెక్టర్ అఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సిడిఎంఎ) జాయింట్ డైరెక్టర్‌కు సోమవారం ఆయన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కు సంబంధించి 16 మందిని కార్పొరేషన్ నుండి నేరుగా అవుట్సోర్సింగ్ వర్కర్స్ గా గుర్తించడానికి జులై 23వ తేదీన కౌన్సిల్ లో తీర్మానం చేసి సిడిఎంఎ కు పంపారని అయినా ఇంతవరకు ఎటువంటి పిలుపు రాకపోవడంతో వారే నేరుగా సిడిఎంఏకు రావడం జరిగిందన్నారు. ఆ 16 మంది వర్కర్లను ప్రభుత్వం వెంటనే ఔట్సోర్సింగ్ వర్కర్లుగా గుర్తించాలన్నారు. వైరా మున్సిపాలిటీకి సంబంధించి 50 మంది కార్మికులను 2018లో స్పెషల్ డ్రైవ్ లో తీసుకున్నారని వారికి నెలకు కేవలం 10,500 మాత్రమే చెల్లిస్తున్నారని వాస్తవానికి వారికి కూడా జీవో నెంబర్ 14 ప్రకారం జీతాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ విషయంపై అక్కడి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. కల్లూరు మున్సిపాలిటీగా మే 26 వ తారీకున ఏర్పడిందని ఇప్పటివరకు ఉద్యోగులకు సంబంధించిన బదలాయింపు పూర్తి కాలేదు అన్నారు. తద్వారా దాదాపు 107 మంది కార్మికులకు ఐదు నెలల నుండి శాలరీ రావడం లేదని దానికి కారణం కేవలం అధికారుల నిర్లక్ష్యమేనన్నారు. మధిర మున్సిపాలిటీలో పనిచేస్తున్న కొంతమంది కార్మికులకు ఈఎస్ఐ చెల్లించడం లేదని తద్వారా ఏదైనా ఆరోగ్య సమస్య వచ్చినప్పుడు ఆ కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని కనుక అధికారులు స్పందించి ఎవరెవరుకు ఈఎస్ఐ చెల్లించలేదు వారిని గుర్తించి తక్షణమే చెల్లించాలన్నారు. ఏదులాపురం సత్తుపల్లి తదితర మున్సిపాలిటీలలో జనాభాకు తగిన కార్మికుల సంఖ్య లేకపోవడం కారణంగా కార్మికులు తీవ్ర పని ఒత్తిడికి లోనవుతున్నారని కనుక జనాభా ప్రాతిపదికన దక్షిణమే నూతనంగా కార్మికులను నియమించుకోవాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్ని మున్సిపాలిటీలలో ఉన్న స్టాఫ్ మరియు పారిశుద్ధ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ వంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వంతో కలిసి హెల్త్, మరియు లైఫ్ ఇన్సూరెన్స్ లను చేయించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు,సబ్బులు, నూనె, బూట్లు, రైన్ కోట్లు, గ్లౌజులు ,యూనిఫామ్, యాప్రాన్, , ఐడెంటి కార్డ్స్ వంటి సౌకర్యాలను కల్పించాలనీ ఆయన ఈ సందర్భంగా అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి వి .హరినాథ్ , రాష్ట్ర నాయకులు ఏం. మద్దిలేటి , ఏఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, ఖమ్మం జిల్లా మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్ యూనియన్ నాయకులు గుడ్ల మహేష్ బాబు , బుర్ర రవి, లింగాల అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఓటర్ల జాబితాలో అవకతవకలు

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఓటర్ల జాబితాలో పెద్ద ఎత్తున దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్లు, అవకతవకలు చోటుచేసుకున్నాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు ఆరోపించారు. ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయంలో సోమవారం ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డికి పార్టీ సీనియర్ నేతలతో కలిసి వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఏ విధంగానైనా గెలవాలనే ప్రయత్నం చేస్తోందన్నారు. సామా, ధానం, భేద, దండోపాయాలతో ఎన్నికను ప్రభావితం చేయాలని చూస్తోందని విమర్శించారు. జూబ్లీహిల్స్‌లో సుమారు 400 పోలింగ్ బూత్‌లో కనీసం 20 వేల దొంగ ఓట్లు నమోదయ్యాయని, ఒకే వ్యక్తి పేరుతో రెండు, మూడు ఓటర్ ఐడిలు ఉన్నాయని, చిన్న చిన్న అక్షరాలు మార్చి ఒకే వ్యక్తిని అనేకసార్లు నమోదు చేశారన్నారు. ఒక చిన్న ఇంట్లో 150–200 ఓట్లు నమోదైన సందర్భాలు ఉన్నాయని వివరించారు. కనీసం 20,000 డూప్లికేట్ ఓట్లు ఉన్నాయని చెప్పారు. ఇంకా ఎన్ని ఉన్నాయో కమిషన్ తేల్చాలని కోరారు. ఓటర్ల జాబితాలో అవకతవకలపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని, దొంగ ఓట్లు చేర్చడంలో కుమ్మక్కైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులను వెంటనే బదిలీ చేయాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. కమిషన్ దీనిపై పూర్తి దర్యాప్తు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల కమిషనర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు తాగోపాల్, కాలేరు వెంకటేశ్, డి.సుధీర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఆది ఒక ఇల్లు కాదు.. అపార్ట్‌మెంట్

15 ఫ్లాట్లు, 43 మంది ఓట్లు నిజమైనవే

ఆ అపార్ట్‌మెంట్‌లో కొత్తగా ఒక్క ఓటు చేర్చలేదు


కెటిఆర్ ఆరోపణలపై జిల్లా ఎన్నికల అధికారి స్పష్టత



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఒకే ఇంట్లో 43 ఓట్లు ఉన్నట్టు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన ఆరోపణలు సరికాదని జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ స్పష్టం చేశారు. జూబ్లీ హిల్స్ నియోజకవర్గంలో ఒకే ఇంట్లో 43 ఓట్లు నమోదయ్యాయని కెటిఆర్ ఆరోపించారు. ఆదివారం, సోమవారాల్లో జరిగిన సమావేశాల్లో అదే అంశాన్ని ప్రస్తావించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని యూసుఫ్‌గూడ డివిజన్ కృష్ణానగర్ బిబ్లాక్‌లో బూత్ నెంబర్ 246లోని ఓటరు జాబితా ప్రకారం 83 231/బి/160 నెంబర్‌తో సంస్కృతి అవెన్యూ అనే అపార్ట్ మెంట్ ఉంది. ఇందులో 15 ఫ్లాట్లు ఉన్నాయి. అంటే 15 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇంటికి ముగ్గురు లెక్కేసుకున్నా 45 ఓట్లు ఉండాలి. దీనిని ఒకే ఇల్లు అని కెటిఆర్ పేర్కొన్నారు. దీనిపై జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్ మీడియాతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. ఈ అపార్ట్ మెంట్‌లో 43 మంది ఓటర్లున్నారు. వీళ్లంతా 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు నుంచి ఓటర్లుగా ఉన్న వాళ్లేనని చెప్పారు. వీళ్లంతా అసెంబ్లీ, 2024 పార్లమెంట్ ఎన్నికల సమయంలోనూ తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని స్పష్టం చేశారు. తాము కొత్తగా ఎవరి పేర్లనూ చేర్చలేదని చెప్పారు. ఇదే విషయాన్ని ఎన్నికల సంఘం ఎక్స్‌లో స్పష్టం చేసింది.

## రాష్ట్రంలో మూడురోజులు వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో మూడురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశామన్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, ఒడిశా, తెలంగాణలోని పలు ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం కొనసాగుతుందని అధికారులు చెప్పారు. నైరుతి బంగాళాఖాతం, దక్షిణ తమిళనాడు తీరం మీదుగా ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉందన్నారు. ఉత్తర తమిళనాడు తీరం, నైరుతి బంగాళాఖాతంలో సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఉపరితల ఆవర్తనం నైరుతి బంగాళాఖాతం, దాన్ని ఆనుకొని ఉన్న దక్షిణ తమిళనాడు తీరం మీదుగా ఉన్న ఉపరితల ఆవర్తనంతో కలిసిపోందని చెప్పారు. ఈ క్రమంలో తెలంగాణలో మూడురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. సోమవారం కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మంగళ, బుధవారాల్లో ఉరుములు, మెరుపులు, ఈదుగాలులతో కూడిన వర్షాలు పడే సూచనలున్నాయని తెలిపారు. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.



# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## బిహార్‌లో రెండవ విడత పోలింగ్‌కు నోటిఫికేషన్

**పాట్నా :** బిహార్‌లో రెండవ దశలో ఎన్నికలు జరిగే 122 అసెంబ్లీ స్థానాలకు నామినేషన్ పత్రాల దాఖలు సోమవారం ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల కమిషన్ నవంబర్ 11న ఈ స్థానాలో పోలింగ్ నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేయడంతో నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైందని వారు తెలిపారు.అక్టోబర్ 20వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని, నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ అక్టోబర్ 23 అని తెలిపారు. ఈ దశలో ఎన్నికలుజరగనున్నముఖ్యమైన స్థానాల్లో ఇమామ్‌గంజ్ స్థానాలు ఉన్నాయి. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యే కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ కోడలు దీపా మాంఝీ, మాజీ ఆర్‌జెడి మాజీ మంత్రి కుమార్ సర్వజీత్ బోధ్ గయ, భోజ్‌పురి గాయకుడు వినయ్ బిహారీ లౌరియా, మాజీ బిజెపి మంత్రి నారాయణ్ ప్రసాద్ నౌతాన్ ఉన్నారు. మొదటిదశలోని 121స్థానాలకు నామినేషన్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. నవంబర్ 6న పోలింగ్ జరుగుతుంది.

## కొత్త క్రిమినల్ చట్టాలతో..

# శిక్ష కంటే న్యాయం ద్వారానే న్యాయవ్యవస్థ నడుస్తోంది

### జైపూర్‌లో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా



**జైపూర్ :** మూడు కొత్త క్రిమినల్ చట్టాల అమలును 'ఒక చరిత్రాత్మక సంస్కరణ'గా, 21వ శతాబ్దంలో భారతదేశ నేర న్యాయంలో అతి పెద్ద మార్పు అని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అభివర్ణించారు. పాత వ్యవస్థలో కేసులలో శిక్షలు లేకుండా 25 నుండి 30 ఏళ్లపాటు లాగబడతాయి. ప్రజలకు సకాలంలో న్యాయం అందలేదు. కొత్త వ్యవస్థ ఆ పద్ధతిని మార్చింది. అమిత్‌షా సోమవారం జైపూర్‌లో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. ఈ కొత్త మార్పు నేరపరిశోధన, చట్టాలకు విరుద్ధంగా విచారణ చేయడానికి సంబంధించిన డెమోను తాను ఇవ్వడం జరిగిందన్నారు. జైపూర్ ఎగ్జిబిషన్ మరియు కన్వెన్షన్ సెంటర్ (జెఇసిసి)లో జరిగిన ఈ ప్రదర్శన భారతదేశ నేర న్యాయవ్యవస్థలో శిక్షా విధానం నుండి న్యాయం, పారదర్శకతపై దృష్టి సారించిన విధానంలోకి మారడాన్ని ప్రదర్శిస్తుంది. 'ఈ మూడు కొత్త చట్టాలు అందరికీ సులభమైనరీతిలో, సకాలంలో న్యాయం అందిస్తాయి. కొత్త క్రిమినల్ చట్టాల ద్వారా మన నేర న్యాయం శిక్ష ద్వారా కాకుండా న్యాయం ద్వారా నడపబడుతుంది' అని అమిత్‌షా చెప్పారు. న్యాయ వ్యవస్థ యొక్క ప్రతిష్ఠ ప్రజలను నిరుత్సాహపరిచే విధంగా ఉన్నదని, ఈ కొత్త చట్టాలు న్యాయాన్ని సులభతరం, వేగవంతం చేస్తాయని, న్యాయాన్ని అందుబాటులో కూడా ఉంచుతాయని అమిత్‌షా అన్నారు. ఈ చట్టాలను పూర్తిస్థాయిలో అమలు చేసిన తర్వాత భారతదేశ న్యాయవ్యవస్థ 'ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైనది'గా మారుతుందని అమిత్‌షా తెలిపారు. కొత్త చట్టాలు భారతీయ న్యాయసంహిత, భారతీయ నాగరిక్ సురక్షసంహిత, భారతీయ సాక్ష్య అధినీయం వలస పాలన కాలం నాటి ఇండియన్ పీనల్ కోడ్, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో ఈ కొత్త చట్టాలు 2024 జులై 1నుంచి అమలులోకి వచ్చాయి. కొత్త చట్టం కింద ప్రవేశపెట్టిన కాలపరిమితి విధానాలపై గడువులను చేరుకుంటాయా ? లేదా అనే సందేహాలు ప్రారంభంలో ఉన్నాయని, చార్జిషీట్లు దాఖలు చేసే సమయంలో రెగ్యులర్ నేరాలకు 60రోజులు, సీరియస్ నేరాల విషయంలో 90 రోజుల విషయంలో సందిగ్ధత నెలకొనేదని అమిత్‌షా వివరించారు. 'ఒక ఏడాదిలోపు అమలు అయ్యాక, దేశంలో 50శాతానికి పైగా చార్జిషీట్లు సకాలంలో దాఖలు అవుతున్నాయి. మరొక సంవత్సరం కాలంలో ఈ శాతం 90శాతానికి పెరుగుతుందని నేను నమ్మకంతో ఉన్నాను' అని హోం మంత్రి అమిత్‌షా తెలియజేశారు.ఈ కొత్త వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసేందుకు జైళ్లు మొదలు ఫోరెన్సిక్ ల్యాబ్‌ల నుండి సిబ్బంది, వేలాదిమంది జ్యుడీషియల్ ఆఫీసర్లు, లక్షలాది పోలీస్ అధికారులకు ప్రభుత్వం శిక్షణ ఇస్తోంది అని వివరించారు. ఈ సంస్కరణలు కోర్టులో ఫిజికల్ హాజరు అవసరాన్ని కూడా తగ్గిస్తాయని అమిత్‌షా చెప్పారు. నిందితులను జైలులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరుస్తారని, పోలీస్ అధికారులు, బ్యాంక్ ఉద్యోగులు, వైద్యులు, ఫోరెన్సిక్ నిపుణులు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుకాగలుగుతారని, దీని వల్ల డబ్బు ఆదా అవుతుందని అమిత్‌షా చెప్పారు. దీని వల్ల విచారణ ఖైదీలు పోలీస్ కస్టడీ నుండి తప్పించుకునే అవకాశాలు కూడా చాల తగ్గుతాయని ఆయన వెల్లడించారు.అక్టోబరు 18నాటికి ఈ ఎగ్జిబిషన్ ముగియనుందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం దీనిని పొడిగించాలని సూచించడం జరిగిందని, దీనివల్ల ప్రజలు అధిక సంఖ్యలో సందర్శించే అవకాశం ఉందని హోం మంత్రి అమిత్‌షా తెలియజేశారు. బిజెపి ప్రభుత్వం తన హయాంలో చేసిన మొత్తం రూ.35లక్షల కోట్లలో రూ. 4లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు భూమి పూజ జరిగిందని, బిజెపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తుందని అమిత్‌షా చెప్పారు.

## బిహార్‌లో ఎన్‌డిఎలో విభేదాలు

### మాంఝీ, కుష్వాకు చెరో ఆరు సీట్లు కేటాయించడంపై తీవ్ర అసంతృప్తి




**పాట్నా :** అసెంబ్లీ ఎన్నికలకు సీట్ల పంపకాలు పూర్తయి, వాటిని ప్రకటించిన తర్వాత బిహార్‌లోని అధికార ఎన్‌డిఎ కూటమి పోటీ చేసే నియోజకవర్గాల మధ్య విభేదాలు మరోసారి తెరపైకి వచ్చా యి. చిన్న మిత్రపక్షాలైన కేంద్ర మంత్రి జితన్ రామ్‌మాంఝీ నేతృత్వంలోని హిందూస్థానీ అవామ్ మోర్చా, రాజ్యసభ ఎంపి ఉపేంద్ర కుష్వాకు చెందిన రాష్ట్రీయ లోక్ మోర్చాకు చెరో ఆరు సీట్లు కేటాయించగా, సీట్ల పంపకాల ఫార్ములాపై తమ అసంతృప్తిని వ్యక్తం చేశాయి. 243 స్థానాలున్న బిహార్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతుండగా, సీట్ల పంపకాన్ని పాలక ఎన్‌డిఎ ఆదివారం ప్రకటించింది. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలోని జెడియు, బిజెపిలు చెరో 101 నియోజకవర్గాల్లో పోటీ చేయాలని నిర్ణయించాయి. మిగిలిన వాటిని చిన్న మిత్రపక్షాలకు వదిలివేశారు. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) 29 స్థానాల్లో పోటీ చేయనుంది. అయితే సీట్ల పంపకాలంపై మాంఝీ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 'హైకమాండ్ నిర్ణయించిన దానిని తాము అంగీకరించామని, కానీ మాకు కేవలం ఆరు సీట్లు ఇవ్వడం ద్వారా, వారు మమ్మల్ని తక్కువ అంచనా వేశారని, ఇది ఎన్నికల్లో ఎన్‌డిఎకు నష్టం కలిగించవచ్చన్నారు. అదేవిధంగా, కుష్వాహ్ కాడా సీట్ల పంపకం ప్రకటించిన తర్వాత తన పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఎక్స్‌లో 'ప్రియమైన మిత్రులారా/సహోద్యోగులారా, నేను మీ క్షమాపణ కోరుతున్నాను. మాకు లభించిన సీట్ల సంఖ్య మీ అంచనాల ప్రకారం లేదు. ఈ నిర్ణయం మా పార్టీకి అభ్యర్థులుగా ఉండాలని ఆశించిన వారిని బాధపెడుతుందని నేను అర్థం చేసుకున్నాను. ఈ రోజు, చాలా ఇళ్లలో, ఆహారం వండకపోవచ్చు. అయితే, నా, పార్టీ రెండింటి పరిమితులను మీరందరూ అర్థం చేసుకున్నారని నేను కచ్చితంగా అనుకుంటున్నాను. కోపం చల్లారనివ్వమని నేను మిమ్మల్ని వినయంగా అభ్యర్థిస్తున్నాను, ఆపై నిర్ణయం ఎంత సముచితమో లేదా అనుచితమో మీరే గ్రహిస్తారు. మిగిలినది కాలమే చెబుతుంది' అని ఆయన అన్నారు. తన పార్టీ గుర్తింపు పొందాలంటే ఎనిమిది గెలవాలి అనే కారణంతో కనీసం 15 సీట్లు గెలుచుకోవాలని పట్టుబడుతున్న మాంఝీ దేశ రాజధానిలో ఫార్ములా ప్రకటించబడటానికి ముందు పాట్నాకు బయలుదేరారు, కానీ తిరుగుబాటుకు చేయలేకపోయారు. రాష్ట్రంలోని ఎన్‌డిఎలోని రెండు అగ్ర పార్టీలు సమాన సంఖ్యలో సీట్లలో పోటీ చేయడం ఇదే మొదటిసారి. పాట్నాలో, రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి రాజేష్ రాథోడ్ ఎన్‌డిఎపై విమర్శలు గుప్పిస్తూ, సీట్ల పంపకాల ఒప్పందం బిజెపి నితీష్ కుమార్‌ను తగ్గించిందని స్పష్టం చేస్తోందన్నారు. రెండు పార్టీలు మిత్రపక్షాలుగా ఉన్నప్పటి నుండి జెడియు అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి కంటే ఎక్కువ సీట్లలో పోటీ చేయకపోవడం ఇదే మొదటిసారని, రానున్న రోజుల్లో బిజెపి జెడియును కబళిస్తుందనడానికి ఇది స్పష్టమైన సంకేతమన్నారు.

# కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలను విస్మరిస్తున్న కేంద్రం

### విపత్తు ప్రభావిత హిమాచల్ ప్రదేశ్‌కు తగిన సహాయం అందించలేదు: కాంగ్రెస్ విమర్శ

**సిమ్లా :** కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తోందని కాంగ్రెస్ మండిపడింది. విపత్తు ప్రభావిత హిమాచల్ ప్రదేశ్‌కు తగిన సహాయం అందించడం లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఆరోపించారు. సిమ్లాలో చారిత్రక రిడ్జ్ గ్రౌండ్‌లోని దౌలత్ సింగ్‌పార్క్‌లోకాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ ఆరుసార్లు హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేసిన వీరభద్ర సింగ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ర్యాలీలో ప్రియాంకా గాంధీ మాట్లాడారు. 'సుఖ్వీందర్ సుఖు ముఖ్యమంత్రి అయిన తర్వాత హిమాచల్‌లో భారీ వర్షాలు కురిశాయన్నారు. ఈ నేపథ్యంలో సాయం కోసం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కాంగ్రెస్ పాలిత రాష్ట్రానికి కేంద్రం తగిన సహాయం అందించలేదని ఆమె మండిపడ్డారు. ఎన్నికల్లో గెలవాలనే ఆసక్తి ఉన్న బిజెపి ప్రభుత్వం కాంగ్రెస్ పాలిత హిమాచల్ ప్రదేశ్ పట్ల వివక్ష చూపిందని ఆరోపించారు. రుతుపవనాల కాలంలో జూన్ నుండి సెప్టెంబర్ వరకు రాష్ట్రంలో 47 మేఘా విస్ఫోటనాలు, 98 ఆకస్మిక వరదలు, 148 పెద్ద కొండచరియలు విరిగిపడన ఘటనలు చోటు చేసుకోగా, వర్ష సంబంధిత ఘటనలలో 270మందిమరణించారు.మొత్తం నష్టం రూ. 5,426 కోట్లుగా అంచనా వేశారు. గత రెండు సంవత్సరాలలో హిమాచల్ ప్రదేశ్‌లో వేల కోట్ల విలువైన నష్టం జరిగిందని అధికారులు తెలిపారు. కాగా, వీరభద్ర సింగ్ విగ్రహం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రియాంక తన తల్లి సోనియాతో కలిసి నివాళులర్పించారు. ఆరు అడుగుల ఎత్తయిన కాంస్య విగ్రహాన్ని హిమాచల్‌ప్రదేశ్ మొదటి ముఖ్యమంత్రి వైఎస్ పర్మార్, మహాత్మా గాంధీ, మాజీ ప్రధానులు ఇందిరాగాంధీ, అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాల పక్కన ఏర్పాటు చేశారు. ర్యాలీలో ప్రియాంక మాట్లాడుతూ మనకు మహాత్మా గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, వీరభద్ర సింగ్ వంటి నాయకులు అవసరమని చెప్పారు. వారు ఎల్లప్పుడూ నిజాయితీ, సత్య మార్గాన్ని అనుసరించి ప్రజల అభివృద్ధికి అంకితభావంతో ఉన్నారన్నారు. దురదృష్టవశాత్తు దేశంలో ఈ మార్గాన్ని అనుసరించే నాయకులు చాలా తక్కువ, కానీ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రజల సమస్యలను నిర్భయంగా లేవనెత్తుతున్నారన్నారు. మన పూర్వీకుల కల నెరవేర్చడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తుందని, సరైన మనస్తత్వం, నిజాయితీ గల రాజకీయాలు దేశాభివృద్ధికి ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. వీరభద్ర సింగ్ గౌరవార్థం నిర్వహించిన ర్యాలీకి హాజరైనందుకు సోనియా, ప్రియాంక గాంధీలకు డిప్యూటీ సిఎం ముఖేష్ అగ్నిహోత్రి కృతజ్ఞతలు తెలిపారు. వీరభద్ర సింగ్ రాష్ట్ర ప్రజలతో భావోద్వేగ సంబంధాన్ని కలిగి ఉన్నారని ఆయన అన్నారు. దాదాపు 400 మంది పోలీసు సిబ్బందిని మోహరించారు. ట్రాఫిక్, పార్కింగ్ కోసం ప్రత్యేక ప్రణాళికతో నగరాన్ని ఐదు భద్రతా విభాగాలుగా విభజించారు. నగరంలో రవాణా, యుటిలిటీ వాహనాలు, భారీ వాహనాల కదలికను మధ్యాహ్నం 3 గంటల వరకు నిలిపివేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సచిన్ పైలట్, దీపేందర్ హుడా, కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ రజనీ పాటిల్, రాష్ట్ర క్యాబినెట్ మంత్రులు, కాంగ్రెస్ నాయకుడు రాజీవ్ శుక్లా కూడా పాల్గొన్నారు.

## అత్యాచారం కేసులో మరో ఇద్దరు అరెస్టు

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌లో 23 ఏళ్ల వైద్య విద్యార్థినిపై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో సోమవారం మరో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. దీంతో ఈ కేసులో మొత్తం అరెస్టుల సంఖ్య ఐదుకు చేరుకుందని పోలీసులు తెలిపారు. అసన్‌సోల్–దుర్గాపూర్ పోలీస్ కమిషనరేట్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ (డిసిపి) అభిషేక్ గుప్తా పిటిఐతో మాట్లాడుతూ అత్యాచారం ఘటనలో మరో ఇద్దరిని అరెస్టు చేశామని, బాధితురాలు దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఇప్పటి వరకు మొత్తం ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. ఒడిశా బాలాసోర్ జిల్లాలోని జలేశ్వర్‌కు చెందిన వైద్య విద్యార్థిని దుర్గాపూర్‌లోని ఒక ప్రైవేట్ మెడికల్ కాలేజీలో రెండవ సంవత్సరం చదువుతున్నది. అయితే శుక్రవారం రాత్రి కళాశాల క్యాంపస్ వెలుపల తన స్నేహితుడితో కలిసి భోజనం చేయడానికి వెళ్ళినప్పుడు సామూహిక అత్యాచారానికి గురైన విషయం తెలిసిందే. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, ఆ విద్యార్థిని మొదట కళాశాల అధికారులకు మూడు నుండి నాలుగు లైన్ల సంక్షిప్త లిఖిత ప్రకటనను సమర్పించింది. ఆమె, ఆమె స్నేహితుడు క్యాంపస్ వెలుపల నడుచుకుంటూ వెళుతుండగా అకస్మాత్తుగా కొంతమంది వ్యక్తులు వారిని చుట్టుముట్టారని, ఆపై ఆమెపై దాడి చేశారని పేర్కొంది. ఆ స్టేట్‌మెంట్‌ను తరువాత పోలీసులకు పంపారు. ఆ తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆమెతో పాటు ఉన్న స్నేహితుడు ప్రస్తుతం విచారణ కోసం పోలీసుల అదుపులో ఉన్నాడు. ఘటన జరిగిన రాత్రి అతని కదలికలు, ప్రవర్తన అనుమానాన్ని రేకెత్తించిందని దర్యాప్తు అధికారులు తెలిపారు. బాధితురాలి తండ్రి కూడా వేరే ఫిర్యాదు దాఖలు చేయగా, నిందితుడు మహిళను చుట్టుముట్టినప్పుడు ఆమె స్నేహితుడు అక్కడి నుండి పారిపోయాడన్నారు. అతను తప్పించుకున్న తర్వాత ఇతర విద్యార్థులను ఎందుకు అప్రమత్తం చేయలేదో లేదా కళాశాల నుండి సహాయం ఎందుకు కోరలేదో దర్యాప్తు అధికారులు పరిశీలిస్తున్నారని పోలీసు వర్గాలు తెలిపాయి. గతంలో అరెస్టు చేసిన ముగ్గురు నిందితులను ఆదివారం దుర్గాపూర్ సబ్‌డివిజనల్ కోర్టు ముందు హాజరుపరిచి 10 రోజుల పోలీసు కస్టడీకి తరలించారు. నేరంలో పాల్గొన్న లేదా నేరం గురించి తెలిసిన ఇతరుల కోసం గాలింపులు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

## వచ్చేవారం వాణిజ్య చర్చలు

### అమెరికా వెళుతున్న భారత్ బృందం

**న్యూఢిల్లీ:** భారత్–అమెరికా మధ్య వచ్చేవారంలో వాణిజ్య చర్చలు జరుగుతాయి. ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై సంభాషణలు, సంప్రదింపులు చేసేందుకు భారత్ సీనియర్ అధికారులు అమెరికాలో పర్యటిస్తారని ఉన్నతాధికారులు సోమవారం న్యూఢిల్లీలో చెప్పారు. ప్రతిపాదిత ద్వైపాక్షిక ఒప్పందం (బిటిఎ)పై సంప్రదింపులకు వీలుగా ఈ ఏడాది ఫిబ్రవరినెలలో ఈ రెండు దేశాల నాయకులు కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వచ్చేనెలాఖరునాటికి మొదటి దశ చర్చలు పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించారు. ఇప్పటివరకూ ఐదు విడతలుగా సంప్రదింపులు పూర్తయ్యాయి. గతనెలలో భారత వాణిజ్య,పరిశ్రమల మంత్రి పీయూశ్ గోయల్ నాయకత్వాన అధికారుల బృందం న్యూయార్క్‌లో వాణిజ్య చర్చల్లో పాల్గొంది. ఈ సమావేశం తర్వాత రెండు దేశాలకూ పరస్పరం ఎంతో ప్రయోజనం చేకూర్చే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని సత్వరం పూర్తిచేసేందుకు సంప్రదింపులు కొనసాగించాలని నిర్ణయించాయి. వాణిజ్య ఒప్పందంపై నిర్మాణాత్మకమైన సమావేశాలు జరిగాయి. వచ్చేవారంలో అమెరికా పర్యటన సందర్భంగా అమెరికా వాణిజ్య ప్రతినిధి జమైసన్ గ్రీర్, అమెరికా దౌత్యవేత్తగా భారత్‌లో నియమితుడైన సెర్గియో గోర్‌లతో భారత్ బృందం చర్చలు జరుపుతుంది. భారత్‌పై 25 శాతం సుంకాలను అమెరికా విధించింది. మరో 25 శాతం సుంకాలను కూడా పెనాల్టీగా (రష్యా నుండి చమురు దిగుమతి చేసుకుంటున్నందుకు) విధించింది. ఈ పరిస్థితుల్లో టారిఫ్‌ల తగ్గింపునకు బేరసారాల నిమిత్తం ఈ చర్చలు భారత్‌కు ఎంతో ముఖ్యమైనవి.

## భూటాన్ నుంచి వరదలు రావడం వల్లే

# ముంపులో ఉత్తర బెంగాల్

### హిమాలయ దేశం పరిహారం ఇవ్వాల్సిందే : మమతా బెనర్జీ



**కోల్‌కతా :** పొరుగున ఉన్న భూటాన్ నుంచి వరదలు రావడం వల్లే ఉత్తర బెంగాల్ ముంపునకు గురైందని, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. హిమాలయ దేశం పరిహారం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. సోమవారం ఆమె ప్రకృతి వైపరీత్య ప్రభావిత ప్రాంతంలో సహాయక, పునరావాస పనులను పర్యవేక్షించారు. జల్‌పైగురి జిల్లాలోని నాగ్రకాటా వద్ద ఆమె మాట్లాడుతూ భూటాన్ నుండి వివిధ నదుల వరదలు ఉప్పొంగడం వల్ల ఈ నష్టాలు సంభవించాయన్నారు. అందువల్ల తమకు పరిహారం ఇవ్వాల్సిందేనన్నారు. ఇండో–భూటాన్ జాయింట్ రివర్ కమిషన్ ఏర్పాటు చేయాలని కొంతకాలంగా పట్టుబడుతున్నానని, పశ్చిమ బెంగాల్‌ను అందులో భాగం చేయాలని డిమాండ్ చేస్తున్నానన్నారు. తమ ఒత్తిడి మేరకు ఈ నెల 16న ఒక సమావేశం జరగనుందని, తమ అధికారులు దానికి హాజరవుతారని ఆమె చెప్పారు. విపత్తులను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ద్రవ్య సహాయం అందకుండా చేసిందని ఆరోపించారు. ఈనెల 4న కురిసిన భారీ వర్షాల కారణంగా అత్యంత ప్రభావితమైన ప్రాంతాలలో ఒకటైన జల్‌పైగురి జిల్లా నాగరకట నాగ్రకాటాలోని బామండంగా ప్రాంతంలో ఏర్పాటు చేసిన అనేక సహాయ శిబిరాలను బెనర్జీ సందర్శించారు. 4న కురిసిన భారీ వర్షానికి డార్జిలింగ్, దాని పర్వత ప్రాంతాలలో ప్రాణనష్టం, ఆస్తి నష్టం ఎక్కువగా జరిగింది. వరదలు పూర్తిగా తగ్గిన తర్వాత కొట్టుకుపోయిన ఇళ్ల సర్వే నిర్వహిస్తామని, వాటిని పునర్నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని శిబిరాల్లో ఉన్న బాధితులకు మమతా బెనర్జీ హామీ ఇచ్చారు. వరదల్లో గతంలో వంతెన కూలిపోయిన తర్వాత పక్కనే ఉన్న గాథియా, దయానా నదులపై తాత్కాలిక వంతెన నిర్మించామని ముఖ్యమంత్రి చెప్పారు. ఆధార్ కార్డు, పాన్ కార్డు, భూమి హక్కులు వంటి ముఖ్యమైన పత్రాలను వరదలు కొట్టుకుపోవడం వల్ల బాధితులు మరింత బాధపడకుండా చూసుకోవడానికి, రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా నకలు కాపీలను తిరిగి జారీ చేయడానికి వీలుగా శిబిరాల్లో ఉన్న వారి నష్టం వివరాలను నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా, పశ్చిమ బెంగాల్ ఉత్తర జిల్లాల్లో కొండచరియలు విరిగిపడటం, వరదల్లో దాదాపు 32 మంది మరణించారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

## ఎంవిఎలో ఎంఎన్‌ఎస్ భాగం కావచ్చు

### శివసేన (యుబిటి) ఎంపి సంజయ్ రౌత్ ఆశాభావం



**ముంబయి :** మహారాష్ట్రంలోని మహావికాస్ అఘాడి (ఎంవిఎ)లో రాజ్ థాక్రే నేతృత్వంలోని ప్రతిపక్ష పార్టీ భాగం కావచ్చని శివసేన (యుబిటి) ఎంపి సంజయ్ రౌత్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను తమతో పాటు తీసుకెళ్లాలని మహారాష్ట్ర నవ నిర్మాణసేన (ఎంఎన్‌ఎస్) కోరుకుంటోందన్నారు. అయితే రౌత్ వ్యాఖ్యల తరువాత ఎంఎన్‌ఎస్ వైఖరిని పార్టీ చీఫ్ నిర్ణయిస్తారని ఆ పార్టీ పేర్కొంది. తమ పార్టీ వైఖరిని మరెవరో కాకుండా తాము మాత్రమే ప్రకటిస్తామని ఎంఎన్‌ఎస్ నాయకుడు సందీప్ దేశ్‌పాండే అన్నారు. సేన (యుబిటి) నాయకుడి వ్యాఖ్యను తోసిపుచ్చారు. మహారాష్ట్ర నవనిర్మాణ సేన అధిపతి పెద్ద ప్రతిపక్ష కూటమిలో భాగం అవుతారా లేదా అనేది అస్పష్టంగా ఉన్నప్పటికీ, రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఒకప్పుడు దాయాదులైన రాజ్ థాక్రే, సేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాక్రే చేతులు కలుపుతున్నారనే ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలో రౌత్ పై విధంగా వ్యాఖ్యానించారు. రాజ్ థాక్రే ఎంవిఎలో భాగం కావడానికి సిద్ధంగా ఉన్నారా అని విలేకరులు ప్రశ్నించగా, ఎంవిఎలో భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్‌ను కూడా తీసుకెళ్లాలని రాజ్ థాక్రే కోరుకుంటున్నారన్నారు. 'కానీ దీని అర్థం దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని కాదు' అని ఆయన నొక్కి చెప్పారు. తాను కొన్ని సమస్యల గురించి ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్‌తో మాట్లాడానని, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో కూడా మాట్లాడుతానని రౌత్ చెప్పారు. ఉద్ధవ్ థాక్రే కూడా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో మాట్లాడుతారని ఆయన అన్నారు. అయితే, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులలో ఒక వర్గం హార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎంఎన్‌ఎస్‌తో చేతులు కలిపే ఏ చర్యను వ్యతిరేకించారు. రాష్ట్ర రాజకీయాల్లో అందరికీ స్థానం ఉందని, శివసేన (యుబిటి) ఉన్నట్లే, ఎంఎన్‌ఎస్‌కు కూడా స్థానం ఉందన్నారు. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి (ఎస్‌పి), వామపక్ష పార్టీలకు కూడా స్థానం ఉందని రౌత్ చెప్పారు. మంగళవారం మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలవనున్న రాజ్, ఉద్ధవ్, పవార్‌లతో కూడిన ప్రతిపక్ష పార్టీల ప్రతినిధి బృందాన్ని రౌత్ ప్రస్తావించారు. అయితే, ఇసిని కలిసిన ప్రతిపక్ష ప్రతినిధి బృందానికి ఎంవిఎతో ఎలాంటి సంబంధం లేదని ఎంఎన్‌ఎస్ నాయకుడు దేశ్‌పాండే అన్నారు.

## కర్ణాటక ఓటర్ల జాబితాలో అవకతవకల ఆరోపణలపై...

# 'సిట్ ' దర్యాప్తు కోరిన పిటిషన్‌ను 'సుప్రీం' తిరస్కృతి

### 'ఇసిఐ'ని అభ్యర్థించాలని పిటిషనర్‌కు సూచించిన ధర్మాసనం

**న్యూఢిల్లీ :** బెంగళూరు సెంట్రల్ సహా ఇతర నియోజకవర్గాలలో ఓటర్ల జాబితాలలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై మాజీ జడ్జి నేతృత్వంలో స్పెషల్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ (సిట్)తో విచారణ జరిపించాలని కోరుతూ దాఖలు చేసినపిటిషన్‌ను స్వీకరించేందుకు సోమవారం సుప్రీంకోర్టుతిరస్కరించింది. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జోయ్‌మాల్యా బాగ్చి ధర్మాసనంభారత ఎన్నికల సంఘం(ఇసిఐ)లో తన అభ్యర్థనను కొనసాగించాలని పిటిషనర్‌ను కోరింది. 'మేం పిటిషనర్ న్యాయవాది చెప్పింది విన్నాం.ఇది ప్రజా ప్రయోజనంగా పూరించే పిటిషన్‌గా స్వీకరించడానికి మేం మొగ్గు చూపడం లేదు. పిటిషనర్ ఎన్నికల సంఘం ముందు తన అభ్యర్థనను కొనసాగించవచ్చు' అని ధర్మాసనం సూచించింది.ప్రాక్టీస్ అడ్వకేట్‌గా ఉన్నటువంటి పిటిషనర్ తరపు న్యాయవాది రోహిత్ పాండే మాట్లాడుతూ తాము ఇప్పటికే ఎన్నికల సంఘంలో రిప్రజెంటేషన్‌ను దాఖలు చేశామన్నారు.అయితే ఇసిఐ దానిని ఆమోదించలేదని చెప్పారు. పిటిషన్‌ను నిర్ణయించడానికి కొంత కాలపరిమితినినిర్ణయించాలనిపిటిషనర్ కోరారు. కాగా ధర్మాసనం ఆ అభ్యర్థనను తిరస్కరించింది. తగిన చట్టపరమైన పరిష్కారాన్ని పొందేను కోరింది. కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీవిలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికలలోబిజెపి,ఎన్నికల సంఘం కుమ్మక్కు మధ్య 'భారీ నేరపూరిత మోసం' జరిగిందనే ఒక పేలుడు వాదనలు చేసి దానిని ఓటు దొంగతనంగా అభివర్ణించడాన్ని అభ్యర్థన ప్రస్తావించింది. ఆరోపణ చేసే క్రమంలో కర్ణాటక రాష్ట్రంలోని ఒక నియోజకవర్గంలో ఓటరు జాబితాలో జరిగినఅవకతవకలపై రాహుల్‌గాంధీ విశ్లేషణ చేశారు.కోర్టుఆదేశాలను పాటించి, ఓటర్ల జాబితాల స్వతంత్ర ఆడిట్ పూర్తి అయ్యేంత వరకూ ఓటర్ల జాబితాలను తదుపరి సవరణ లేదా ఖరారుచేయకూడదని సుప్రీంకోర్టు ఆదేశాలను కూడాపిటిషన్ కోరింది.ఓటు చోరీ అనేది 'మన ప్రజాస్వామ్యంపై అణుబాంబు' అని రాహుల్ గాంధీ చెప్పిన వెంటనే కర్ణాటక, మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులు స్పందిస్తూ ఓటర్ల జాబితాలో 'తప్పు'అని పేర్కొన్న ఓటర్ల పేర్లను, ఎన్నికల కోసం సంతకం చేసిన డిక్లరేషన్‌తో పాటుపంచుకోవాలనికోరారు. ఈ విషయంలో అవసరమైన చర్యలను ప్రారంభించాలని అధికారులనుకోరారు. ఆగస్టు 17న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితాలో అవకతకవలకు సంబంధించిన పేర్లు సహా ఆరోపణలపై ప్రమాణం కింద ఇచ్చిన డిక్లరేషన్‌ను ఏడు రోజుల గడువులోపు సమర్పించాలని,లేనిపక్షంలోఆయన వాదనలు 'నిరాధారమైనవి', 'చెల్లనివి'గా మారుతాయని అన్నారు. నకిలీ లేదా కల్పిత ఎంట్రీలను గుర్తించడం, నిరోధించడం వంటి విధానాలు సహా ఓటర్ల జాబితాల తయారీ, నిర్వహణ, నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం, సమగ్రతనునిర్ధారించడానికిఎన్నికలసంఘానికి మార్గదర్శకాలను అమలు చేయాలని సుప్రీంకోర్టులో దాఖలుచేసినపిటిషన్‌లో కోరారు. అర్థవంతమైనధృవీకరణ,ఆడిట్,ప్రజాపరిశీలనను ప్రారంభించడానికి ఎన్నికల ప్రాప్యత, మెషీన్ చదవగలిగే, ఓసిఆర్ ఫిర్యాదు ఫార్మాట్‌లనుప్రచురించడానికి ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని పిటిషన్ కోరింది. బెంగళూరు సెం ట్రల్ పార్లమెంటరీ నియోజకవర్గం (మహాదేవ అసెంబ్లీ నియోజకవర్గం)జాబితాలో అవకతవకలు జరిగాయనిపిటిషనర్గమనించారు. కోర్టు అత్యవసరంగాపరిశీలించాల్సిఉందన్నారు. సుప్రీం కోర్టు రాజ్యాంగం పవిత్రతను కాపాడుతుందన్నారు.కోర్టు సమర్థవంతంగానిర్ధారించగలదని పిటిషన్ పేర్కొంది. 2024లోక్‌సభఎన్నికల తర్వాత, అసెంబ్లీ ఎన్నికలకుముందు4నెలల వ్యవధిలో సుమారు 39 లక్షల మంది కొత్త ఓటర్లుచేరారని,గత 5 ఏళ్లల్లో కేవలం 50 లక్షల మంది ఓటర్లు చేరారని ఆరోపించారు.

## ఇవిఎంలు, పేపర్ టైల్ యూనిట్ల యాదృచ్ఛిక పంపిణీ షురూ

**న్యూఢిల్లీ:**ఎలక్ట్రానిక్ఓటింగ్‌యంత్రాలసామర్థ్యంపై అభ్యర్థుల విశ్వాసాన్ని పెంపొందించే ప్రయత్నంలో నవంబర్ 6న జరిగే బిహార్ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశకు ముందు ఎన్నికల కమిషన్ ఇవిఎంలు, పేపర్ ట్రైల్ యూనిట్ల యాదృచ్ఛిక పంపిణీని ప్రారంభించింది. జాతీయ, రాష్ట్ర గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారులు ఇవిఎం నిర్వహణ వ్యవస్థ ద్వారా మొదటి యాదృచ్ఛికీకరణ చేశారని సోమవారం ఇసి ప్రకటనలో తెలిపింది. మంగళవారం నాటికి రెండవ యాదృచ్ఛికీకరణ జరుగుతుందని అధికారులు తెలిపారు. మొదటియాదృచ్ఛికీకరణతర్వాతమొత్తం54,311 బ్యాలెట్ యూనిట్లు (బియులు), 54,311 కంట్రోల్ యూనిట్లు (సియులు), 58,123 వివిప్యాట్‌లు (ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రైల్) యూనిట్లను 45,336 పోలింగ్ కేంద్రాలు కలిగిన 121అసెంబ్లీ నియోజకవర్గాలకు యాదృచ్ఛికంగా కేటాయించినట్లు పోల్ అథారిటీ తెలిపింది.

ST.JOHN'S INSTITUTE OF SCIENCE & TECHNOLOGY
(Affiliated to O.U & Approved AICTE, New Delhi)
Manneguda, Turkayamjal, Near RTA Office, Sagar Highway, R.R.Dist (10 KMS From L.B.Nagar 'X' Road
Contact: 9866749525, 8686005085 / Email: stjohnsmbamca@gmail.com
Admission Notification For 'B' Category Seats - 2025 - 2026
Course : MBA & MCA
* No of Vaccancies MBA Cource - 36
* No of Vaccancies MCA Cource - 18
ICET CODE: SJOT

ప్రజాపక్షం
మంగళవారం, 14 అక్టోబరు

# తీయని మాట.. చేదు నిజం..

దేశంలోని లక్షలాదిమంది గిగ్ కార్మికులకు సామాజిక భద్రత, పెన్షన్ పథకం ఓ అద్భుతంగా కనిపిస్తున్నప్పటికీ, వాస్తవాలు మాత్రం చేదు గుళికలే. దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక శక్తిగా ఎదుగుతున్నప్పటికీ, వారివి కనీస హక్కులకు, ఉద్యోగ భద్రతకు నోచుకోని బతుకులు. ఈ రంగంలో అత్యధిక శాతం మంది యువతీయువకులే. నిరంతరం శ్రమించి, మధ్య వయసు చేరుకునే సమయానికి శారీరకంగా, మానసిక నిస్సత్తువ కమ్ముకునే బాధిత బతుకులే. గిగ్ వర్కర్లకు పెన్షన్ పేరుతో మొదలైన జొమాటో–హెచ్‌డిఎఫ్‌సి పెన్షన్ ఇన్షియేటివ్ వాస్తవానికి కార్మికుల జీవితాలకు భద్రత కల్పించడం లేదు. పైగా, అస్థిరంగా ఉన్న శ్రమశక్తిని మరో మార్గంవైపు వెళ్లకుండా నిరోధిస్తున్నది. ప్రజా వనరులను తగ్గించడం, కార్మిక హక్కులను కుదించడం అనేవి ప్రైవేటు వర్గాలకు... ధనిక కుటుంబాలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వ అనుసరిస్తున్న విధానాలు. పాత పెన్షన్ విధానం (ఓపిఎస్) కార్మికులకు విస్తృతమైన హామీని ఇచ్చేది. కానీ, అదే స్థానంలో వచ్చిన నూతన పెన్షన్ విధానం (ఎన్‌పిఎస్) కార్మికుల సేవలనుగాక, మార్కెట్ భవిష్యత్తును ప్రామాణికంగా తీసుకొని, పెన్షన్ విలువను నిర్ణయిస్తున్నది. ఇది వృద్ధాప్యంలో పనికిరాదు. స్టాక్ మార్కెట్ సూచీలు గిగ్ కార్మికుల కడుపు నింపవు. ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు వంటి వర్గాలపై బలవంతంగా రుద్దిన ఎన్‌పిఎస్‌ను తర్వాత ప్రైవేట్ రంగానికి విస్తరించారు. ఇప్పుడు గిగ్ వర్కర్లను సైతం ఈ వలయంలోకి లాక్కొస్తున్నారు. వారి శ్రమను దోచుకునే కుట్రలు చేస్తున్నారు. నిజానికి, అసంఘటిత రంగంలోని గిగ్ వర్కర్లకు పెన్షన్ ప్రతిపాదన ఒక సుందర దృశ్యాన్ని ఆవిష్కరిస్తుంది. కానీ, మరో కోణంలో చూస్తే ఎన్నో లోపాలు. గిగ్ కార్మికులను మభ్యపెట్టి, మరో రంగానికి వెళ్లకుండా అడ్డుకట్టవేస్తే, తక్కువ చెల్లింపులతో, ఎక్కువ శ్రమను రాబట్టే ప్రయత్నాలు. కేవలం 72 గంటల్లో 30 వేల మందికిపైగా గిగ్ వర్కర్లు పెన్షన్ పథకానికి నమోదు చేసుకున్నారంటం, మిగతా వారిని కట్టుదాటకుండా నిలువరించే ప్రయత్నమే. ఈ పథకంలో యజమాని చెల్లించేది ఏమీ ఉండదు. ప్రభుత్వ చేయూత అసలే లేదు. గిగ్ కార్మికులు తమ సొమ్మును తామే ఒక ప్రైవేటు బీమా కంపెనీలో దాచుకోవాలి. సవాళ్లను అధిగమించి, నామమాత్రపు పెన్షన్ తీసుకోవాలి. గిగ్ వర్కర్లే తమ ఆదాయం నుంచి కొంత భాగాన్ని చెల్లించాలనడం దారుణం. యాజమాన్యాలకు, ప్రభుత్వానికి బాధ్యత లేదనడం బాధ్యతారాహిత్యం. తమ బాధ్యతను కూడా గిగ్ కార్మికులపైనే మోపడం 'దోపిడీ'కి పరాకాష్ట. జొమాటో, ఓలా, స్విగ్గీ వంటి పెద్ద ప్లాట్‌ఫామ్‌లలో కనిపించే డిజిటల్ వర్గం మాత్రం ఈ పథకంలోకి వస్తారనడం మరో దారుణం. దేశంలో లక్షలాది మంది గృహ నిర్మాణ పనుల్లో కార్మికులుగా, సహాయకులుగా ఎంతోమంది ప్లాస్టిక్ వంటి వ్యర్థపదార్థాలు సేకరించేవారిగా, వీధి వ్యాపారాలతో రోజులు దొర్లిస్తున్నారు. కేంద్రం గొప్పగా ప్రకటించిన పెన్షన్ పథకంలో వీరికి చోటు లేదు. పెద్ద కంపెనీలు నామమాత్రపు వేతనాలకు అధిక శ్రమ శక్తిని పొందడానికి వేసిన పాచిక తప్ప ఈ పథకం వల్ల గిగ్ వర్కర్లకు ఒరిగే ప్రయోజనం శూన్యం. ఇది ప్రైవేటు సంస్థల ఆర్థిక దౌర్జన్యం. గిగ్ వర్కర్లకు గుర్తింపునిస్తే, మరుక్షణం నుంచే, వారికి కార్మిక చట్టం అమలవుతుంది. కాబట్టి, గిగ్ వర్కర్లను గుర్తించడానికికూడా... వారిని స్థిరమైన ఉద్యోగులుగా ప్రకటించడానికి కూడా ప్రభుత్వం భయపడుతున్నది. అందుకే 'ప్లాట్‌ఫామ్ భాగస్వామి' అనే వంచనాత్మక పదాన్ని తెరపైకి తెచ్చింది. దీనివల్ల గిగ్ వర్కర్ కార్మికుడిగా చెలామణి అవుతాడు.. కానీ చట్టం ముందు కాదు. ఇదో విచిత్రం!

సామాజిక భద్రత అంటే ప్రతి పౌరుడికి కనీస హామీతో కూడిన భద్రతా వ్యవస్థ కావాలి. ధనికులపై ప్రత్యక్ష పన్నులు వేయాలి. యాజమాన్యాల నుంచి పెన్షన్ వాటాను తప్పనిసరి చేయాలి. నిజానికి రిటైర్మెంట్ గురించి కలలు కనడం గిగ్ వర్కర్లకు ఓ విలాసం. రోజూ కనీస ఆదాయం కోసం పరిగెడుతున్న వాళ్లు ముందు పొదుపు గురించి మాట్లాడడం వ్యంగ్యమే అవుతుంది. ఈ పరిస్థితి భారత సామాజిక నిర్మాణంలో పెరుగుతున్న అసమానతకు ప్రతిబింబం. పెన్షన్, ఆరోగ్య బీమా, కార్మిక హక్కులు వంటివన్నీ ఇప్పుడు 'ప్రైవేట్ ఎంపికలుగా' మారాయి. ఇక గిగ్ వర్కర్ల పెన్షన్ ప్రణాళిక ఒక మిథ్య. వారి శ్రమను మార్కెట్‌లో పెట్టుబడిగా మార్చే ప్రయత్నం. వారి వృద్ధాప్యాన్ని ఒక యాప్‌లో అనుసంధానించడం భారంగా మార్చే కుతంత్రం. మన సమాజం ఏ దిశగా వెళుతున్నదో చెప్పడానికి ఇదో ఉదాహరణ. గిగ్ వర్కర్లను ఉద్యోగులుగా గుర్తించి, యాజమాన్యాలు, ప్రభుత్వ వాటాలను తప్పనిసరి చేయకపోతే, ఇలాంటి పథకాల వల్ల ప్రయోజనం శూన్యం. గిగ్ వర్కర్ల ఆదాయ స్థితిని సొమ్ము చేసుకునే పథకాలు ఎందుకోసం? ఎవరి కోసం? ప్రభుత్వమే సమాధానం చెప్పాలి.

# ఆర్‌ఎస్‌ఎస్ గతం, వర్తమానాలను ఎందుకు కప్పిపుచ్చలేరు?



డి.రాజా
సిపిఐ ప్రధాన కార్యదర్శి

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ), రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)లు 1925లో స్థాపించబడ్డాయి. ఒకటి కాన్పూర్‌లో, మరొకటి నాగ్‌పూర్‌లో ఆవిర్భవించాయి. కానీ, ఉద్దేశ్యం, సిద్ధాంతం, చారిత్రక పాత్ర విషయంలో రెండూ భిన్నమైనవి. సిపిఐ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం నుంచి ఉద్భవించి, భారతీయ కార్మిక వర్గం, రైతాంగం, కుల, మతాలకు అతీతంగా సామ్రాజ్యవాదానికి, అణిచివేతకు వ్యతిరేకంగా చైతన్యపరిచింది. ఇది స్వాతంత్రోద్యమంలో సహజ భాగస్వామిగా ఉంటూ కేవలం రాజకీయ స్వాతంత్ర్యమే కాకుండా సామాజిక, ఆర్థిక పరివర్తనను డిమాండ్ చేసింది. ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు కె.బి.హెగ్డేవార్, తరువాత దాని సిద్ధాంతకర్త ఎం.ఎస్.గోల్వాల్కర్ స్వాతంత్ర్యోద్యమాన్ని 'రాజకీయ'పరమైనదని కొట్టిపారేశారు. దానికి బదులుగా మతపరమైన ప్రత్యేకత, కఠినమైన సామాజిక నిచ్చెనమెట్లతో కూడిన జాతిని నిర్మించడంపై దృష్టి సారించారు. అదే సమయంలో కమ్యూనిస్టులు స్వాతంత్ర్యం కోసం ప్రజలను సమీకరించడంతో పాటు, అనేక మంది జైలు పాలవడం, అమరులవడం జరిగింది. ఆర్‌ఎస్‌ఎస్ మాత్రం రహస్యంగా డ్రిల్స్ నిర్వహిస్తూ, కుల వ్యత్యాసాలను బలోపేతం చేయడం, వలసవాద పరిపాలన యంత్రాంగానికి విధేయతను చాటడంలో నిమగ్నమైంది.

1930లలో కార్మిక సమ్మెలు మొదలు తెలంగాణ, తెబాగ పోరాటాలు వరకు, పున్నప్ర–వయలార్ తిరుగుబాటు నుంచి 1940లలో విద్యార్థి ఉద్యమాల వరకు సిపిఐ శ్రేణులు ప్రధాన జాతీయ ఉద్యమాలలో భాగస్వాములు అయ్యాయి. కేవలం అధికార బదలాయింపుకే పరిమితం కాకుండా, దోపిడీ, అసమానతల నిర్మూలన కోసం పోరాడాయి. మరోవైపు ఆర్‌ఎస్‌ఎస్ దేశ విమోచనకు సంబంధించిన ప్రతి కీలక సమయంలో కనిపించకపోవడమే కాకుండా, బహుళత్వ, ప్రజాస్వామిక భారతదేశం అనే భావన పట్ల తిరస్కారభావంతో ఉండేది. అదే కాకుండా, భారతదేశ వైవిధ్యాన్ని బలంగా కాకుండా బలహీనతగా సంఘ్ చూసేది. మతపరమైన అస్తిత్వం పట్ల దాని వ్యామోహం. విభజించి, పాలించు అనే వలసవాద వ్యూహానికి అనుకూలించింది. అంతే కాకుండా ఆధునికత, సమానత్వం, సామాజిక న్యాయం భావనలు తమకు ప్రమాదమనే ఉన్నత కులాల ఆందోళనలను, సామాజిక మార్పు పట్ల దాని భయాన్ని ప్రతిబింబించింది.

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రసంగం, దాని చారిత్రక పునరావిష్కరణపై జరిగిన కసరత్తును సూచిస్తుంది. ఆయన ఆర్‌ఎస్‌ఎస్‌కు 'దేశభక్తి, సేవ' ఘనతను కట్టబెడుతూ, స్వయం సేవకులు విభజన సమయంలో కాందీశీకులకు నిర్విరామంగా సేవ చేశారని చెప్పారు. వాస్తవమేమిటంటే, 1940 ప్రాంతంలో ప్రత్యేకించి పంజాబ్, జమ్మూలలో విభజన మంటలను రాజేసిన కారణాలలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారం, విద్వేష సిద్ధాంతాలు కూడా ఉన్నాయి. ఆ సంస్థ సాహిత్యం, ఉపన్యాసాలు ముస్లింలను దేశద్రోహులుగా వర్ణించాయి. అవి అనుమానస్పద, ప్రతీకార వాతావరణాన్ని సృష్టించాయి. ఉపఖండంలో అతి పెద్ద విషాదాలలో ఒకటైన మతపరమైన సమీకరణలో దాని పాత్రను కప్పిపుచ్చడంలో భాగంగానే మానవ సేవ అనే కొత్తముఖం తొడిగారు. చైనా యుద్ధంలో చేసిన సేవలకు గుర్తింపుగా 1963లో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ఆర్‌ఎస్‌ఎస్‌ను జవహర్‌లాల్ నెహ్రూ ఆహ్వానించారనే మరో దీర్ఘకాలిక అబద్ధపు ప్రచారాన్ని మోదీ పునశ్చరణ చేశారు. నిజానికి 1963 పరేడ్‌లో ఎంపిలు, పాఠశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, కార్మిక సంఘాలను కూడా భాగస్వామ్యం చేశారు. అందులో భాగంగా ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ భారతీయ మజ్దూర్ సంఘ్ పరేడ్‌లో పాల్గొన్న సందర్భంలో వారితో ఆర్‌ఎస్‌ఎస్ శ్రేణులు అందులో పాల్గొనే అవకాశం ఉంది. అంతే తప్ప ఆర్‌ఎస్‌ఎస్‌ను 'ఆహ్వానించబడలేదు'. శతవత్సర ప్రసంగంలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ సైతం ఇదే పద్ధతిని అనుసరించి అర్ధ సత్యాలను చెప్పారు. ఆయన 'స్వదేశీ', 'స్వీయ ప్రకాశం', 'ఐక్యత' గురించి మాట్లాడారు. కానీ, ఐక్యత పట్ల ఆయన దృష్టికోణం వెలివేయడంపై నిర్మితమైంది. ఇదే భాగవత్ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన వర్గాల రిజర్వేషన్‌లపై సమీక్ష జరగాలని అన్నారు. జాతీయ ఐకత్య గురించి మాట్లాడే ఆర్‌ఎస్‌ఎస్ కులాలు, స్త్రీ, పురుషుల మధ్య, ఆధిపత్య, అధికారం లేని వారి మధ్య నిచ్చెన మెట్ల వ్యవస్థకు బలమైన మద్దతుదారు. దాని మహిళా విభాగం రాష్ట్రీయ సేవికా సమితి సైతం పురుషాధిక్య సంస్థ పితృత్వ నేతృత్వంలో కొనసాగుతుంది. ఆర్‌ఎస్‌ఎస్ ఉద్దేశ్యంలో 'ఐక్యత' అంటే ప్రతి ఒక్కరూ అగ్రకులాల హిందూ పురుష ఆధికత్యను అంగీకరించడమే.

సామరస్యం, సేవకోసం ఆర్‌ఎస్‌ఎస్ పని చేసిందనే భాగవత్ ఉద్ఘాటన, దాని స్వంత పత్రాల ముందే నిలవలేకపోంది. సంఘ్ మూల గ్రంథాలలో ఒకటైన గోల్వాల్కర్ రచించిన 'బంచ్ ఆఫ్ థాట్స్'లో ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులను దేశంలో మూడు అంతర్గత శతృవులుగా గుర్తించారు. ఈ వైఖరి నుంచి ఆర్‌ఎస్‌ఎస్ ఎన్నడూ వైదొలగలేదు. తన పునాదులను బలోపేతం చేసుకునేందుకు 'అంతర్గత శతృవుల'ను గుర్తించడాన్ని అది కొనసాగిస్తూనే ఉంది. స్వదేశీ, జాతీయవాదం అనే భాగవత్ పిలుపు డొల్లతనాన్ని వినిపిస్తున్నది. అది మార్గదర్శనం చేస్తున్న ప్రభుత్వ ఆర్థిక విధానాలు జాతీయ సంపదను కార్పొరేట్ గుత్తాధిపతులకు అప్పగించడం ద్వారా చిన్న పరిశ్రమలు, వ్యవసాయాన్ని డొల్లగా మార్చేసింది. సంఘ్ చెబుతున్న 'స్వీయ ప్రకాశం' అనే భావన ఆశ్రిత పెట్టుబడిదారి విధానానికి మోకరిల్లడంగా మార్చేసింది. దాని 'సాంస్కృతిక జాతీయవాదాన్ని' మతతత్వ ధృవీకరణగా ఆవిష్కరించింది.

వందేళ్ళుగా ఆర్‌ఎస్‌ఎస్ ధైర్యంతో కాకుండా రాజీపడి మనుగడ సాగిస్తున్నది. స్వాతంత్ర్యోద్యమ సమంలో బ్రిటీష్‌తో ఘర్షణ పడకుండా తప్పించుకుంది. గాంధీ హత్యానంతరం దానిపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయించుకునేందుకు కాంగ్రెస్‌లోని కొన్ని వర్గాలతో కుమ్ముక్కైంది. ఎమర్జెన్సీ సమయంలో ఇదే పద్ధతిని మరోసారి అనుకరించింది. తమ సంస్థపై నిషేదాన్ని తొలగిస్తే సహకరిస్తామని కోరుతూ ప్రభుత్వానికి ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ బాలాసాహెడ్ దేవరస్ ఉత్తరం రాశారు.

కమ్యూనిస్టులు అందుకు భిన్నంగా కార్మికుల హక్కుల కోసం, భూ సంస్కరణల కోసం, విద్య, ఆరోగ్యభద్రత కోసం, ఆధునిక భారతదేశంగా తీర్చిదిద్దడంలో బ్యాంకులు, బొగ్గు జాతీయకరణ వంటి ప్రగతీశీల చట్టం కోసం, కౌలు సంస్కరణలు, కార్మిక రక్షణలు, ప్రజా ఆరోగ్య చర్యల కోసం పోరాటాలు చేశారు. సిపిఐ, ఇతర వామపక్ష శక్తులు గణతంత్రం అనే వివేచనతో లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయంపై అన్ని రకాల దాడులకు వ్యతిరేకంగా నిలబడుతూ పరిరక్షిస్తున్నాయి. అన్ని యుద్ధాలలో, ముఖ్యంగా 1971లో బంగ్లాదేశ్ విమోచనకు భారతదేశం సహకరించిన సమయంలో అవి దేశం పక్షాన నిలబడ్డాయి. రాజభరణాల రద్దు, సమాఖ్యవాదం వేళ్ళూనుకోవటం, ప్రజాస్వామిక హక్కుల విస్తరణ కోసం కమ్యూనిస్టులు అండగా నిలిచారు. పంజాబ్, ఈశాన్యంలో వేర్పాటువాద శక్తులపై పోరాడడమే కాకుండా, ఖలిస్తాన్ ఉగ్రవాదం చేతుల్లో 300 మంది కామ్రేడ్‌లను కోల్పోయారు. దేశంలో మతసామరస్యాన్ని కాపాడేందుక స్థిరమైన కృషి చేస్తున్నారు.





మహాత్మాగాంధీ, బి.ఆర్.అంబేద్కర్‌లు సమర్థించిన సమానత్వ ఆదర్శాలకు ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేక వైఖరి కలిగి ఉంది. ఆర్‌ఎస్‌ఎస్ శత వార్షికోత్సవం సందర్భంగా మోదీ, భాగవత్‌ల ఉపన్యాసాలు వందేళ్ళ సేవలను ప్రతిబింబించకపోగా, చరిత్రను పునర్‌లిఖించటం, విభజన, మోసంపై కొనసాగుతున్న సిద్ధాంతానికి చట్టబద్ధత కల్పించే ప్రయత్నాలు కనిపించాయి.

వందేళ్ళ కాలంలో ఎవరు జాతి అంతరాత్మ కోసం నిజంగా సేవ చేశారు, ఎవరు దానిని విభజించారు అనే కాకుండా న్యాయం పేరుతో ఎవరు దానిని ఐక్యంగా ఉంచారనేది స్పష్టమైంది.

*(ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యంతో..)*

# కులాల కుంపట్లలో..
# బడుగులే సమిధలు..!



బండి సుధాకర్ గౌడ్
టిపిసిసి అధికార ప్రతినిధి
99123 71755

కుల ఆధారిత వివక్ష, బహిరంగ అవమానాలు భరించలేక ఒక ఐపిఎస్ అధికారి తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్య చేసుకోవడం అంటే... ఈ దేశంలో బడుగు బలహీన వర్గాల వారు బతకలేని దుస్థితికి అద్దం పడుతున్నది. బిజెపి పాలనలో దేశంలోని అత్యున్నత సర్వీసులో ఉన్న అధికారులకు కూడా సామాజిక న్యాయం అందడం లేదంటే.. ఇక సామాన్య బడుగు బలహీనుల పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు.

దేశాన్ని విస్మయానికి గురిచేసిన హర్యానా ఐపిఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య ఈ దేశ పరిపాలనా వ్యవస్థలోని లోతైన అసమానతలను వెలికి తీసింది. ఇది ఒక్క వ్యక్తి ప్రాణనష్టం కాదు — ఇది దేశ పరిపాలనా వ్యవస్థకు ఒక అద్దంగా భావించాల్సి ఉంటుంది.

విభిన్న వర్గాల నుండి వచ్చిన అధికారులకు గౌరవం, భద్రత, సమానత ఇవ్వని వ్యవస్థలో సంస్కరణలు తప్పనిసరి అవసరం అవుతాయనడంలో సందేహం లేదు.



అదేవిధంగా పూరన్ ఆత్మహత్యపై సిబిఐ దర్యాప్తు తప్పనిసరి అవసరంగా భావించాలి. ఎస్‌సి, ఎస్‌టి, బిసి అధికారుల హక్కుల రక్షణకు కూడా కొత్త విధానం అవసరమని కూడా మన దేశ ప్రభుత్వాలు గుర్తెరగాలి.

**ఆత్మహత్య వెనక మానవ విలువల పతనం**

హైదరాబాద్ బర్కత్‌పురాకు చెందిన పూరన్ కుమార్ — క్రమశిక్షణ, నిబద్ధత, సామాజిక విలువల పట్ల అచంచల నమ్మకం కలిగిన అధికారి. కానీ, ఆ స్థాయిలో ఉన్న అధికారిని కూడా వ్యవస్థలోని అంతర్గత వేధింపు లు, జాతి ఆధారిత వివక్ష, మానసిక ఒత్తిడులు చివరకు ప్రాణాలు తీసుకున్నాయి.

తన సూసైడ్ నోటులో పూరన్ కుమార్ తనను అవమానపరిచిన, జాతి కారణంగా తక్కువగా చూసిన, పదోన్నతులు, పోస్టింగులు నిలిపివేసిన అధికారుల పేర్లు స్పష్టంగా రాశారని కూడా కుటుంబ సభ్యులు వెల్లడించారు. పూరన్ కుమార్ మరణానికి కారణమైన ఉన్నతాధికారులను కూడా సస్పెండ్ చేయాలని, సాక్ష్యాలను రక్షించాలని, సిబిఐ దర్యాప్తు ద్వారా పూర్తినిజం వెలికి తేవాలని ఆయన కుటుంబీకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్ని కోరుతున్నా రు. కానీ, వేధింపులకు కారణమైన అధికారులపై ఇప్పటికీ చర్యలు తీసుకోకపోవడం అంటే.. మన పాలకులు ఏ వర్గాలకు కొమ్ముకాస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా ఒక SIT (Special Investigation Team) ఏర్పాటు చేసినా సరిపోదు. ఎందుకంటే, స్థానిక అధికారుల ప్రభావం, రాజకీయ ఒత్తిడి, పోలీసు శాఖలో ఉన్న అంతర్గత వర్గపోరు వలన దర్యాప్తు నిజాయితీగా జరగకపోవచ్చనే భయం కూడా అందరిలోనూ ఉంది. అందుకే, ఈ కేసును సిబిఐకి బదలాయించి, పారదర్శకంగా, న్యాయపరమైన పద్ధతిలో దర్యాప్తు జరగాలని దేశవ్యాప్తంగా విస్తృతంగా డిమాండ్ పెరుగుతోంది.

**ఎస్‌సి/ఎస్‌టి/బిసి అధికారులపై వ్యవస్థాత్మక వివక్ష**

దేశ రాజ్యాంగం సమానత్వం హామీ ఇచ్చినప్పటికీ, పరిపాలనా వ్యవస్థలో జాతి ఆధారిత వివక్ష ఇంకా కొనసాగుతోంది. ఉన్నత స్థానాల్లో ఉన్న అధికారులపైనా సామాజిక పీడన, అవమానాలు, అధికార దుర్వినియోగం కనిపిస్తోంది. ఎస్‌సి, ఎస్‌టి, బిసి అధికారుల ప్రతిపాదనలను పాలకులు సరిగా పట్టించుకోకపోవడం, వారి పదోన్నతులలో పక్షపాతం, వారిపై అవమానకర వ్యాఖ్యలు, ఒత్తిళ్లు, వారి పట్ల మానసిక వేధింపులతో పూరన్ కుమార్ ఆత్మహత్య లాంటి ఘటనలు మళ్లీ మళ్లీ జరగడం మన ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా మారుతున్నాయి.

**ప్రభుత్వం తీసుకోవాల్సిన అత్యవసర చర్యలు :**

1. సిబిఐ దర్యాప్తు
పూరన్ కుమార్ ఆత్మహత్య కేసులో రాష్ట్ర రాజకీయ ప్రభావాల నుండి స్వతంత్రంగా పనిచేయగల కేంద్ర సంస్థ ద్వారా దర్యాప్తు జరగాలి. సిబిఐ లేదా జ్యుడీషియల్ ఇన్వెస్టిగేషన్ కమిటీ ద్వారా కేసును పూర్తి పారదర్శకంగా విచారించాలి.

2. ఎస్‌సి/ఎస్‌టి/బిసి అధికారుల రక్షణ చట్టం
ప్రస్తుతం ఉన్న ఎస్‌సి, ఎస్‌టిలపై అరాచకాల నిరోధక చట్టాన్ని అమలును మరింత కఠినతరం చేయాలి. అధికార స్థాయిలో వేధింపులు జరిగితే వెంటనే సస్పెన్షన్ మరియు శిక్ష విధానం ఉండాలి.

3. సమాన అవకాశాల కమిషన్ ఏర్పాటు
ప్రతి రాష్ట్రంలో ఒక ప్రత్యేక సమాన అవకాశాల కమిషన్ ఏర్పాటుచేయాలి.
ఇది అన్ని జాతుల అధికారుల మధ్య ఉన్న వివక్ష, అన్యాయం, వేధింపులను గుర్తించి నివేదిక ఇవ్వాలి.

4. మానసిక ఆరోగ్య కౌన్సిలింగ్ సెంటర్లు
ప్రతీ జిల్లా స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులకు మానసిక ఆరోగ్య సాయం కేంద్రాలు ఏర్పాటు చేయాలి.
ఉద్యోగ ఒత్తిడి, దౌర్జన్యం, హైరార్కీ దౌర్భాగ్యాలు తగ్గించే విధానం ఉండాలి.

5. పారదర్శక ప్రమోషన్ విధానం
అధికారుల ప్రమోషన్, పోస్టింగ్, శిక్ష విధానాలు కచ్చితమైన ప్రమాణాల ప్రకారం ఉండాలి.
జాతి ఆధారంగా లేదా గ్రూప్ లాబీయింగ్ ఆధారంగా జరిగే నియామకాలకు పూర్తి నిషేధం ఉండాలి.

కేంద్రప్రభుత్వం వెంటనే స్పందించి పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారణమైన ఉన్నతాధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. పూరన్ కుమార్‌ను వేధించిన అధికారులను సస్పెండ్ చేసి, సిబిఐ దర్యాప్తు ద్వారా నిజం వెలికి తేవాలి. తద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి అధికారులకు న్యాయం జరుగుతుందనే భరోసా కల్పించాలి, వారి హక్కులు రక్షించబడే నూతన విధానం కూడా కేంద్రం అవలంబించాల్సి ఉంటుంది.

# నోబెల్ అ'శాంతి'



బుడ్డిగ జమీందార్
98494 91969

''మరియా కొరినా మచాడో 2025 సంవత్సరానికి నోబెల్ శాంతి బహుమతి పొందిందనే వార్తా శీర్షిక చూసినప్పుడు అసందర్భమైన ఆ గౌరవ పురస్కార ప్రకటన నా నవ్వును ఆపలేదు. ఆమె రాజకీయంగా దేనికోసమై నిలబడుతోందో తెలిసిన ఎవరికైనా ఆమె అశాంతికి ఏమీ చేయలేదని ఇట్టే తెలుస్తుంది. 2025 వ సంవత్సరంలో శాంతిగా పరిగణించేది ఇదేనయితే నోబెల్ బహుమతి ప్రతి అణువూ తన విశ్వసనీయతను కోల్పోతుంది'' అని వెనుజులా అమెరికన్‌గా నాకు స్పష్టంగా అర్థమవుతుందని మిచెల్లే ఎల్నర్ సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. వాషింగ్టన్ పాలనను వెనుజులాలో తీసుకురావటానికి దేశ సార్వభౌమాధికారాన్ని సామ్రాజ్యవాదానికి తాకట్టు పెట్టే మనిషి మచాడో. వెనుజులాపై ఆంక్షలను విధించమని వాటిని వెనుజులా ప్రజలపై రుద్దించింది. 2020 నాటికి దాదాపు లక్షకు పైగా మరణాలకు కారణమైన అమెరికా ఆంక్షలను ఆమె నిస్సిగ్గుగా సమర్థించింది. సామ్రాజ్యవాద అండతో స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నిక పోరాట యోధురాలిగా తనకు తానే ప్రచారం చేసుకొంటూ, ఏప్రిల్ 2002లో వెనుజులాలో ప్రజాదరణ పొందిన అధ్యక్షుడు హ్యూగోఛావేజ్‌ను తాత్కాలిక పదవీచ్యుతుణ్ణి చేయటానికి విఫల యత్నం చేసింది. తిరుగుబాటుకు మద్దతుగా కార్మోనా డిక్రీపై సంతకం చేసి అపఖ్యాతి పాలైంది.

అటుపిమ్మట సిఐఎ ఆర్థిక సహకారంతో ఎన్‌జిఒ సుమాటేను ప్రారంభించి, గతంలో సిఐఎ చేసిన రాజకీయ కార్యకలాపాలను నిర్వహించటానికి 'నేషనల్ ఎండోమెంట్ ఫర్ డెమోక్రసీ' ద్వారా హింసాత్మక అస్థిరత ప్రయత్నాలను నిర్వహించింది. గత వారం న్యూయార్క్ టైమ్స్ పత్రికలో 'బల ప్రయోగాన్ని సమర్థించే సమూహం మరియా కొరినా నేతృత్వంలో ఉంది' అని రాస్తూ, ఈమె సలహాదారుల్లో ఒకరైన పెడ్రో తాను ట్రంప్ పాలనతో సమన్వయం చేసుకొంటానని, అందుకుగానూ అధికారం వచ్చిన తర్వాత 100 గంటల ప్రణాళిక సిద్ధంగా ఉందని చెప్పాడు. అంతర్జాతీయ మిత్ర దేశాల భాగస్వామ్య మద్దతు ఈ ప్రణాళికకు ఉందని చెప్పాడు. అంటే ఆ 100 గంటలు 1973లో చిలీలో, 1976లో అర్జెంటీనాలో తిరుగుబాట్ల తర్వాత జరిగిన వాటిలాగే రక్తపాతంగా ఉంటాయని సోషలిస్టు వెబ్‌సైట్ రాసింది.

ఇటీవల ఫ్రాక్స్ న్యూస్‌లో కరేబియన్‌లో కొనసాగుతున్న అమెరిక సైనిక విస్తరణను మాచాడో సమర్థిస్తూ, వెనుజులా అధ్యక్షుడు మదురో మాదకద్రవ్యాల కార్టెల్స్ కోసం పని చేస్తున్నట్లు ఆధారాలు చూపకుండా, నిందితులుగా ఉన్న మత్స్యకారులపై జరిపిన హత్యాకాండను మరియాకొరినా సమర్థించింది. దక్షిణ కరేబియన్‌లో 5 చిన్న నౌకలను పెంటగాన్ ముంచివేసింది. అదే సమయంలో వెనుజులా ఆక్రమణకు 4,500 సైనికుల్ని, నావికా దళాన్ని, యుద్ధ విమానాల్ని అమెరికా పంపింది. 1989 లో పనామాపై జరిపిన దాడి తర్వాత ప్రస్తుతం అతిపెద్ద సైనిక సేకరణ మదురో ప్రభుత్వాన్ని కూల్చటానికి సిద్ధంగా ఉంది. దీనికి అనుకూలంగా మదురోను నియంతగా, మాదక ద్రవ్యాల సప్లైదారునిగా చిత్రీకరించి, ప్రతిపక్ష నేత మచాడోకు నోబెల్ శాంతి బహుమతి ఇప్పించటం ద్వారా అమెరికా కీలుబొమ్మ ప్రభుత్వ స్థాపనకు రంగం సిద్ధం అవుతోందని అర్థమవుతోంది. నోబెల్ బహుమతికి స్పందనగా 'మనం విజయం అంచున ఉన్నాము. ఇకపై అధ్యక్షుడు ట్రంప్‌పై ఆధారపడదాము' అని చేసిన ప్రకటనతో తిరగుబాటు స్పష్టంగా కనబడుతోంది.



అమెరికా వలస విధానాల వల్ల అదృశ్యమైన తమ పిల్లల కోసం వెనుజులా తల్లులు వెతుకుతుండగా, వలస వచ్చిన పిల్లలను బోనులో బంధించి ఐసీఈ పర్యవేక్షణలో కుటుంబాలను ముక్కలు చేసే ట్రంప్ నిర్ణయాలను 'నిర్ణయాత్మక చర్యలు'గా మరియా కరోనా ప్రశంసించింది. మచాడో శాంతికి లేదా పురోగతికి ఎంతమాత్రం చిహ్నం కాదు. ఆమెను ప్రపంచంలోని ఫాసిజం, జియోనిజం, నయా ఉదారవాదాల మధ్య భాగస్వామిగా చూడాలి. ఇది ప్రజాస్వామ్య, శాంతి భాషలో ఆధిపత్యాన్ని సమర్థించే అక్షంగా చూడాలి. వెనుజులాలో ఈమె కూటమి లక్ష్యం తిరుగుబాటు, ఆంక్షలు, ప్రైవేటీకరణ.

స్వదేశంలో పిల్లలు ఆకలితో అలమటిస్తుండగా, విదేశాలలో వెనిజులా వనరులను దోచుకొంటున్న అమెరికా మద్దతుతో నడిచే 'తాత్కాలిక ప్రభుత్వం' అని పిలిచే కీలుబొమ్మ ప్రభుత్వ ప్రదర్శనను ఆమె చేస్తుంది. ఇప్పుడు ఆమె వెనుజులాలోని చమురు నిక్షేపాలను, నీరు, మౌలిక సదుపాయాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని కోరుకొంటుంది. 1990వ దశకంలో లాటిన్ అమెరికాను దుఃఖ ప్రయోగశాలగా మార్చిన విధానం ఇదే. ఈమె కోరుకొనే ఆర్థిక ఆంక్షలతో మూల్యం చెల్లించేది కార్మికులు, కర్షకులు, పేదలు, రోగులు మాత్రమే.

మచాడో హింస రాజకీయాలకు నిదర్శనంగా, ఆమె విదేశీ జోక్యానికి పిలుపునిచ్చి ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు సాయా న్ని అర్థించింది. ''స్వేచ్ఛ'' అనే పేరుతో వెనుజులాపై గాజా తరహా గా బాంబుల వర్షం కురిపించమని విజ్ఞప్తి చేసింది. గాజాలో దీని అర్థం జాతి నిర్మూలన, ఒక వర్గ ప్రజలను అంతం చేయటం.

'ఈ మధ్య సంవత్సరాల్లో నోబెల్ శాంతి బహుమతి లెబనాన్‌లో సబ్రా, పాటీల ఊచకోతలకు కారణమైన ఉగ్రవాది మాజీ ఇజ్రాయెల్ ప్రధాని మెనాబెమ్ బిగిన్‌కు, మయన్మార్‌లో రోహింగ్యా మైనారిటీలపై జాతి నిర్మూలనా హింసకు కారణమైన ఆంగ్‌సాన్ సూకీ వంటి సామూహిక హంతకులకు, నేరస్థులకు వెళ్లింది,' అని సోషలిస్టు వెబ్‌సైట్ పేర్కొంది. 2009లో ఆఫ్ఘనిస్థాన్‌లో సైనిక దాడి ప్రారంభ దశలో డ్రోన్ల దాడులు జరుగుతున్న సందర్భంగా బరక్ ఒబామా ఈ పురస్కారాన్ని అందుకొన్నారు. అప్పుడు, ఇప్పుడు కూడా ఈ బహుమతి శాంతి నెకొల్పే వారికి ప్రోత్సాహంగా కా కుండా, సామ్రాజ్యవాదాన్ని ఇష్టపడుతూ, వారికి అభిషేకం చేస్తూ, యుద్ధాన్ని చట్టబద్ధం చేసేవారికి ఒక సాధనంగా ఈ పురస్కారం ఉపయోగపడుతుందని అభ్యుదయ ఆన్‌లైన్ పత్రికలు రాస్తున్నాయి. శిధిలాల నుంచి మృతదేహాలను తవ్వుతున్న పాలస్తీనియన్ వైద్యులు, సత్యాన్ని ప్రపంచానికి అందించే ప్రయత్నంలో భాగం గా ప్రాణాల్ని పణంగా పెట్టిన జర్నలిస్టులు, గాజా ముట్టడి బద్దలు కొట్టి, ఆకలితో ఉన్న పిల్లలకు సహాయం అందించటానికి పోటిల్లా పడవల సముదాయంలోని మానవతావాదులే అసలైన శాంతి కాముకులు. నోబెల్ నిజంగా నోబెల్‌గా వ్యవహరించాలంటే ఈ యోధులకు శాంతి బహుమతి ఇవ్వాలి. నోబెల్ ఫౌండేషన్ శాంతి బహుమతి ఇవ్వకపోయినా ప్రజల గుండెల్లో ఎల్లవేళ లా వీరందరూ శాంతిదూతలుగా చిరకాలం నిలుస్తారు.

# ఏకరూప ప్రమాణాలు..నాణ్యత కొలమానాలు

ఐరాస నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి సామాజిక అసమతుల్యతకు పరిష్కారం, సుస్థిరమైన ఆర్థిక ప్రగతి సాధనకు, వాతావరణ మార్పుల రేటును తగ్గించడానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రభుత్వ ప్రభుత్వేతర సంస్థల సహకారంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలు ఉపయోగపడుతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా ప్రధాన అంతర్జాతీయ ప్రమాణ సంస్థలు తమతమ దేశాల ప్రమాణాలను నిర్ణయించుకుంటూ, అంతర్జాతీయంగా ప్రమాణాలను ఒకే రీతిలో అమలు చేయడానికి, ప్రమాణాల ప్రాధాన్యతను అవగాహన పరచుకోవడానికి ప్రతి ఏట 14 అక్టోబర్ రోజున ప్రపంచ ప్రమాణాల దినోత్సవం (వరల్డ్ స్టాండర్డ్స్‌డే) నిర్వహించడం ఆనవాయితీగా మారిం ది. 14 అక్టోబర్ 1946 రోజున లండన్ నగరంలో 25 దేశాల ప్రతినిధులు పాల్గొని వినియోగదారులకు ప్రామాణికమైన, నాణ్యమైన వస్తు ఉత్పత్తులను అందించేందుకు అంతర్జాతీయ ప్రామాణిక సంస్థ (ఇంటర్నేషనల్ స్టాండరడ్స్ ఆర్గనైజేషన్) ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భానికి గుర్తుగా 14 అక్టోబర్ రోజున ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని 1970 నుంచి జరుపుకుంటున్నాం.




**బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ స్థాపన :**

ప్రస్తుతం ఈ సంస్థలో 125 సభ్య దేశాలు ఉన్నాయి. 1947లో భారత్‌లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ చట్టాన్ని ఆమోదించి దానిని శాసనపరమైన సంస్థగా మార్చి ఐఎస్ఐ ముద్రను ప్రకటించారు. ఈ సంస్థ మొదటి సారి మన జాతీయ పతాకం పొడవు, వెడల్పులను నిర్ణయించారు. అదే క్రమంలో మొదటిసారి వస్త్రాలు, ఇంజనీరింగ్‌లకు రెండు వేర్వేరు విభాగాలను ఏర్పాటు చేశారు.

ప్రపంచ ప్రమాణాల దినోత్సవం వేదికగా ఆయా రంగాల్లో విశేష కృషి చేసిన వారిని స్మరించుకోవడం జరుగుతుంది. అంతర్జాతీయ వాణిజ్యం, భద్రత, జీవన నాణ్యతను పెంచడంలో ప్రామాణికరణ విశేష పాత్రను పోషిస్తున్నది. అంతర్జాతీయ మార్కెట్లో ప్రమాణాలు కీలక పాత్రను పోషిస్తున్నాయి. ఆరోగ్య సంరక్షణ నుంచి సాంకేతికత వరకు అన్నిరంగాల్లో ఉత్పత్తులు, సేవలలో భద్రత, విశ్వసనీయత, నాణ్యత సమస్యలను ప్రభావవంతమైన ప్రమాణాలతో పరిష్కరించడం జరుగుతుంది. కొన్ని దేశాలు ఈ దినోత్సవాన్ని వేరు వేరు తేదీల్లో నిర్వహిస్తున్నాయి.

కొలతలు, సాంకేతికతలో ఏకరూపతను సులభతరం చేయడంలో ప్రమాణాలు ఉపయోగపడతున్నాయి.

**(14 అక్టోబర్ ప్రపంచ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా)**

## పొంచిఉన్న ప్రమాదాన్ని నియంత్రించండి



**ప్రజాపక్షం/కేశంపేట :** అధికారులు పొంచి ఉన్న ప్రమాదాన్ని గుర్తించి నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు. మండల పరిధిలోని నిర్దవెళ్ళి గ్రామానికి వెళ్ళే ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున గుంత పడటంతో నిత్యం ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన భారీవర్షానికి చెరువు అలుగు పారి వర్షపు నీరు రోడ్డు పైకి రావడంతో రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. దాంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వాహనదారులు ప్రయాణం చేయాల్సి వస్తుందంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మ త్తులు చేసేందుకు కృషి చేయాలని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

## ప్లాస్టిక్‌పై వ్యాపారస్తులకు అవగాహన



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** ప్లాస్టిక్ వాడితే జరిగే అనర్థాల గురించి శంకర్‌పల్లి మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్, సిబ్బంది సోమవారం చిరు వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేదించబడిందని, అలాంటి ప్లాస్టిక్ కవర్లను వాడ రాదని తెలిపారు. వాడితే జరిమానా విధించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే రోడ్డుకు అడ్డంగా తమ వస్తువులను పెట్టి వ్యాపారం చేయకూడదని సూచించారు. ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా రోడ్డుపై వ్యాపారాలు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ బి.ఆనంద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలతోనే స్నేహ సంబంధాలు

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** క్రీడాకారులను ప్రోత్సహించడంతోపాటు క్రీడారంగానికి పెద్దపీట వేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే శంకరన్న క్రికెట్ టోర్నమెంట్ కప్‌ను విజేతలకు అందజేయడంతోపాటు ఒక లక్ష రూపాయల నగదు చెక్కును ఇచ్చారు. రన్నర్ జట్టుకు రూ.50వేలు అంధించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ క్రీడలతోనే స్నేహ సంబంధాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, బస్వం, పురుషోత్తంరెడ్డి, రవికుమార్, లింగారెడ్డిగూడ అశోక్, బచ్చలి నరేష్, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## మర్చంట్ నేవీలో ఉద్యోగ అవకాశాలు

### కెప్టెన్ అశుతోష్ విజయ్ ఆపండ్కర్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** డిజి షిప్పింగ్ సాగర్ మే సమ్మాన్ కార్యక్రమంలో భాగంగా మర్చంట్ నేవీలో ఇంటర్, పదవ తరగతి, ఐటిఐ మెకానికల్, ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని టిఎస్ రహమాన్ ప్రిన్సిపాల్, డిజి షిప్పింగ్ నోడల్ అధికారి కెప్టెన్ డాక్టర్ అశుతోష్ అన్నారు. సోమవారం నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూట్ (మహి), ముషీరాబాద్ ఐటీఐలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ పదవ తరగతి ఇంటర్ ఐటిఐ తర్వాత మర్చంట్ నేవీలో ఆరు నెలల శిక్షణ ఉంటుందని వెంటనే 100 శాతం ఉద్యోగాలు మంచి జీతంతో దొరుకుతాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుండి మర్చంట్ నేవీలో ట్రైనింగ్ తీసుకుంటున్న విద్యార్థిని భీమగాని సత్య మాట్లాడుతూ ప్రత్యేక శిక్షణతో నేవీ రంగంలోకి అడుగు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు మనీషాపోండే, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపాల్ ఎస్.ప్రియ, ముషీరాబాద్ ఐటిఐ ప్రిన్సిపాల్ రాధాకృష్ణమూర్తి, ప్లేసెమెంట్ ఆఫీసర్ విశ్వపాలక్ రెడ్డి, ట్రైనింగ్ ఆఫీసర్ మోహన్ బాబు, ఎటిఒ శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్ భీమగాని మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారానికి కృషి

### వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** వనస్థలిపురం డివిజన్‌లో సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తానని స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్లోని ప్రశాంత్ నగర్ కమ్యూనిటీ హాల్ కాలనీ వాసులతో కలిసి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రశాంత్ నగర్ సీనియర్ సిటిజన్ భవనం ఏర్పాటు, కనుకదుర్గా ఆలయం వద్ద రోడ్డు వెడల్పు, ఎఫ్‌సిఐ కాలనీలో ఎల్ టైప్‌లో గోడ నిర్మాణం చేపట్టే విధంగా జిహెచ్‌ఎంసి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారం చూపుతామన్నారు. ప్రశాంత్ నగర్‌లోని విష్ణు థియేటర్ వెనుక పార్కును అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకోస్తామన్నారు. కార్యక్రమంలో జలమండలి డిజిఎం రాజుగోపాల్, డిఈ రఫీ, వాటర్ వర్క్స్ శ్రీనివాస్, ఏఈ విగ్నేశ్వరి, కాలనీ వాసులు గోపి బాలాజీ నాథ్, కరుణాకర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రామారావు, లగ్గొని శ్రీధర్ గౌడ్, యుగేందర్‌రెడ్డి, రంగయ్య చౌదరి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాలనీల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హామీ



**ప్రజాపక్షం/శంషాబాద్:** పాలమాకుల గ్రామంలోని కళబాయి బస్తీ వాసులు సోమవారం మాజీ జెడ్పిటిసి నీరటి తన్వీ రాజు ముదిరాజ్‌తో కలిసి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా కాలనీలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న డ్రైనేజీ, మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. వారి వినతిపై తక్షణం స్పందించిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, నిధులు మంజూరు చేసి సమస్య పరిష్కారానికి పనులు త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గుడాల ఇందిరా కృష్ణయ్య గౌడ్, కొడావత్ సరితా రవీందర్ నాయక్, కోటేశ్వర్ గౌడ్, మనోజ్ కుమార్, ఉత్తమ్, కాలనీ వాసులు వెంకన్న పంతులు, బోయ చెన్నయ్య,సారా బాలరాజు,చెవుల సురేష్,కావలి మల్లేష్, నీళ్ల శ్రీనివాస్,బోయ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## గుట్కాలు అమ్మిన ఆరుగురిపై కేసు



**ప్రజాపక్షం/షాబాద్:** మండలంలోని షాబాద్, నాగర్‌గూడ, హైతాబాద్‌లో అక్రమంగా ప్రభుత్వం సీజ్ చేసిన గుట్కాలను అమ్ముతున్న షాపులపై షాబాద్ సిఐ కాంతారెడ్డి , ఎస్సై సతీష్ తన సిబ్బందితో కలిసి అకస్మీక తనిఖీల చేశారు. అనంతరం ప్రభుత్వం సీజ్ చేసిన గుట్కాలను అమ్ముతున్న అబ్దుల్, ఖలీమ్, సత్తార్, ఖుర్మన్, ఎస్‌కె సల్మాన్, ఎస్‌కె మోసిన్‌లపై కేసులు నమోదు చేసిన్నట్లు తెలిపారు.

# కారుణ్య నియామకాలు చేపట్టాలి

### మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి పరిధిలో మలేరియా విభాగంలో విధులు నిర్వహిస్తూ మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులను వారి స్థానంలో నియమించాలని తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఏసురత్నం డిమాండ్ చేశారు. ఈ మేరకు జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్(ఆరోగ్యంపారిశుద్ధ్యం) సి.ఎన్. రఘు ప్రసాద్‌కు వినతిపత్రం అందచేశారు. గత ఐదేళ్లుగా మలేరియా విభాగంలో విధులు నిర్వర్తిస్తూ చనిపోయిన కార్మికుల స్థానంలో వారి వారసులను ఉద్యోగాల్లోకి తీసుకోవాలని ఆయన కోరారు. ఆరోగ్య సమస్యల కారణంగా సుదీర్ఘకాలంగా విధుల్లోకి రాలేకపోతున్న కార్మికులను తిరిగి నియమించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిహెచ్‌ఎంసి పరిధిలో ప్రస్తుతం మలేరియా కార్మికులు, సూపర్‌వైజర్లు చాలా తక్కువగా ఉన్నందున, ప్రజల అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలని ఏసురత్నం డిమాండ్ చేశారు. ఇటీవల పారిశుద్ధ్య విభాగంలో 1,578 మంది కార్మికులను నియమించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు గుర్తు చేశారు. అలాగే పారిశుద్ధ్య కార్మికుల హాజరు సమయాలను మారుస్తూ, ప్రస్తుతం ఉదయం 4.30 నుండి 5.30 వరకు తీసుకుంటున్న హాజరును ఉదయం 5 గంటల నుండి 6 గంటల వరకు మార్చాలని ఆయన కోరారు. చాలా మంది కార్మికులు దూర ప్రాంతాల నుండి వస్తుండటంతో హాజరు పడటంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధికారులు ఈ వినతిపత్రంపై స్పందిస్తూ, కార్మికుల సమస్యలు న్యాయమైనవేనని, వీటిపై తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఏసురత్నం చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి వి. హరినాథ్ రావు, మద్దిలేటి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాలకు సభ్యత్వ నమోదు

### జిహెచ్‌ఎంఇయు అధ్యక్షుడు ఊదరి గోపాల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసిలోని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (జిహెచ్‌ఎంఇయు) ఆధ్వర్యంలో జిహెచ్‌ఎంసి ఎంప్లాయిస్ కాలనీ స్థాపన కోసం భువనగిరి యాదాద్రి జిల్లాలోని చల్లూర్ గ్రామం ఇళ్ల స్థలాల కొనుగోలుకు సభ్యత్వ డ్రైవ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా యూనియన్ ఒక రూపాయి సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ సందర్భంగా జిహెచ్‌ఎంఇయు అధ్యక్షుడు ఊదరి గోపాల్ మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి ఉద్యోగులందరికీ సొంత ఇల్లు కల సాకారం చేయడం యూనియన్ లక్ష్యమన్నారు. చల్లూరులో ప్రతి ఉద్యోగికి స్థలం లభించేలా కృషి చేస్తున్నామన్నారు. సభ్యత్వం పొందని ఉద్యోగులు కూడా ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని ఆయన సూచించారు.



## ప్రభుత్వ భూములు కాపాడాలి

### కలెక్టర్‌కు సిపిఐ నాయకుల వినతి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** అబ్దుల్లాపూర్మెట్ మండలం తుర్కయంజాల్ రెవిన్యూ పరిధిలో సర్వేనెంబర్ 323,212 అండ్ 206 లలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని ప్రజావాణిలో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య, తుర్కయంజాల్ మున్సిపాలిటీ కార్యదర్శి అనంతుల కాటంరాజు గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములపైన గత రెండు సంవత్సరాలుగా సిపిఐ పోరాటం చేస్తుంటే మండల రెవెన్యూ అధికారులు భూ కబ్జాదారులతో కుమ్మక్కై చోద్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ భూములకు అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ సర్వే అధికారులు బౌండరీస్ (హద్దులు) ఫిక్స్ చేసినప్పటికీ, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అలాంటి రెవిన్యూ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సంబంధిత సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూములను తుర్కయంజాల్ మున్సిపాలిటీ పేదలకి ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సిపిఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు అనురాధ, శివప్రసాద్, నాగేశ్వరరావు, బొబ్బిలి కృష్ణ, సుందరమ్మ, శివ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్ల సాధనకు మహాధర్నా, రథయాత్ర

### బిసి సంఘాల నేతల వెల్లడి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** బిసిలకు 42శాతం రిజర్వేషన్ల సాధనే ధ్యేయంగా ఇందిరాపార్కు వద్ద మహాధర్నా, అన్ని జిల్లాల్లో రథయాత్ర చేపడుతామని బిసి సంఘాల నేతలు, న్యాయవాదులు, మేధావులు తెలిపారు. రిజర్వేషన్లను సాధించుకోవడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్టు పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బిసి పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ అధ్యక్షతన "42శాతం బిసి రిజర్వేషన్లు–ఉద్యమ కార్యాచరణ" అంశంపై సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా జస్టిస్ ఈశ్వరయ్య, బిసి మేధావుల ఫోరం చైర్మన్ రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు, బిసి, ఎస్‌సి, ఎస్‌టి జెఎసి చైర్మన్ విశారదన్ మహారాజ్, బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ హాజరయ్యారు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లకోసం అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. రాజ్యాంగపరమైన రక్షణ కల్పించకుండా జీవోలు తెస్తూ రాజకీయ పార్టీలు డ్రామాలాడుతున్నాయని మండిపడ్డారు. చిరంజీవులు మాట్లాడుతూ జీవోలతో ఎన్నికలు నిర్వహిస్తే వాటికి చట్టబద్ధత ఉండదని, కోర్టులు కొట్టివేస్తాయన్నారు. మండల్ కమిషన్ నుంచి నేటివరకు బిజెపి బిసి రిజర్వేషన్లను అడ్డుపడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లను వర్గీకరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల కోసం ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని తెలిపారు. బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలతో అంటకాగుతూనే ఉద్యమానికి నాయకత్వం వహించేవారిని తాము నమ్మబోమన్నారు. అనంతరం 42శాతం బిసి రిజర్వేషన్ల సాధన సమితిని ఏర్పాటు చేశారు. సమావేశంలో బిసి సంఘాల నేతలు రాచాల యుగేందర్‌గౌడ్, మేకపోతుల నరేందర్‌గౌడ్, ఎస్.దుర్గయ్యగౌడ్, అంబాల నారాయణగౌడ్, చామకూర రాజు, కెవి.గౌడ్, వెంకన్న నేత, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రశేఖర్ కుటుంబానికి మధుయాష్కీ పరామర్శ



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** అమెరికాలో దుండగుడి కాల్పుల్లో మరణించిన ఎల్‌బి నగర్ బిఎన్‌రెడ్డి నగర్ చెందిన విద్యార్థి పోలే చంద్రశేఖర్ కుటుంబాన్ని సోమవారం టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ పరామర్శించారు. చంద్రశేఖర్ తల్లితోపాటు సోదరులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. చంద్రశేఖర్ మృతిచెందిన ఘటన తెలియగానే అమెరికాలోనే ఉన్న మధుయాష్కీ విషయం తెలియడంతో కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడారు. మృతిదేహాన్ని తొందరగా ఇండియాకు తీసుకువచ్చేలా ప్రయత్నించాలని కుటుంబ సభ్యులు కోరారు. స్పందించిన ఆయన అక్కడి తెలుగు సంఘాలతో పాటు ఇండియన్ కాన్సులేట్ అధికారులను సంప్రదించి మృతిదేహాన్ని త్వరగా ఇండియాకు పంపించేలా కృషి చేశారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థి చంద్రశేఖర్ మృతి చెందడం కుటుంబ సభ్యులందరికీ జీర్ణించుకోలేని విషయం అన్నారు. కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలిపారు. చంద్రశేఖర్ కుటుంబానికి తాము అండగా ఉంటామని, ప్రభుత్వం తరుపున తగిన సహాకారం ఉందించేలా చూపిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాత నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, నాయకులు పర్వతి గణేష్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి వినయ్ పటేల్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, దేరంగుల కృష్ణ, రమేష్ నాయక్, జానికిరాములు, కొండోజు శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, అనసూయ, భాను, సతీష్, కిరణ్ తదితరులు ఉన్నారు.

## ఉపాధిహామీ కూలీలందరికీ పని

### డిఆర్‌డిఒ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుభాషిణి



**ప్రజాపక్షం/యాచారం :** ఉపాధి కూలీలందరికీ పని కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందని డిఆర్‌డిఒ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుభాషిణి అన్నారు. సోమవారం యాచారం మండల పరిధిలోని గున్‌గల్, యాచారం గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఉపాధి హామీ పథకం కింద చేస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హార్టికల్చర్ కింద చేస్తున్న పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రైతుల వ్యవసాయ పొలంలో 100 శాతం మొక్కలు నాటాలన్నారు. వాటిని బతికించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఉపాధి హామీ పథకంలో చేస్తున్న పనులను నాణ్యంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పనుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. హరిత హారం కింద మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి రాధ రాణి, ఉపాధి ఎపిఒ లింగయ్య, ఉపాధి హామీ పథకం ఇంజనీర్ శివశంకర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ కృష్ణమాచారి, పంచాయతి కార్యదర్శులు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి

### మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత



**ప్రజాపక్షం/కొత్తూరు:** అక్రమ కట్టడాలను తొలగించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక నేతలు కోరారు. సోమవారం కొత్తూరు మున్సిపల్ కమిషనర్ బాలాజీకి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కొత్తూరు పాత జాతీయ రహదారి నుండి మున్సిపల్ కార్యాలయానికి వెళ్ళె దారిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరి గోడకు డబ్బాలు, అక్రమ నిర్మాణాలు ఉన్నాయని, దాంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని వివరించారు. రహదారికి ఇరువైపుల ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల ప్రహరి గోడకు ఉన్న స్థలంలో చిరు వ్యాపారుల నుండి కొంతమంది అక్రమంగా డబ్బులు వసూళ్ళు చేస్తున్నారని, అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఇంటింటికీ వెళ్ళి పోలియో చుక్కలు వేయాలి

### కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జిల్లాలో పల్స్ పోలియో చుక్కలను ఏ ఒక్కరినీ వదలకుండా ఇంటింటికీ వెళ్ళి వేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని 48 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.

**రైతులందరికి ఎరువులు అందేలా చూడాలి...**

అనంతరం జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల కొరత లేకుండా రైతులందరికీ ఎరువులు అందేలా చూడాలని, పత్తి కొనుగోలు,వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలల్లో సరిపడా గన్ని బ్యాగులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లకు స్టేజ్ వారీగా పేమెంట్ అయ్యేలా చూడాలని, స్థానిక ఎన్నికల కోడ్‌కు ముందు వచ్చిన లిస్ట్ ప్రకారం ఇండ్ల గ్రౌండింగ్ చేయాలని పిడి హౌసింగ్ అధికారికి సూచించారు. గ్రామ, మున్సిపల్ స్థాయిలో పారిశుద్ధ్యంపై శ్రద్ద పెట్టాలని తెలిపారు. ప్రతి వారం సంబంధిత అధికారులతో ప్రభుత్వ పథకాల అమలుపై, చేపట్టిన చర్యలపై కింది స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లేదా టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి,జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, రులు, తదితరులు పాల్గొన్నారు.

## 'సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ మైక్రోస్కోపీ' ప్రారంభం



**ప్రజాపక్షం/గండిపేట:** మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ , టి.ఆర్. అనంతరామన్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ , సంయుక్త సహకారంతో గండిపేట ఎం జి ఐ టి కాలేజీ ప్రాంగణంలో అత్యాధునిక "సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ మైక్రోస్కోపీ" కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కేంద్రం ప్రారంభోత్సవానికి ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్, ప్రొఫసర్ బి.ఎస్. మూర్తి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతన మెటీరియల్స్ లక్షణ విశ్లేషణ కోసం స్కానింగ్ ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చారు ఆయన తెలియజేశారు. ఈ సదుపాయం వివిధ సంస్థల పరిశోధకులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బిఎస్.మూర్తి మాట్లాడుతూ ఎంజీఐటీ సంస్థలో ఇలాంటి పరిశోధనా ఆధారిత సదుపాయాలను ఏర్పాటు చేయడంలో యాజమాన్యం చూపిస్తున్న ఆసక్తిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇన్స్టిట్యూట్‌లోని అధ్యాపక సభ్యులందరూ ఈ నూతన సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని, ఆయన ఆకాంక్షించారు. ఐఐటీ హైదరాబాద్‌లో చేపడుతున్న వినూత్నపరిశోధనాకార్యకలాపాలను ఆయనవివరించారు . కార్యక్రమంలో ఎంజిఐటీ ప్రిన్సిపాల్ డా.జి.చంద్రమోహన్‌రెడ్డి, ఎంజిఐటీ వైస్‌ప్రిన్సిపాల్ డా.కె.సుధాకర్‌రెడ్డి, టిఆర్‌ఏఈఆర్‌ఎఫ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, ప్రొఫెసర్ వి.వి.కుటుంబరావు, టిఆర్‌ఏ ఈఆర్‌ఎఫ్ అధ్యక్షులు పద్మ విభూషణ్ ప్రొఫెసర్ పి.రామారావు, డాక్టర్ జి.నలకొండయ్య, డాక్టర్ ఎన్.ఈశ్వర ప్రసాద్, డాక్టర్ కే రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన నృత్య ప్రదర్శనలు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** మహతి ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో నాంపల్లి పోట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో సంగీత నృత్య ప్రదర్శన చూపరులను ఎంతగానో అకట్టుకున్నాయి. బ్రహ్మాంజలి అనే గానంపై షాద్‌నగర్ పట్టణానికి చెందిన 8వ తరగతి విద్యార్థిని హితిక ప్రదర్శించిన అహభావాలు ప్రేక్షకులను అకట్టుకున్నాయి. హితిక ఇప్పటికే ఎన్నో నృత్య ప్రదర్శనలు చేసి ఎంతోమంది మన్ననలు పొందింది. ప్రభోదయ డాన్స్, మ్యూజిక్ ఆకాడమీకి చెందిన గురువు రంజు ప్రవీణ వద్ద శిక్షణ ఇప్పిస్తున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. చిన్నతనం నుండి నృత్య కలపై ఆసక్తి కలపరుస్తూ ఉన్న చిన్నారులను అభినందిస్తూ ప్రముఖ నాట్య గురువు సజని వల్లభనేని చేతుల మీదుగా మెమొంటోలు, ప్రశంసా పత్రాలను అందుకున్నారు.

## తిరుమలనాథ స్వామి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే


**ప్రజాపక్షం/పూడూర్ :** పరిగి నియోజకవర్గంలోని పూడూర్ మండలంలోని పెద్ద ఉమ్మంతల్ గ్రామంలో నిర్వహించిన శ్రీ తిరుమలనాథ స్వామి ఉత్సవాల్లో పరిగి ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు ఎమ్మెల్యే ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వామి వారి అశీస్సు లు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ను ఘనంగా సన్మానించారు.



## సమస్యలు పరిష్కరించాలని సిఎం సతీమణికి వినతి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీమణి గీతారెడ్డిని రాష్ట్ర యువజన నాయకులు బూడిద ప్రేమ్‌కుమార్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలసి చర్లపల్లి డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. చర్లపల్లి డివిజన్ పరిధిలో గత కొన్ని నెలలుగా రాజకీయ నాయకుల ప్రోత్సాహంతో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకపోవడంతో రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోవాలని ఆమెకు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌యుఐ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్, సాయి, మహేంద్ర, అజర్, తదితరులు పాల్గొన్నారు.






## సిపిఆర్ ద్వారా ప్రాణాలను కాపాడగలుగుతాం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** అత్యవసర పరిస్థితుల్లో సిపిఆర్ చేయటం ద్వారా ప్రాణాలను కాపాడగలుగుతారని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఉమాగౌరి అన్నారు. సోమవారం తమ కార్యాలయంలో పునర్జన్మ పేరిట నిర్వహించిన సిపిఆర్ అవగాహనా సదస్సులో వివిధ ప్రభుత్వ శాఖాధికారులు, సిబ్బంది, ప్రజలకు సిపిఆర్ ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ పునర్జన్మ వారోత్సవాలు నిర్వహిస్తూ వారం రోజుల పాటు జిల్లాలోని అన్ని విద్యా సంస్థల్లోనూ శిక్షణ పొందిన వైద్య నిపుణులతో ఏ విధంగా ఎలాంటి సమయాల్లో సిపిఆర్ చేయటం ద్వారా ప్రాణాలను కాపాదవచ్చున్న విషయాలను తెలియ చేస్తూ శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖకు చెందిన వైద్యులు వినోద్, గీత, శ్రీదేవి, సత్యవతి, చంద్రకళ, వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ఎన్. ఎస్. ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిత అన్నారు. సోమవారం శామీర్‌పేట మండలం మజీద్‌పూర్‌లో కళాశాల తరపున నిర్వహిస్తున్న ఎన్. ఎస్. ఎస్ ప్రత్యేక శిబిరంలో ఐదవ రోజు పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ సేకరణ, ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు, మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామం లో ఇంటింటికీ తిరుగుతు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని, ప్లాస్టిక్ వాడకంతో కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. అలాగే పల్స్ పోలీయోలో భాగంగా ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేసుకునేలా తల్లులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పిడి హైమావతి, ఎన్ ఎస్ ఎస్ సభ్యురాలు ధనవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.





## సిసి రోడ్డు పనులు ప్రారంభం


**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోని నందనవనం కాలనీ 19వ డివిజన్‌లలో రోడ్డు పూర్తిగా పాడువటంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది అవుతుండడంతో కాలనీ వాసులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి గత నెల సంప్రదించగా వారి సమ్యసపై స్పందించి. సిసి రోడ్డు కొరకు మున్సిపల్ ఫండ్స్ మంజూరు చేయించి నూతన సిసి రోడ్డు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి, కొలన్ బాల్ రెడ్డి, రాజేంధర్,జిత్తు తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

### కలెక్టర్‌తో తాండూరు ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/తాండూరు:** రైతులకు ఇబ్బందులు ఎదురుకాకుండా సకాలంలో వడ్ల, పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తాండూరు ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్‌తో ప్రస్తావించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ప్రతిక్ జైన్‌ను నాయకులతో కలసి నియోజకవర్గంలోని పలు సమస్యలపై ఎంఎల్ఏ మనోహర్‌రెడ్డి చర్చించారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి గాను లబ్దిదారులకు ఇబ్బంది లేకుండా ఇసుక పర్మీషన్లు ఇవ్వాలని కలెక్టర్ దృష్టికి తీసుకవెళ్ళారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పనులు త్వరిత గతిన పూర్తి అయ్యే విధంగా చూడాలని కోరారు. నియోజకవర్గానికి మంజూరైన సబ్ స్టేషన్ల నిర్మాణాలు త్వరగ పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీటితో పాటు పలు ముఖ్యమైన సమస్యల గూర్చి కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి చర్చించారు. ఎంఎల్ఏ వెంటా టిపిసిసి ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, సీనియర్ నాయకులు, తదితరులు ఉన్నారు.

**వికారాబాద్ :** ప్రజావాణికి 56దరఖాస్తు లు వికారాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 56 ఫిర్యాదులు స్వీకరించడం జరిగింది అని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ , సుధీర్, ట్రైనింగ్ కలెక్టర్ హర్స్‌చౌదిరి, డిపిఆర్ఓ మంగ్లీలాల్ ,ఆర్డిఓ వాసుచంద్ర , తదితరులు పాల్గొన్నారు.



## కొడంగల్ పరిరక్షణకు సిద్ధం కావాలి

**ప్రజాపక్షం/కొడంగల్ :** కొడంగల్ అభివృద్ధిని సాధించుకునేందుకు ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని కొడంగల్ అభివృద్ధి ఐక్యకార్యచరణ కమిటి పిలుపునిచ్చారు. సోమవారం కొడంగల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతు కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తరుణంలో కొడంగల్‌కు మెడికల్ కాలేజ్, వెటర్నరీ కాలేజ్, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ వంటి అనేక రకాల అభివృద్ధి పనులను తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలోనే అభివృద్ధి పనులకు భూ సేకరణ చేపట్టి పనులను ప్రారంభించడం కూడా జరిగింది. అయితే కొడంగల్‌కు మంజూరు అయిన అభివృద్ధి పనులన్నీ ఏకతాటిగా వేరే ప్రాంతాలకు తరలిపోతున్నాయని పుకార్లు షీకార్లు కొడుతుండగా దీనికి సంబంధిత శాఖ అధికారులను వివరణ కోరగా వారు కూడా ఎలాంటి సమాధానాలు ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. కార్యక్రమంలో కోట్రికె లక్ష్మి నారాయణగుప్త, ఎరన్‌పల్లి శ్రీనివాస్, గంటి సురేష్‌కుమార్, పవన్ లహోటి, అంబేద్కర్ సంఘం రమేష్‌బాబు, తదితరులున్నారు

# మూత్రపిండాల మార్పిడితో సరి'కొత్త' జీవితం

### యశోద హాస్పిటల్ పేషెంట్ల ఆత్మీయసమ్మేళనంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** యశోద ఆసుపత్రిలో కిడ్నీ రోగులకు మూత్రపిండాల మార్పిడితో వారికి సరి కొత్త జీవితం ఇచ్చినట్లయ్యిందని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తెలిపారు. యశోద హాస్పిటల్స్‌హైటెక్ సిటి కేవలం 36 నెలల్లో 300 కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్స్‌ని విజయవంతంగా పూర్తిచేసిన సందర్భంగా ఈ విశేషమైన విజయాన్ని సాధ్యం చేసిన అవయవ దాతలు, అవయవ గ్రహీతలు, నెఫ్రాలజిస్టులు, యూరాలజిస్టులు, సహాయక సిబ్బందితో కూడిన అత్యంత నైపుణ్యం కలిగిన అనుభవజ్ఞుల వైద్య బృందాన్ని గౌరవించడంకోసం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమం సోమవారం యశోద హాస్పిటల్స్‌హైటెక్ సిటీలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ పాల్గొని అవయవ దాతలను, అవయవ గ్రహీతలను, ఇంతటి మైలురాయిని సాధ్యం చేసిన యశోద హాస్పిటల్స్ వైద్యులను అభినందించారు. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్ గ్రూప్, మేనేజింగ్ డైరెక్టర్, డాక్టర్. జి.యస్.రావు, మాట్లాడుతూ... ఎ లెగసీ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్, కిడ్నీ మార్పిడి కోసం భారతదేశంలోని ప్రముఖ కేంద్రాలలో ఒకటిగా యశోద హాస్పిటల్స్ అవతరించింది. మా అన్ని యూనిట్లలో ఇప్పటివరకు 3,500 కి పైగా కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్స్ ను చేయగా, ఒక్క హైటెక్ సిటీ యూనిట్ లో మాత్రమే కేవలం 36 నెలల్లో 300 కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్స్ మైలురాయిని చేరుకోవడం ఇది క్లినికల్ ఎక్సలెన్స్, ఇన్నోవేషన్, కారుణ్య రోగుల సంరక్షణకు మా హాస్పిటల్స్ నిబద్ధతలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది అని అన్నారు.

ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్‌హైటెక్ సిటీ నెఫ్రాలజీ వైద్యులు డాక్టర్. పి. విజయ్ వర్మ, డాక్టర్. మహేష్ కోట, డాక్టర్. మురళీనాథ్ వుక్కదల యూరాలజీ వైద్యులు డాక్టర్. గుత్తా శ్రీనివాస్, డాక్టర్. ఎన్. మల్లికార్జున్ రెడ్డి మరియు కిడ్నీ మార్పిడి గ్రహీతలు, కిడ్నీ దాతలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ప్రజావాణిలో 81 అర్జీలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించమే ప్రజావాణి లక్ష్యమన్న విషయాన్ని అధికారులు గుర్తుంచుకొని బాధ్యతాయుతంగా ఎలాంటి జాప్యానికి తావివ్వని రీతిలో పని చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. కింది స్థాయిలో పరిష్కారం కాకపోవటం వల్లే జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ధరఖాస్తుదారులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలో అయినా మోక్షం లభిస్తుందన్న గంపెడాశతో వస్తుంటారన్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న మాదిరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 81 అర్జీలను ధరఖాస్తుదారులను స్వీకరించారు. జిల్లా అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి, డిఆర్ఓ హరి ప్రియలతో పాటు ఉన్న వివిధ ప్రభుత్వ విభాగాల అధికారుల సమక్షంలో ఆయన అర్జీలను తీసుకొన్నారు. సుదూర ప్రాంతాల నుండి వ్యయ ప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు వచ్చే అర్జీలకు సత్వర పరిష్కారాన్ని చూపించి నమ్మకాన్ని పొందాల్సిన బాధ్యత ఉందన్న విషయం విస్మరించవద్దని సూచించారు. ఒక వేళ అర్జీలను పరిష్కరించ లేని పక్షంలో దానికి కారణాలను సైతం ధరఖాస్తుదారులకు తెలియచేస్తూ అన్నింటి వివరాలను ఆన్‌లైన్‌లో వెంటవెంటనే నమోదు చేయాలన్నారు.

## ఆమోదయోగ్యమైన వారికే జిల్లా అధ్యక్ష పదవి

### ఎఐసిసి జిల్లా పరిశీలకురాలు అంజలి నింబాల్కర్




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కింది స్థాయి కార్యకర్తలతో సమన్వయం చేసుకొంటూ పార్టీ అభివృద్ధి కోసం పాటు పడుతున్న వారిలో ఒకరిని జిల్లావ్యాప్తంగా అభిప్రాయ సేకరణ ద్వారా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎంపిక చేయనున్నామని మేడ్చల్ జిల్లా ఎఐసిసి పరిశీలకులు అంజలి నింబాల్కర్ తెలిపారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సూచనల మేరకు అన్ని జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే లక్ష్యంగా డిసిసి అధ్యక్షుడి ఎంపిక కోసం అభిప్రాయ సేకరణ జరుపనున్నామని తెలిపారు. దీనిలోని భాగంగా సోమవారం అంతాయిపల్లిలోని ఎస్ఆన్ఆర్ వేద కన్వెన్షన్ హాలులో మేడ్చల్ నియోజకవర్గ సమావేశంలో నియోజకవర్గ ముఖ్యనేతలు, జిల్లా కార్యవర్గం, పార్టీ శ్రేణులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా అధ్యక్ష పదవిని ఆశిస్తున్న వారినుండి దరఖాస్తులు తీసుకోవటం, జిల్లాలోని నియోజకవర్గాల వారీగా నిర్వహించే సమావేశాల్లో కింది స్థాయి నుండి కార్యకర్తలతో తాను వ్యక్తిగతంగా మాట్లాడి అభిప్రాయాలను సేకరిస్తున్నానన్నారు. పార్టీలో పనిచేసే కార్యకర్తలకు తగినంత సమయం కేటాయించి అందరికి అందుబాటులో ఉండి ప్రతి ఒక్కరితో సమన్వయంతో పార్టీ పటిష్టతకు పాటుపడే వారికే డిసిసి అధ్యక్ష పదవి దక్కుతుందన్నారు. పార్టీ కార్యకర్తలు సూచించిన వారికే జిల్లా పార్టీ అధ్యక్షులవుతారన్నారు. మొదట జిల్లా అధ్యక్షులను ఎన్నుకొని ఆ తర్వాత మిగతా కార్యవర్గాలను ఎన్నుకొంటారని, తద్వారా ప్రతి కార్యకర్తకు ఎఐసిసి అనుసంధానం ఏర్పడుతుందన్నారు.

ప్రజాబలం లేకపోవటంతో పాటు కార్యకర్తలకు అందుబాటులో లేని నాయకులకు పార్టీ పదవులు దక్కే అవకాశాలు లేవని, పార్టీ సేవలో అంకితభావం తో ముందుకు వెళ్లే వారై ఉండాలన్నారు. ఇప్పటి వరకు డిసిసి అధ్యక్ష పదవికి గాను తోటకూర వజ్రేష్ యాదవ్, సింగిరెడ్డి హర్షవర్ధనరెడ్డి, రాపోలు రాములు లు ధరఖాస్తు చేసుకొన్నారని తెలిపారు.

ఈ సమావేశంలో మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, పిసిసి పరిశీలకురాలు ఇందిర, పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ జడ్‌పి చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, టిపిసిపి ప్రధాన కార్యదర్శి మెరుగు సునీత, నక్కా ప్రభాకరగౌడ్, ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అమర్‌సింగ్, డిప్యూటి మేయర్ శివగౌడ్, పిఎంసి కాంగ్రెస్ అధ్యక్షులు రవి, రాంరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ సర్పంచ్‌లు, యువజన విభాగం, కాంగ్రెస్ అనుబంధ సంస్థల నాయకులు పాల్గొన్నారు.

## ప్రజావాణి నిర్వహించిన జిహెచ్ఎంసి అధికారులు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఎన్నికల కోడ్‌కు మల్కాజిగిరి నియోజకవర్గానికి వర్తించనప్పటికి జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్ అధికారులు సోమవారం నిర్వహించే ప్రజావాణిని ఏ విధంగా రద్దు చేస్తారంటూ మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ నిలదీసారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కోడ్ వంకతో ప్రజావాణి రద్దుచేస్తే అర్జీ లిచ్చేందుకు వచ్చిన వారికి ఏం సమాధానం చెబుతారని, వెంటనే అధికారులందరిని పిలిపించి ప్రజావాణిని నిర్వహించాలంటూ ఆయన పట్టుబట్టి ఎట్టకేలకు డిప్యూటి కమిషనర్ జాకియా సుల్తానా ప్రజావాణిని నిర్వహించారు. దీంతో అప్పటికే కార్యాలయానికి చేరుకొన్న దరఖాస్తుదారులు తమ గోడును అధికారులకు విన్నవించుకొన్నారు. కాకతీయనగర్ స్మశానవాటిక వద్ద పారిశుద్య పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని తగినచర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ వినతిపత్రం సమర్పించారు.



## ఇంటర్వ్యూకు వచ్చి అనంతలోకాలకు..

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఇంటర్వ్యూకు వచ్చిన వ్యక్తి రక్తంతో కూడిన వాంతులు చేసుకుని ఆకస్మికంగా మృతి చెందిన సంఘటన తుర్కపల్లి జినోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. జీనోమ్‌వ్యాలి ఇన్‌స్పెక్టర్ గురువయ్య తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన బుడిగ మహేష్(38) అలియాబాద్ మున్సిపాలిటి తుర్కపల్లిలోని బయోలాజికల్ ఇ లిమిటెడ్ కంపెనీలో ఇంటర్వ్యూకి వచ్చాడు. కంపెనీలో నడుచుకుంటు వెళ్తుండగా రక్తంతో కూడిన వాంతులు అయ్యాయి. అక్కడ ఉన్నవారు గమనించి మహేష్‌ను లక్ష్మ క్కపల్లిలోని ఆర్.వి.ఎం ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందాడని తెలిపారు. భార్య సోని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## సమాచార చట్టం ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే సాధనం



**ప్రజాపక్షం/నాగారం:** సమాచార చ ట్టం అనేది ప్రజాస్వామ్యాన్ని బలోపే తం చేసే శక్తివంతమైన సాధనమని నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఫంక్షన్ హాలులో సోమవారం సమాచార హక్కు చట్టం వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సమాచార చట్టం ద్వారా పాలన పై ప్రజలకు పూర్తి సమాచారం లభిస్తోందని, పారదర్శక పాలనను సాధించేందుకు ప్రతి పౌరుడు ఈ హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం అధికారుల మధ్య చర్చా వేదిక ఏర్పాటు చేయగా ప్రజల్లో సమాచార హక్కు చైత్యన్యాన్ని పెంపొందించేదుకు చేపట్టాల్సిన చర్యలపై అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పౌరులతో ప్రత్యక్షంగా చర్చించి వారి సందేశాలను నివృతి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నారాయణరెడ్డి, డిఇఇ సంతోష్‌కుమార్,రెవెన్యూ ఆఫీసర్ నాగేశ్వరరావు,సురేష్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు. ప్రతి పౌరుడు సమాచార చట్టం హక్కు ను వినియోగించుకోవాలి



**దమ్మాయిగూడ:** పారదర్శక పాలనను సాధించేందుకు ప్రతి పౌరుడు సమాచార చట్టం హక్కును వినియోగించుకోవాలని కమిషనర్ దమ్మాయిగూడ కమిషనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ కార్యాలయంలో ఆర్‌టిఐ 2025 వారోత్సవాల్లో భాగంగా కమిషనర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సమాచార చట్టం ద్వారా పాలనపై ప్రజలకు పూర్తి సమాచారం లభిస్తోందని ఆర్‌టిఐ యాక్ట్ ప్రకారం ప్రజల సమస్యలు పరిష్కరించుకోవచ్చునని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశం, కార్యాలయ సిబ్బంది, కాలనీవాసులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## కలెక్టరేట్ కార్యాలయం ముందు ఎమ్మార్పీస్ ధర్నా

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్, అన్ని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ నెల 7వ తేదీన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయి మీద రాకేష్ కిషోర్ షూ విసరడాన్ని నిరసిస్తూ, ఈ నిరసన కార్యక్రమానిన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ దేశ అత్యున్నత న్యాయస్థానం అయినటువంటి న్యాయమూర్తులకే రక్షణ కరువైనందని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. రాకేష్ కిషోర్‌పై తక్షణ అరెస్టుచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జీ తిప్పారప్ లక్ష్మ ణ్ మాదిగ, జాతీయ కళామండలి ఎన్.వై.అశోక్ మాదిగ, ఎంఎస్పీ నాయకులు రామచందర్ మాదిగ, జిల్లా అధ్యక్షులు పంగ ప్రణయ్ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు రాసమల్ల యాదగిరి మాదిగ, మహిళా అధ్యక్షురాలు నడిమిదొడ్డి సలోమి మాదిగ, స్వామి మాదిగ, ఏసు చంద్రశేఖర్, పరశురాం, అంజి మాదిగ, నగేష్, లక్ష్మ మ్మ, సాయి మాదిగ తదితరులు పాల్గొన్నారు.




## చర్లపల్లి జైళ్లను సందర్శించిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి కేంద్ర కాగారం, వ్యవసాయ క్షేత్రంలో నిర్వహిస్తున్న ప్రగతిశీల, పునరావాస చర్యలను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశంసించారు. సోమవారం చర్లపల్లి కేంద్ర కారాగారం, వ్యవసాయ క్షేత్రాలను బండి సంజయ్, తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రాతో కలసి సందర్శించారు. వ్యవసాయ క్షేత్రంలో అడ్వెంచర్ పార్కు, ఆర్గానిక్ కూరగాయల తోటలు, పూల తోటలు, పలు యూనిట్లు, తేనెటీగల పెంపకం, డెయిరీ ఫాంలను పరిశీలించారు. ఖైదీలు పశుపోషణలో చూపుతున్న కృషిని ఆయన అభినందించి అక్కడే పుట్టిన కొత్త దూడకు స్వయంగా కృష్ణ అని పేరు పెట్టారు. కేంద్ర కారాగారంలో డిజి సౌమ్య మిశ్రా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జైళ్లలో అమలు అవుతున్న ఉత్తమ పద్ధతులు, పునరావాస కార్యక్రమాలు, విద్య సంక్షేమం,ఆరోగ్య సేవలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐజి మురళీబాబు, డిఐజి శ్రీనివాస్, సంపత్, సూపరింటెడెంట్ ఎన్. శివకుమార్‌గౌడ్, డిప్యూటీ పర్యవేక్షణాధికారులు కాళిదాస్, సిబ్బంది, తదితరలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో కుళ్లిన గుడ్లు.. అనారోగ్యం పాలవుతున్న పిల్లలు

**ప్రజాపక్షం/కొడంగల్ :** రోగ్యమే మహాభాగ్యం.. చిన్నపిల్లలకు పౌష్టికమైన ఆహారం అందించాల్సిన టీచర్‌లు కుళ్లిపోయిన పౌష్టికాహారాన్ని అందించడంపై పిల్లల తల్లీదండ్రులు, గర్భిణులు, బాలింతలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే కొడంగల్ నియోజకవర్గంలో ఐసీడీఎస్ ప్రాజేక్టు కింద దాదాపు 234 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో 1683 మంది గర్భిణులు, బాలింతలుండగా, 7778 మంది ఆరు సంవత్సరాలోపు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు టీచర్‌లు. ప్రతి సెంటర్ కు గుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్ ఈ నెల కూడా ప్రతి సెంటర్‌కు గుడ్లను సరఫరా చేయడం జరిగింది. కాని ఆ గుడ్లు కుళ్లిన దుర్వాసన వెదజల్లుతున్నాయి. అయితే ఆయాలు మాత్రం వీటిని గమనించకుండ చాలా చోట్ల పిల్లలకు మధ్యాహ్నం భోజన సమయంలో గుడ్లను అందిస్తున్నారు. వీరితో పాటు గర్భిణులకు, బాలింతల కు అందించడంతో కొంతమంది వీటిని పసిగట్టడంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. కొడంగల్ మండలంలో దాదాపు ప్రతి సెంటర్‌కు ప్రజాపక్షం ప్రతినిధి ప్రత్యక్షంగా వెళ్లి తనిఖీలు చేసిన తరుణంలో ఇలాంటి ఘటనలే ఎక్కువగా వెలుగుచూశాయి. అయితే గత కొంతకాలంగా ఆయిల్, పప్పు వంటి వస్తువులు కూడా సెంటర్‌లకు అందించడం లేదని కేవలం మురుకులు, బాలామృతం, గుడ్లు మాత్రమే సెంటర్‌లకు సరఫరా అవుతున్నాయని తెలుస్తుంది. అంగన్‌వాటీ సెంటర్‌లను పర్యవేక్షించాల్సిన అధికారులు ఎక్కడ ఉన్నారో ఎవ్వరు ఉన్నారో కూడా తెలియని దుస్థితిలో మేము ఉన్నామని ఎవ్వరు కూడా సెంటర్‌లను పట్టించుకున్న పాపాన పోలేదని గర్భిణులు, బాలింత లు మీడియాతో తమ గోడును చెప్పుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలు ఒక రకంగా ఉంటే అధికారుల తీరు మరోరకం గా ఉందని మండిపడ్డారు. అంగన్‌వాడి సెంటర్‌లో పౌష్టికాహారం కాదు రోగాల హారం అంటు తీవ్ర విమర్శలు చేశారు. గుడ్లను సరఫర చేసే సదరు కాంట్రాక్టర్‌లపై. విధులలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కొడంగల్ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

**మా దృష్టికి సమస్యలు రాలేవు.. ఐసిడిఎస్ సిడిపిఒ**

కొడంగల్‌లోని అంగన్‌వాడి సెంటర్‌లను ఎప్పటికప్పు డు పర్యవేక్షిస్తునే ఉన్నామని మా దృష్టికి ఎలాంటి సమస్యలు రాలేవు. కొంతమంది ఫోన్‌ల ద్వారా గుడ్లు పాడైపోయినవని చెబుతున్నారు వాటిని మేము వెళ్లి పరిశీలిస్తాం. కుళ్లిన గుడ్లు సరఫరా చేసే సదరు కాంట్రాక్టర్‌పై చట్టరిత్యా చర్యలు తీసుకుంటాం. ప్రతి ఒక్క టీచర్ అందుబాటులో ఉండి పిల్లల ఆరోగ్యంపై శ్రద్ద వహించడంతో పాటు గర్భిణులకు, బాలింతలకు నెలకు సరిపడ పౌష్టికాహారాన్ని అందిస్తున్నాము.

## కాలనీని మరింతగా అభివృద్ధి చేస్తాం

### బిపిఎం గ్రీన్ ల్యాండ్స్ కాలనీ అధ్యక్ష,కార్యదర్శులు

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** ఆదివారం పీర్జాదిగూడ నగర పరిధిలోని 5వ డివిజన్ బీపీఎం గ్రీన్ ల్యాండ్స్ కాలనీ లో అడహాక్ కమిటీ ఆధ్వర్యంలో ప్రశాంత వాతావరణంలో కాలనీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో అధ్యక్షులుగా మునుకుంట్ల నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రావు నాగిరెడ్డి, కోశాధికారిగా మునుకుంట్ల ప్రదీప్ గౌడ్ తమ ప్రత్యర్థులపై అత్యధిక మెజారిటీ ఓట్లతో గెలుపొందారు. గెలుపొందిన కాలనీ కమిటీ సభ్యులను వివిధ పార్టీల నాయకులు కాలనీ ప్రజలు, మహిళలు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి పర్వతాపూర్ గ్రామ బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. శబరి గార్డెన్ వద్ద బాణాసంచా కాల్చుతూ ఆనందోత్సాహాలతో మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ, కాలనీలో ఐక్యత అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ప్రతి ఒక్కరి సహకారంతో పెండింగ్లో ఉన్న అన్ని పనులను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తామని తెలిపారు. కాలనీలో సీసీ కెమెరాలు, హైమాస్ట్ లైట్లు కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు వేస్తున్నామని ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ఎల్లప్పుడూ ముందుంటామని హామీ ఇచ్చారు. కాలనీలో ఎలాంటి వివక్షకు తావు లేకుండా కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరం కలిసి మెలిసి ఉండాలని ఆకాంక్షించారు. అడహాక్ సభ్యులందరికీ, ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాలనీ సభ్యులు గోవుల కృష్ణ, ప్రసాద్, కాలనీ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడ

# వరల్డ్ కప్‌లో 'రోకో'లకు ఛాన్స్?

- రవిశాస్త్రి



ఐపిఎల్ 18వ సీజన్ తర్వాత టీమిండియా జెర్సీ వేసుకోని విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు అ ఆస్ట్రేలియా పర్యటనకు సిద్ధమవుతున్నారు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో ఘనమైన రికార్డు కలిగిన రోకో ఆసీస్‌పై చెలరేగాలని భావిస్తున్నారు. వచ్చే వన్డే వరల్డ్ కప్ (2026) సన్నద్ధతలో ఉన్న భారత జట్టుతో పాటు రోహిత్, కోహ్లీలకు కూడా ఈ సిరీస్ కీలకం. ఇప్పటికే టెస్టులకు, టీ20లకు వీడ్కోలు పలికిన ఈ ఇద్దరు కొనసాగుతున్న ఫార్మాట్ ఇదే. అయితే.. ఆసీస్‌తో సిరీస్ తర్వాతే 'రోకో' భవితవ్యంపై స్పష్టత వస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మాజీ కోచ్ రవిశాస్త్రి దిగ్గజ ఆటగాళ్ల గురించి కీలక వ్యాఖ్యలు చేశాడు. 'వరల్డ్ కప్ కోసమే విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌ను ఎంపిక చేశారు. వీరిద్దరూ కచ్చితంగా వరల్డ్ కప్ స్క్వాడ్‌లో ఉంటారు. అయితే.. అది వారి ఫామ్, ఫిట్‌నెస్, పరుగులు సాధించాలనే ఆకలి మీద ఆధారపడి ఉంటుంది. సో. నా దృష్టిలో కోహ్లీ, హిట్‌మ్యాన్‌కు ఈ సిరీస్ చాలా కీలకం. వన్డే సిరీస్ ముగిసే సరికి ఇద్దరికి తమ ఆట గురించి ఒక అవగాహన వస్తుంది. ఇంకా ఆడగలమా? లేదా? అనేది వారే నిర్ణయించుకోగలరు. ఒకవేళ ఇక చాలు అనుకుంటే ఆస్ట్రేలియా వెటరన్ స్టీవ్ స్మిత్ మాదిరిగా వీడ్కోలు పలికాల్సి వస్తుంది' అని శాస్త్రి వెల్లడించాడు. దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే వేదికగా 2026లో వన్డే ప్రపంచ కప్ జరుగనుంది. ఆస్ట్రేలియా సిరీస్‌లో గనుక విఫలమయ్యారంటే మరో అవకాశం వస్తుందని కచ్చితంగా చెప్పలేం. ఎందుకంటే.. వరల్డ్ కప్ లక్ష్యంగానే శుభ్‌మన్ గిల్‌కు సారథ్యం అప్పగించామని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ తెలిపాడు. దాంతో.. ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లనే స్క్వాడ్‌లోకి తీసుకునే అవకాశముంది. అందుకే.. అనుభవజ్ఞులైన రోకో తమ ఫామ్, ఫిట్‌నెస్ చాటుకునేందుకు ఈ సిరీస్ అద్భుత అవకాశం అంటున్నాడు రవిశాస్త్రి. అక్టోబర్ 19, ఆదివారం పెర్త్ స్టేడియంలో భారత్, ఆసీస్‌ల మధ్య తొలి వన్డేతో సిరీస్ ప్రారంభం కానుంది.

# దక్షిణాఫ్రికాదే విజయం

## బంగ్లాకు మరో హార్ట్‌బ్రేక్

మహిళల ప్రపంచ కప్ ఉత్కంఠ పోరాటాలతో రంజుగా సాగుతోంది. భారత్‌పై చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడిన డీక్లెర్క్ (37 నాటౌట్) మరోసారి ఒత్తిడిలోనూ చెలరేగింది. చివరి ఓవర్ వరకూ విజయం దోబూచులాడిన పోరులో బంగ్లాదేశ్‌కు గుండెకోతను మిగిల్చుతూ సఫారీలను గెలిపించిందీ ఆల్‌రౌండర్. ఆఖరి ఓవర్లో 8 రన్స్ అవసరం కాగా.. ఫోర్, సిక్సర్‌తో దక్షిణాఫ్రికాకు మూడు వికెట్ల విజయాన్ని కట్టబెట్టిందీ ఫినిషర్. ఫామ్‌లో ఉన్న సఫారీ బ్యాటర్లను అద్భుతంగా నిలువరించిన బంగ్లా క్యాచ్‌లు వదిలేసే భారీ మూల్యం చెల్లించుకుంది.

వరల్డ్ కప్‌లో మరో ఆఖరి ఓవర్ థ్రిల్లర్. కానీ, విజయం మాత్రం దక్షిణాఫ్రికాదే. వైజాగ్‌లో భారత జట్టుపై మెరుపు అర్ధ శతకం బాది సఫారీలను గెలిపించిన డీ క్లెర్క్ (37 నాటౌట్) ఈసారి బంగ్లాదేశ్‌ను గెలుపు వాకిట దెబ్బకొట్టింది. ఆరంభం నుంచి పక్కాగాబౌలింగ్ చేస్తూ .. వికెట్ల వేటతో దక్షిణాఫ్రికా బ్యాటర్ల దూకుడుకు కళ్లెం వేసిన బంగ్లా స్పిన్నర్లు.. ఆఖరి వరకూ గొప్పగా బౌలింగ్ చేశారు. కానీ, ఫీల్డర్లు ట్రయాన్, డీక్లెర్క్ క్యాచ్‌లు వదిలేయడం ఆ జట్టు కొంపముంచింది. మరినే కాప్ (56), చోలే ట్రయాన్(62)లు అర్ధ శతకాలతో రాణించారు.

### వొల్వార్డ్ట్ రనౌట్‌తో మొదలు

పటిష్టమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన దక్షిణాఫ్రికా స్వల్ప లక్ష్య ఛేదనలో అపసోపాలు పడింది. వైజాగ్‌లో బంగ్లాదేశ్ స్పిన్నర్లు విజృంభించడంతో పరుగుల కోసం చెమటోడ్చారు సఫారీ బ్యాటర్లు 15వ ఓవర్లో లారా వొల్వార్డ్ట్ (31) రనౌట్‌తో మొదలు.. ఆరు పరుగుల తేడాతో మూడు వికెట్లు కోల్పోయింది సఫారీ జట్టు. బంగ్లా స్పిన్నర్ ఫాహిమా ఖాతూన్ తొలి బంతికే సినాలో జాఫ్తా(4)ను బౌల్డ్ చేసి ఐదో వికెట్ అందించింది. వరసగా వికెట్లు పడిన దశలో మరినే కాప్ (56), చొలే ట్రయాన్(62)లు ఓపికగా ఆడుతూ స్కోర్ బోర్డును నడిపించారు. చకచకాగా సింగిల్స్ తీస్తూ.. స్ట్రయిక్ రొటేట్ చేస్తూ మరినే, ట్రయాన్ స్కోర్ 130 దాటించారు. 40వ ఓవర్లో సిక్స్, ఫోర్‌తో మరినే హాఫ్ సెంచరీ సాధించింది. 85 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పిన మరినే కాప్‌ను నహిదా పెవిలియన్ పంపింది. దాంతో.. 163 వద్ద ఆరో వికెట్ పడింది. రబెయా ఓవర్లో మిడ్‌వికెట్ బౌండరీ వద్ద సబ్ ఫీల్డర్ సుమైమా క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన ట్రయాన్ .. ఆ తర్వాతి బంతికి సిక్సర్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకుంది. దాంతో.. సమీకరణం 40 బంతుల్లో 43పరుగులకు చేరింది. ఆఖరి బంతికి బౌండరీతో ఆ16 రన్స్ రావడంతో సఫారీల జట్టు విజయానికి చేరువైంది. కానీ, క్విక్ సింగిల్ తీయబోయి ట్రయాన్ రనౌటయ్యింది. ఆ తర్వాత మసబతా క్లాస్ తోడుగా డీక్లెర్క్ పోరాడింది. 48వ ఓవర్లో డీక్లెర్క్ బౌండరీకి యత్నించగా క్యాచ్‌ను శోర్నా వదిలేసింది. అంతదరిలోనూ ఉత్కంఠ.. ఆఖరి ఓవర్లో 8 రన్స్ అవసరం కాగా.. తొలి బంతికే డీక్లెర్క్ బఫోర్ కొట్టింది. .. మూడో బంతిని స్టాండ్స్‌లోకి పంపడంతో మూడు వికెట్ల తేడాతో గెలుపొందింది దక్షిణాఫ్రికా.

### షోర్నా, షమీన్ ఫిఫ్టీలతో..

వరల్డ్ కప్‌లో బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమవుతున్న బంగ్లాదేశ్ ఈసారి అదరగొట్టింది. దక్షిణాఫ్రికా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్న టాపార్డర్ శుభారంభం ఇవ్వగా.. మిడిలార్డర్ బ్యాటర్లు రాణించారు. సఫారీల కట్టుదిట్టమై బౌలింగ్ కారణంగా ఒకదశలో స్వల్ప స్కోర్‌కే పరిమితమయ్యేలా కనిపించింది బంగ్లా. కానీ, షోర్నా అక్తర్(51 నాటౌట్), షమీన్ అక్తర్(50)లు అర్ధ శతకాలతో మెరవడంతో .. పోరాడగలిగే స్కోర్ చేసింది. డెత్ ఓవర్లలో రీతూ మోని(19 నాటౌట్)తో కలిసి షోర్నా బౌండరీలతో చెలరేగింది. వీరిద్దరూ అజేయంగా 27 జోడించగా.. బంగ్లా నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 232 పరుగులు చేసింది.



ఫోకస్

# యువతరంగం



## ఉపాధికి ఊతం..

### ఎన్‌ఎల్‌ఎం పథకం..

భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ శాఖ ద్వారా 2014–15 ఆర్థిక సంవత్సరం నుండి అమలవుతున్న జాతీయ పశు సంవర్ధక మిషన్ పథకం (ఎన్ఎల్ఎం) గ్రామీణ యువతకు ఉపయుక్తంగా ఉంటుంది. ఈ రంగంలో ప్రస్తుత అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని, పథకాన్ని 2021–22 ఆర్థిక సంవత్సరంలో సవరించి, పునర్వ్యవస్థీకరించారు. ఉపాధి కల్పన, వ్యవస్థాపకత అభివృద్ధి, ప్రతి పశు ఉత్పాదకతను పెంచడం, తద్వారా గొడుగు పథకం అభివృద్ధి కార్యక్రమం కింద మాంసం, మేక పాలు, గుడ్డు మరియు ఉన్ని ఉత్పత్తిని పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. అదనపు ఉత్పత్తి దేశీయ డిమాండ్లను తీర్చిన తర్వాత ఎగుమతి ఆదాయాలకు సహాయపడుతుంది. అసంఘటిత రంగం ఉత్పత్తులను వ్యవస్థీకృత రంగంతో అనుసంధానించడానికి వ్యవస్థాపకుడిని అభివృద్ధి చేయడాన్ని కీలకంగా ఎంచుకున్నారు.

**లక్ష్యాలు..**

- కోళ్లు, పందుల పెంపకం, పశుగ్రాస రంగంలో వ్యవస్థాపకత అభివృద్ధి ద్వారా ఉపాధి కల్పన.
- మెరుగైన పశు జాతుల ద్వారా ఉత్పాదకతను పెంచడం.
- మాంసం, గుడ్డు, మేక పాలు, ఉన్ని, పశుగ్రాసం ఉత్పత్తిలో పెరుగుదల.
- పశుగ్రాసం, దాణా లభ్యతను పెంచడం.. ధృవీకరించిన పశుగ్రాస విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పశుగ్రాస విత్తనాల సరఫరా గొలుసును బలోపేతం చేయడం.. డిమాండ్ సరఫరా అంతరాన్ని తగ్గించడానికి పశుగ్రాసం ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనను ప్రోత్సహించడం.
- రైతులకు పశువుల బీమాతో సహా ప్రమాద నిర్వహణ చర్యలను ప్రోత్సహించడం.
- కోళ్ల పెంపకం, గొర్రెలు, మేకలు, దాణా, పశుగ్రాసం వంటి ప్రాధాన్యతా రంగాలలో అనువర్తిత పరిశోధనలను ప్రోత్సహించడం.
- రైతులకు నాణ్యమైన విస్తరణ సేవను అందించడానికి వ్యవస్థను బలోపేతం చేయడం. పశు యాజమాన్యాన్ని మెరుగుపరచడం.
- ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం... పశువుల రంగం ఉత్పత్తిని మెరుగుపరచడం కోసం నైపుణ్య ఆధారిత శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానాల వ్యాప్తిని ప్రోత్సహించడం.



కోళ్లు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకంలో వ్యవస్థాపకత అభివృద్ధి, జాతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ పథకం ప్రతిపాదిస్తుంది. వ్యక్తులు, ఎఫ్‌పిఒలు, ఎఫ్‌సిఒలు, జెఎల్‌జిలు, ఎస్‌హెచ్‌జిలు, సెక్షన్ 8 కంపెనీలకు వ్యవస్థాపకత అభివృద్ధికి ప్రోత్సాహకాలు అందించడం ద్వారా, జాతి మెరుగుదల మౌలిక సదుపాయాల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రోత్సాహకాలు అందించాలని ప్రతిపాదిస్తుంది. అదే విధంగా పశుగ్రాసం ఉత్పత్తికి అవసరమైన ధృవీకరించిన పశుగ్రాస విత్తనాల లభ్యతను మెరుగుపరచడానికి, పశుగ్రాస విత్తన గొలుసును బలోపేతం చేయాలని సూచిస్తుంది. వివిధ రకాల ప్రోత్సాహకాల ద్వారా పశుగ్రాస తయారీ యూనిట్ల స్థాపనకు వ్యవస్థాపకులను ప్రోత్సహించడం ఈ ఉపమిషన్ లక్ష్యం. కాగా, గొర్రెలు, మేకలు, పందుల మేత, పశుగ్రాసం రంగానికి సంబంధించిన పరిశోధన, అభివృద్ధిని నిర్వహిస్తున్న సంస్థలు, విశ్వవిద్యాలయాలను ఈ పథకం ప్రోత్సహిస్తుంది. అదే విధంగా, పశువుల బీమాపై అవగాహన కల్పిస్తుంది. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఉపాధి పొందవచ్చు. అదనపు ఆదాయాన్ని ఆర్జించడానికి కూడా ఈ పథకం ఉపయోగపడుతుంది.

## ఆ యాప్ సృష్టికర్త ఓ టీనేజర్!



కేవలం ఏడు సెకన్లలోనే గుండె సంబంధిత వ్యాధులను గుర్తించగల 'సిర్కాడియా వి' (CircadiaV) అనే యాప్ ఇప్పుడు సంచలనం సృష్టిస్తున్నది. కృత్రిమ మేధస్సు (ఎఐ) ఆధారిత ఈ యాప్‌ను, భారత మూలాలుగల, కేవలం 14 సంవత్సరాల సిద్ధార్థ్ నండియాలా అభివృద్ధి చేశాడంటే ఆశ్చర్యం కలగక మానదు. గుండె జబ్బులు తరచు బాధితుల ప్రాణాలు హరిస్తున్న నేపథ్యంలో, ఈ యాప్ వైద్య రంగాల్లో ప్రశంసలు పొందుతున్నది. అమెరికాలో స్థిరపడిన సిద్ధార్థ్ క్లౌడ్ ఆధారిత మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీని ఉపయోగించి, వివిధ అంశాలను విశ్లేషిస్తూ, గుండె జబ్బులను ముందుగానే గుర్తించే యాప్‌ను రూపొందించాడు. ఇది సరళమైన హార్ట్ సౌండ్ రికార్డింగ్ ద్వారా పని చేస్తుంది. దీని సాయంతో నలభైకి పైగా రకాల గుండె సంబంధిత వ్యాధులను కొన్ని సెకన్లలోనే గుర్తించడానికి వీలు ఉంటుంది. ఈ యాప్‌ను 15,000 మంది అమెరికన్లు, 700 మంది భారతీయులపై ప్రయోగించారు. దాదాపు 96 శాతం ఖచ్చితతతో, వాస్తవ గుండె రోగాల ప్రీస్క్రీనింగ్ విజయవంతమైంది. నగర, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య వసతులు తక్కువగా ఉండే చోట కూడా, ఈ యాప్ ద్వారా తక్కువ ఖర్చుతో, వేల మందికి త్వరితగతిన హార్ట్ రోగాన్ని గుర్తించొచ్చు. ప్రస్తుతం ఇది ఆసుపత్రుల్లో మాత్రమే ప్రాథమిక స్క్రీనింగ్ సాధనంగా ఉపయోగపడుతోంది. కానీ క్రొత్త వర్షన్‌లు, మరింత విస్తరణ వల్ల గ్రామీణ ఆరోగ్య కేంద్రాలలో కూడా ప్రజల ప్రాణాలను రక్షించడంలో సహాయపడే అవకాశం ఉంది. సమస్యల పరిష్కారంలో ఆసక్తి, నిబద్ధతే సిద్ధార్థ్ విజయ రహస్యం. యువత సైంటిఫిక్ ఆలోచనల్లోకి రాగలిగితే, ప్రపంచానికి ఎంతో మేలు చేయగలదనే విషయాన్ని అతను రుజువు చేశాడు. యువతకు మార్గదర్శకుడయ్యాడు.

**యూత్ ఐకాన్స్**

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష్ఠ లను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..

# పెంచిన ఫీజులు ఉపసంహరించాలి

## విద్యార్థులపై భారం మోపితే ఆందోళన చేపడతాం


### ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి అజిత్ హెచ్చరిక



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ ప్రథమ సం. విద్యార్థులకు పెంచిన వివిధ రకాల ఫీజులను తక్షణమే తగ్గించాలని, లేదంటే ఆందోళన బాట తప్పదని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ అన్నారు. సోమవారం స్థానిక కొత్తగూడెం రామచంద్ర డిగ్రీ కాలేజీ విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. అజిత్ మాట్లాడుతూ కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉమ్మడి కమ్మం, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో పలు డిగ్రీ కాలేజీలు ఉన్నాయని, వాటి పరిధిలో ప్రథమ సం.లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు వివిధ రకాల ఫీజులను ప్రభుత్వం భారీగా పెంచిందన్నారు. ఒక్కొక్క విద్యార్థికి రిజిస్ట్రేషన్ ఫీజు గతంలో 80 ఉండగా, ఇప్పుడు రూ.1200 పెంచారని, రికగ్నేషన్ ఫీజు గతంలో 400 ఉండగా, ఇప్పుడు దానిని రూ.800 చేశారని, ఐయూడిఎఫ్ ఫీజు గతంలో రూ.60 ఉండగా, ఇప్పుడు రూ.200లకు పెంచి విద్యార్థులపై తీవ్ర భారాన్ని మోపారని చెప్పారు. కేవలం పరీక్ష ఫీజును మాత్రమే పెంచలేదని అన్నారు. విద్యార్థులపై ఇంతపెద్ద ఆర్థిక భారాన్ని పెంచడం ద్వారా వారి చదువులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని, ఇంత పెద్ద మొత్తాల్లో పేద విద్యార్థులు ఫీజులు చెల్లించలేరని, తగ్గించాలన్నారు. తగ్గించకుంటే ఉద్యమాలు చేపడతామన్నారు. ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షులు సంజయ్, జిల్లా సమితి సభ్యులు రాజ్‌కమల్, నాయకులు బ్లెస్సి, వనిత, కళ్యాణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# నిధులిచ్చినా.. పనులు ప్రారంభించరా?

### ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి.కుతుబ్



**ప్రజాపక్షం / అమరచింత :** అమరచింత మున్సిపాలిటీ అభివృద్ధి రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ఇటీవల నిధులను మంజూరు చేసినా ఇప్పటివరకు పనులను ప్రారంభించలేదని ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి.కుతుబ్ ఆరోపించారు. సోమవారం అమరచింత పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడామైదానం కోసం కోటి రూపాయలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా ఇప్పటివరకు ఆ పనులను చేపట్టలేదని అన్నారు. అలాగే పట్టణ అభివృద్ధికై 15 కోట్ల నిధులను మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వ ఆదేశాలను ప్రకటించారు. పట్టణంలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు కూడా చేసుకున్నారు. కానీ పట్టణాభివృద్ధికి ఇప్పటివరకు పనులను చేపట్టకుండా జాప్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మంజూరైన నిధులను వెంటనే పట్టణాభివృద్ధికి పనులకు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే పెద్ద ఎత్తున ప్రజా ఆందోళన చేపడుతామని కుతుబ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు శ్రీకాంత్, రవి, అంజి తదితరులు పాల్గొన్నారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోతే

# మంత్రుల క్యాంపు కార్యాలయాలు ముట్టడి

### విలేకరుల సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** రాష్ట్రప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు విద్యార్థులకు శాపంగా మారాయని, రాష్ట్రప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థులకు బకాయి చెల్లించకుండా దళిత గిరిజన విద్యార్థులపట్ల కపట ప్రేమను కనబరుస్తుందని ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ ఆరోపించారు. స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతు ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఏడు పాఠశాలలు నమోదు చేసకోగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబందించి సుమారుగా రూ. 9.41 కోట్లు బకాయిలు ఉండటంతో యాజమాన్యాలు విద్యార్థులకు వసతి సౌకర్యాలు, ఉపాధ్యాయుల జీతాలు చెల్లింపులో ఇబ్బందులు పడుతున్నాయన్నారు.దీనివలన పాఠశాలల నిర్వహణ భారంగా మారిందని, బకాయిలు చెల్లించాకే విద్యార్థులను పాఠశాలలకు అనుమతిస్తామని ప్రకటిస్తున్నాయని తెలిపారు. గత 35 సంవత్సరాలుగా రాష్ట్రప్రభుత్వం ఎస్టీ, ఎస్సీ పేదవిద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కూల్‌ద్వారా నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నదని కాని గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం విద్యార్థులకు అందించాల్సిన రీఎంబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు మూసివేతకు సిద్ధపడుతున్నాయని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఉన్నాయని ఆస్కూల్స్‌లో 1వ తరగతినుంచి 10వ తరగతివరకు 23,000 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని ట్రైబల్‌వెల్ఫేర్ విద్యార్థులు 3వ తరగతినుంచి 10వ తరగతి వరకు 7000 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బెస్ట్ అవైలబుల్ ద్వారా ప్రతిఏటా 3500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని స్పష్టంచేశారు. తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రీఎంబర్స్‌మెంట్ విడుదల చేయాలని లేకుంటే ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మంత్రుల క్యాంప్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ నాగుల్‌మీరా, శివ, మనోజ్, గోపి, సాయి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# 42శాతంతోనే ఎన్నికలకు వెళ్ళాలి



### బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చకుండా మోసం చేసింది బిజెపినే

### బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకులు రాయబండి పాండురంగాచారి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాలని గత ఇరవై నెలలుగా బీసీ సమాజం ముక్త కంఠంతో కోరుతుంటే బిజెపి ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని, దీనితో రిజర్వేషన్ వ్యతిరేకులు న్యాయస్థానాలను వేదికగా చేసుకొని బీసీల రిజర్వేషన్లలకు గండి కొట్టాలని చూస్తున్నారని బీసీ రిజర్వేషన్లు ఒక్క శాతం తగ్గిన రాష్ట్రం అగ్నిగుండగా మారుతుందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకులు రాయబండి పాండురంగా చారి తీవ్రంగా హెచ్చరించారు. సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)బిసి హక్కులసాధన సమితి సం యుక్త ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌ఆఫీస్ ముందు వందలాది మందితో ధర్నా బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు కళ్లెం కృష్ణ అధ్యక్షతన జరిగింది. అనంతరం కలెక్టర్ హనుమంత రావుకి వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో ముఖ్యఅతిథిగా పాండు రంగ చారి మాట్లాడారు. బిసి రిజర్వేషన్లను అడ్డుకోవాలని నాటి నుండి నేటి వరకు బిజెపి చేస్తున్న కుట్రల భాగంలో బీసీల వ్యతిరేక పార్టీ బిజెపి అని బీసీలు గుర్తించాలని కోరారు. అదేవిధంగా ఈ సందర్భంగా బిజెపిరెండు నాలుకల విధానం వల్ల బీసీ రిజర్వేషన్లపై తమకున్న వ్యతిరేక భావనతోనే ఢిల్లీలో రాష్ట్రపతి గల్లీలో గవర్నర్ బీసీ రిజర్వేషన్ల బిల్లుకుఆమోదం తెలపడం లేదని చెప్పారు. రాష్ట్రపతి భవన్ ను రాజభవన్ ను ప్రభావితం చేస్తున్న అదృశ్య శక్తి బిజెపి అని ఆయన ఆరోపించారు. బిజెపికి చిత్తశుద్ధి ఉంటే కనీసం గవర్నర్ కలిసి బీసీ రిజర్వేషన్ల చట్టానికి ఆమోదముద్ర వేయించేవారని కానీ ఆ పని బిజెపి చేయడం లేదని ఆయన అన్నారు.అలాగే సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ లేదని రెడ్డి జాగృతి కి చెందిన రిజర్వేషన్ వ్యతిరేకులు కోర్టుల ను వేదికగా చేసుకుని బీసీలను రాజకీయంగా అణచివేయాలని కుట్రలకు పాల్పడుతున్నారని తెలిపారు. వారి కుట్రలను ఎండగట్టి బీసీ రిజర్వేషన్లను రక్షించుకుంటామని ఆయన తెలిపారు. ఇది బీసీ ఉద్యమానికి ఆరంభం మాత్రమేనని, రాష్ట్రంలో ఒక్క శాతం తగ్గిన భవిష్యత్తులో రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని తీవ్రంగా హెచ్చరించారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సమావేశంలో ఈనెల 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో రాస్తారోకోలు కార్యక్రమాలు జయప్రదం చేయాలన్నారు. రాష్ట్ర సమితి పిలుపు భాగంగా ప్రతి బీసీ బిడ్డ పాల్గొని 42 శాతం రిజర్వేషన్లు అమలు కు పోరాడాలని పిలుపునిచ్చారు. బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు కళ్లెం కృష్ణ అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు గోద శ్రీరాములు, కొల్లూరి రాజయ్య, బండి జంగమ్మ, ఎండీ ఇమ్రాన్, చెక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, ఏశాల అశోక్, పల్లె శేఖర్ రెడ్డి, చిగుర్ల లింగం, పెరబోయిన మహేందర్, వివిధ మండలాల కార్యదర్శులు అన్నెపు వెంకట్, గాదేగాని మాణిక్యం, కళ్లేపల్లి మహేందర్, అన్నేమైన వెంకటేష్, మారుపాక వెంకటేష్, గోదల్ల భూషణ్, రేకల శ్రీనివాస్, కాశపాక దయాకర్, దాసరి లక్ష్మయ్య, జిల్లా సమితి సభ్యులు సోమన సబిత, బబ్బురి శ్రీధర్, జల్ది రాములు, గుర్రం రాజమణి ఆలేటి బాలరాజు, మూల పోచయ్య నాయకులు పుట్ట రమేష్, సామల శోభన్ బాబు, చింతల మల్లేష్, ఎండీ నయీమ్, చొప్పరి సత్తయ్య, గుంటిపల్లి సత్తయ్య, గౌరవంతల శ్రీనివాస్, వల్దస్ నరసింహ, మదుగుల స్వామి, జహంగీర్, కృష్ణ, అరె పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# పేదల నివాస స్థలాల జోలికి వస్తే సహించేదిలేదు



### సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** నిరుపేదలు నివసించే స్థలాల జోలికి వస్తే సహించేది లేదని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల మల్లేష్ ఆధ్వర్యంలో ఖమ్మం నగరపాలక సంస్థ 15వ డివిజన్ అల్లీపురం కొత్తగూడెం డివిజన్‌లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నగర కార్యదర్శి షేక్ జానిమియా, కొత్తగూడెం డివిజన్ శాఖ కార్యదర్శి జొన్నగడ్డ వెంకటేశ్వర్లుతో కలిసి దండి సురేష్ సోమవారం సందర్శించారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతు అల్లీపురం, కొత్తగూడెం 15వ డివిజన్ పరిదిలో సర్వేనెంబర్ 408లో అనేక సంవత్సరాల నుంచి బుడగ జంగాలు నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారన్నారు.అలాంటి నిరుపేదలు నివాసం ఉండే ప్రాంతంలో తిరుమల తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా కలెక్టర్ 15వ డివిజన్ పరిధిలో దేవాలయం నిర్మాణానికి అనుకూలం గా ఉందని తెలుపుతూ బుడగ జంగాల నివాసాలు ఖాళీచేయాలనడంపై సిపిఐ నిరసన కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రభుత్వం దేవాలయం నిర్మాణం కోసం పేదల ఇండ్లు ఖాళీ చేయమంటే ఒప్పుకునే ప్రసక్తేలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సబ్యులు మేకల శ్రీనివాసరావు, కొత్తగూడెం శాఖ కార్యవర్గసబ్యులు రాపోలు కొండలు, మేద చిన్ని, ఆలకొండ శ్రీను, రాపోలు సారయ్య, గండికోట భిక్షం, పల్లపు నాగయ్య, 15వ డివిజన్ కొత్తగూడెం ప్రాంత రైతులు గౌని గోవర్ధన్, బీర్ల రవి, గద్దల రాంబాబు, గొర్రెముచ్చు రాంబాబు, పిల్లిమల రాము, నివాసస్థలాల బాధితులు నిడిగుండ వెంకన్న, పస్తం శ్రీను, బోడపాటి కృష్ణ, రేపల్లి గోపి, రేపల్లి అంకారావు, నిడికొండ లక్ష్మి, కొండపల్లి లక్ష్మి, గంధం యాకమ్మ, కళ్యాణి అంజమ్మ, కొండపల్లి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే పోలీస్ గ్రీవెన్స్ డే లో బాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు 35 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు.బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని,పోలీస్ స్టేషన్ కి వచ్చి న ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్ట పరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని అన్నారు.

## హుజూర్‌నగర్‌లో 'మహా జాబ్ మేళా'


యువతకు 100 కంపెనీల నుండి అవకాశం

మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్,కోదాడ నియోజకవర్గాల పరిధిలోని నిరుద్యోగ యువతీ,యువకులకు ఉపాధి కల్పించేందుకు గానూ ఈనెల 25న హుజూర్‌నగర్‌లో నిర్వహించనున్న మహా జాబ్ మేళాను సద్వినియోగపర్చుకోవాలని తెలంగాణ రాష్ట్ర భారీనీటిపారుదల,ఆహార,పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం హుజూర్‌నగర్ నియోజకవర్గం కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జాబ్‌మేళాకు సంబంధించిన ఏర్పాట్లపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు జాబ్ మేళా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాబ్‌మేళా లో 100 కంపెనీలు పాల్గొననున్నట్లు తెలియజేశారు. 10వ తరగతి నుండి ఇంజనీరింగ్ వరకు చదువుకున్న యువతీ,యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చునన్నారు. ఐటి, ఫార్మా,ఇకామర్స్,ట్రేడ్,మ్యానిఫ్యాక్చరింగ్,ఐటిఇ ఎస్,బి,పిఓ బయోటెక్నాలజీ తదితర రంగాలకు చెందిన కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొననున్నాయని వివరించారు. పరిశ్రమల శాఖ సింగరేణి కాలరీస్ సౌజన్యంతో నిర్వహిస్తున్న జాబ్ మేళాలో నిరుద్యోగ యువతీ, యువకులు పాల్గొని తమ ప్రతిభకు తగిన ఉద్యోగం పొందాలన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్



**ప్రజాపక్షం/తుంగతుర్తి :** రైతు సహకార సంఘాల, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం తుంగతుర్తి మండల కేంద్రంలో రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళారులను నమ్మి పండించిన పంటను అమ్ముకొని నష్టపోవద్దని ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే తమ పంటను అమ్ముకోవాలని కోరారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం అన్నదాతలకు అన్యాయం చేసిందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, రైతు సేవా సహకార సంఘం చైర్మన్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ వెంకన్న, సిఓ యాదగిరి పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ బిల్డింగ్ పైనుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** స్కూల్ బిల్డింగ్ పైనుంచి దూకి ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. ప్రిన్సిపల్ ఇచ్చిన సమాచారం ప్రకారం జనగాం గ్రామానికి చెందిన కొండూరు సాత్విక(15) మండల కేంద్రంలోని ఆదర్శపాఠశాలలో 9వ తరగతి చదువుతూ అనుబంధంగా ఉన్న హాస్టల్‌లో ఉంటుంది. దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన సాత్విక పాఠశాల పున ప్రారంభం అయ్యాక సోమవారం పాఠశాలకు మధ్యాహ్నం తల్లిదండ్రులతో కలిసి వచ్చింది. మధ్యాహ్నం తర్వాత 9వ తరగతి విద్యార్థులందరికీ డిజిటల్ క్లాస్ రూమ్‌లో బోధించేందుకు మొదటి అంతస్తులో ఉన్న తరగతి గది నుండి విద్యార్థులను పిలిపించారు. తన తోటి విద్యార్థుల వెంట వెళ్లకుండా సాత్విక ఒక్కతే తరగతి గదిలో ఉండి మొదటి అంతస్తు నుండి కిందకు దూకింది. దీంతో పాఠశాల సిబ్బంది గమనించి సాత్విక ను హుటా హుటిన చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆమె కాలు ఎముక విరగడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. హాస్టల్లో ఉండడం ఇష్టం లేక విద్యార్థిని ఈ చర్యకు పూనుకొని ఉంటుందని అనుమానిస్తున్నారు.

## పార్టీశ్రేణుల అభిప్రాయం మేరకే నూతన డిసిసి అధ్యక్ష ఎంపిక



**ప్రజాపక్షం/సూర్యాపేట :** పార్టీశ్రేణుల అభిప్రాయం సేకరించి నూతన డిసిసి అధ్యక్షుని ఎంపిక జరుగుతుందని ఏఐసిసి పరిశీలకులు సౌరత్ రౌత్ తెలిపారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏఐసిసి నాయకులు రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు పారదర్శకంగా పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుని ఎంపిక చేయడం కోసం సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమం మొదట గుజరాత్‌లో విజయవంతంగా నిర్వహించిన తరువాత మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, ఝార్ఖండ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో మంచి ఫలితం వచ్చిందని చెప్పారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పార్టీని పటిష్టం చేయడం కోసం, దేశవ్యాప్తంగా యువతను కలవడం కోసం, దేశం యొక్క సమైక్యత సమగ్రత కోసం భారత్ జోడో యాత్రని కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు, మణిపూర్ నుంచి ముంబై వరకు చేపట్టి సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను కలిశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్, పిసిసి జనరల్ సెక్రటరీ చకిలం రాజేశ్వర్‌రావు, ఓబిసి నాయకులు తండు శ్రీనివాస్ యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మార్కెట్ చైర్మన్లు అరుణ్ కుమార్, నరేష్ సుమతి పాల్గొన్నారు.

## ఉద్యోగాలకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యం లో గ్రీస్లో హాస్పిటాలిటీ, నిర్వహణ,సేవా రంగాలలో వివిద ప్రాంతాలలో ఉద్యోగ అవకాశాలు ఉనాయని వీటికి ఆంగ్ల భాషలో నైపుణ్యం, హోటల్ మేనేజ్మెంట్లో డిప్లొమా,డిగ్రీ కలిగినవారు లేదా ప్రభుత్వ అనుమతితో నైపుణ్య ధ్రువీకరణ పొందిన అభ్యర్థులు అర్హులు, వీటికి 92000 నుండి 1,22,000 జీతం ఉంటుందని ఉచితి వసతి బోజనం,బీమా అందిస్తారని. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు తమ అప్ డేట్ చేసిన రెజ్యూమ్‌ని మెయిల్ కి పంపగలరని జిల్లా ఉపాధి కల్పనా అధికారి ఎన్.పద్మ తెలిపారు.

# తుంగతుర్తికి దేవాదుల ద్వారా సాగునీరు

దేవాదుల ప్రాజెక్టు కోసం రూ.1000కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** తుంగతుర్తి నియోజకవర్గానికి దేవాదుల నీరు అందించాలన్నదే కాంగ్రెస్ పార్టీ సంకల్పమని తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఎంపికలో భాగంగా కార్యకర్తల అభిప్రాయాలను సేకరించేందుకు గాను సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేవాదుల ప్రాజెక్టు కోసం రూ.1000కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధమౌతున్నాయని వెల్లడించారు. సూర్యాపేట జిల్లా అభివృద్ధికి అంకిత భావంతో కృషి చేస్తున్నామని అన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కట్టిన రోజున దాని సామర్థ్యం 112 టిఎంసిలు ఉండగా మట్టి ఇసుక పేరుకపోవడంతో దాని సామర్థ్యం 80 టిఎంసిలకు పడిపోవడంతో చివరి వరకు నీరు అందడం లేదన్నారు. దానికి తోడు కాలువలు, లైనింగ్ దెబ్బ తినడం కూడా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం అన్ని అవాంతరాలను అధిగమించి సూర్యాపేటకు ఎస్‌ఆర్‌ఎస్‌పి నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగానే ఎస్‌ఆర్‌ఎస్‌పి ప్రాజెక్ట్‌లో పూడికతీత పనులకు ఉపక్రమించామని తద్వారా నీటి సామర్థ్యం పెంచాలన్నదే ప్రభుత్వ నిర్ణయమన్నారు. వాస్తవానికి సూర్యాపేట జిల్లాకు ఎస్‌ఆర్ ఎస్‌పి నీటిని రప్పించిన ఘతన దివంగతనేత మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డిదేనని ఆయన కొనియాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పిసిసి అధ్యక్షుడుగా ఉన్న సమయంలో దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నిర్వహించిన రక్తతర్పణం కార్యక్రమంలో తామందరం పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశారు. నీటి కోసం దామోదర్ రెడ్డి ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు, పోరాటాలు జరిగాయన్నారు. అటువంటి మహానేత పేరు ఎస్‌ఆర్‌ఎస్‌పి ఫేస్ 2కు పెట్టాలంటూ నీటిపారుదల శాఖామంత్రి హోదాలో తాను చేసిన ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారన్నారు. దామోదర్ రెడ్డి పేరు చరిత్రలోనే పదిలంగా నిలిచి పోయేలా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆ మహానేత లేనిలోటు పూడ్చలేనిదని ఆయన ఆశయాలు ముందుకు తీసుకుపోవడానికి అందరి సహకారంతో కృషి చేస్తామన్నారు. నీటిపారుదల రంగాన్ని బలోపేతం చేసే సూర్యాపేట జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ పరిశీలకుడు సౌరత్ రౌత్, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, డిసిసి అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## రైతులు ఎవరూ అధైర్య పడొద్దు

తడిసిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/వలిగొండ :** అకాల వర్షంతో తడిసిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని రైతులు ఎవరు అధైర్య పడవద్దని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. వలిగొండ మండలంలో తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి వలిగొండ మార్కెట్ యార్డు, నాగారం ధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారులతో కలిసి ధాన్యాన్ని పరిశీలించి రైతులను అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుండి రైతులను మేలు చేస్తున్నమని, సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టరేట్లో అధికారులతో కలిసి సమీక్షా సమావేశంలో కూడా రైతులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని తెలిపారని గుర్తు చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వడ్లను ఎత్తైన ప్రదేశంలో పోసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన తార్పాలిన్లను అందించి ధాన్యం తడవకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 12 సెంటీమీటర్లు వర్షం కొరవడంతో రైతుల ధాన్యం తడిసిందని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని ప్రభుత్వం ఏర్పడ్డ నాటి నుండి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని ఇప్పుడు కూడా రైతులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, ఎమ్మార్వో దశరథ, వలిగొండ ఎస్ఐ యుగంధర్ గౌడ్,వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు గంజాయి బారిన పడకుండా జాగ్రత్తలు

యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** విద్యార్థి దశ చాలా కీలకమైనదని, విద్యార్థులు గంజాయి బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఎం.హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం మినీ మీటింగ్ హాల్‌లో జిల్లాలో గంజాయి నియంత్రణపై నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ అక్షాంక్ష్ యాదవ్, అడిషనల్ డిసిపి లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి దృష్టి పెట్టాలన్నారు. పోలీస్, ఎక్సైజ్, డ్రగ్స్‌ఇన్‌స్పెక్టర్, వైద్య, విద్యా, అటవీ, ఆర్టీసీ, సంబంధిత అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చాలని అన్నారు. జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. గంజాయి మీద దృష్టి పెట్టి, యువతను, విద్యార్థులను గంజాయి, ఇతర మత్తు పదార్థాల నుండి కాపాడాలన్నారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిస కాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. యువతకు వాటి వల్ల కలిగే నష్టాలపై వివరించాలని, ఎక్కువగా కళాశాలలు ఉన్న చోట నష్టాలపై ఎక్కువ ఫోకస్ పెట్టాలని అన్నారు. డిప్యూటీ పోలీస్ కమిషనర్ అక్షాంక్ష్ యాదవ్ మాట్లడుతూ సెప్టెంబర్ నెల మాసంలో రెండు గంజాయి కేసులను గుర్తించడం జరిగిందన్నారు. డ్రగ్స్ నియంత్రణలో పోలీస్ శాఖ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్‌ల వద్ద గట్టి నిఘా ఉంచామని తెలిపారు. జిల్లా లోని కళాశాలల్లో, గంజాయి, మత్తు పదార్థాల వలన కలిగే నష్టాలపై యువతకు అవగాహన సదస్సులు నిర్వహించాలని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు గంజాయి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి, రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, ఎక్సైజ్ సూపర్నెంట్ విష్ణుమూర్తి, జిల్లా అటవీశాఖ అధికారి పద్మజ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రెండు గేట్ల ద్వారా నీటి విడుదల..



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది శ్రీశైలం నుంచి వస్తున్న ఇన్ ఫ్లో బాగా తగ్గిపోవడంతో ప్రాజెక్టు అధికారులు రెండు గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగిస్తున్నారు. 2 గేట్లను 5 అడుగుల మేర పైకి లేపి 16138 యూసెక్కుల నీటిని స్పిల్ వే ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు శ్రీశైలం నుంచి వస్తున్న మొత్తం ఇన్ ఫ్లో 68397 క్యూసెక్కులు గా ఉండటంతో కుడి కాలువ ద్వారా 10040 క్యూసెక్కులు ఎడమ కాలువ ద్వారా 7768 క్యూసెక్కులు, ఎస్ఎల్ బిసి,ఏఎంఆర్‌పి ద్వారా 1200 క్యూసెక్కులు ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 33251 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం సాగర్ రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగులకు సోమవారం సాయంత్రానికి 589.70 అడుగులు ఉండగా నీటి ని ల్వ 312.0450 టీఎంసీలకు 311.1486 టీఎంసీలుగా ఉన్నది.

### ఆరోగ్యకరమైన జాతి నిర్మాణంలో

## వైద్యులదే కీలకపాత్ర

హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**ప్రజాపక్షం/బీబీనగర్ :** దేశంలో ఆరోగ్యకరమైన జాతి నిర్మాణానికి యువ వైద్యులు అంకితం కావాల్సివుందని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ హితవుపలికారు. భారత ప్రధాని నరేంద్రమోదీ దార్శనికతకు అనుగుణంగా భారత జాతి నిర్మాణంలో వైద్యుల పాత్ర ఎంతో కీలమైనదని అన్నారు. కరుణ, నైతికతతో కూడా వైద్యసేవలు అందించడంలో యువ వైద్యులు ముందునిలవాలని ఆయన సూచించారు. బీబీనగర్‌లోని అఖిల భారతీయ వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) సముదాయాన్ని ఆయన మాజీ గవర్నర్ దత్తాత్రేయ సోమవారం సందర్శించారు. ఎయిమ్స్ బీబీనగర్ అధ్యాపకులు, పరిపాలనా అధికారులతో పాటు ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డాక్టర్) అహంతెం శాంతా సింగ్ ఆయనకు హృదయపూర్వక స్వాగతం పలికారు. తరువాత, ప్రొఫెసర్ (డాక్టర్) అహంతెం శాంతా సింగ్ ఇన్స్టిట్యూట్లో కొనసాగుతున్న నిర్మాణ కార్యకలాపాలు, అందించే వివిధ విద్యా కోర్సులు, రోగులకు అందిస్తున్న సేవలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. మాజీ గవర్నర్ దత్తాత్రేయ ఆస్పత్రిలోని అన్ని బ్లాకులలో ఏర్పాటు చేసివున్న సౌకర్యాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డాక్టర్) అహంతెం శాంతా సింగ్, డీన్ (విద్యాశాస్త్రం) డాక్టర్ నితిన్ అశోక్ జాన్, డిప్యూటీ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) డాక్టర్ బిపిన్ పి. వర్గీస్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహేశ్వర్ లక్కిరెడ్డి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ విశాక జైన్, సూపరింటెండింగ్ ఇంజనీర్ డి.గోవర్ధన్ పాల్గొన్నారు.



## ప్రతి నెలా 100కు పైగా ఫోన్స్ రికవరీ

రూ.7కోట్ల 15లక్షల విలువ గల ఫోన్స్ బాధితులకు అందజేత

సెల్‌ఫోన్ రికవరీ మేళాలో జిల్లా ఎస్‌పి నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ప్రతి నెలా 100కు పైగా ఫోన్స్ రికవరీ చేసి ఈ సంవత్సరం రూ.7కోట్ల 15లక్షల విలువైన 842 ఫోన్స్ బాధితులకు అందించామని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సెల్‌ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసి జిల్లాలో ప్రజలు వివిధ రూపాల్లో పోగొట్టుకున్న 102 ఫోన్లను గుర్తించి రికవరీ చేసి జిల్లా ఎస్‌పి నరసింహ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఫోన్ రికవరీ చేయడంలో జిల్లా పోలీసులు చాలా కృషి చేశారన్నారు. పోలీసు స్టేషన్ల పరిధిలో ఉన్న సైబర్ వారియర్స్ నిరంతర శ్రమ ఫలితంగానే ఈ సెల్‌ఫోన్‌లు అందజేయడం జరుగుతుందన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి తెప్పించామన్నారు. ప్రతి ఒక్కరికి నిత్యవసరమైనది, దీనిని కమ్యూనికేషన్ కోసం, ఆన్‌లైన్ విద్యతో పాటు విలువైన వ్యక్తిగత సమాచారాన్ని నిక్షిప్తం చేసుకుంటున్నామని అన్నారు. మొబైల్ పోగొట్టుకోవడం ద్వారా వ్యక్తిగత సమాచారంతో పాటు డబ్బులను కూడా కోల్పోతున్నారని అన్నారు. సెల్‌ఫోన్ దొంగల బారి నుండి విముక్తి కల్పించడానికి డిపార్టుమెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ సిఈఐఆర్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని, ఈ పోర్టల్ ద్వారా మంచి ఫలితాలు రాబట్టడం జరుగుతుందని వివరించారు. పోలీసు ప్రజల ఆస్తుల రక్షణలో అనుక్షణం ప్రజల పక్షాన పనిచేస్తుంది, మన కోసం పోలీసు ఉన్నారనే భావన కలిగి పోలీసుల కృషిని గుర్తించాలని కోరారు. అత్యాశకు పోయి, అధిక వడ్డీలు వస్తాయని చెప్పి ప్రజలను మోసం చేసేవారితో జాగ్రత్తగా ఉండాలన్నారు. గుడ్డిగా వారిని నమ్మి మోసపోవద్దని సూచించారు. మీ ప్రాంతాల్లో జరుగుతున్న అసాంఘీక చర్యలు, అక్రమ రవాణా పై పోలీసులకు సమాచారం ఇవ్వడంతోపాటు వాటిపై ప్రశ్నించి ప్రతి ఒక్కరూ యూనిఫాం లేని పోలీసుగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా బాధితులు సెల్‌ఫోన్స్ తిరిగి వారికి అందడంతో పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సిఈఐఆర్ అప్లికేషన్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో కృషి చేస్తున్న ఐటి కోర్ సిబ్బందిని, పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఐటి కోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు బుద్ధవనంలో ధమ్మ విజయ వేడుకలు

బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లెపల్లి లక్ష్మయ్య

**ప్రజాపక్షం/నందికొండ:** ఆచార్య నాగార్జునుడు నడయాడిన ఈ ప్రాంతంలో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించి న బుద్ధవనంలో నేడు ధమ్మ విజయ వేడుకలను ఉదయం 11 గంటలకు బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లేపల్లి లక్ష్మయ్య అధ్యక్షతన ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామ్రాట్ అశోక చక్రవర్తి క్రీ.పూ 2300 సం అక్టోబర్ 14 న బౌద్ధాన్ని స్వీకరించిన సందర్భాన్ని అశోక విజయ దశమిగా,1956,అక్టోబర్ 14 ఇదే రోజున భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేత్కర్ , నాగపూర్ లో ధమ్మ దీక్షను తీసుకున్న రోజును ధమ్మ విజయ దినంగా జరుపుకుంటారని, ఉదయం 11.00 గం లకు ప్రారంభమయ్యేఈ కార్యక్రమంలో మొదట పూణె యూనివర్సిటీ ప్రొఫసర్ మహేష్ దియోకర్, దమ్మవిజయ విశిష్టత గూర్చి ప్రసంగిస్తారని ఆ తరువా మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్ లర్ ప్రొఫసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, హైదరాబాద్ రెడ్డి మహిళా కళాశాల సెక్రటరీ కె. ముత్యంరెడ్డి,మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాధవి లత ప్రసంగించనున్నారని బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య తెలిపారు.

## ఫిర్యాదుదారులకు అండగా ఉంటాం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ఫిర్యాదుదారులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి అర్జీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఫిర్యాదుదారులకు బరోసా కల్పించాలని, ప్రతి అంశాన్ని చట్టపరిధిలో పరిష్కరించడంలో బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఎస్‌పి ఆదేశించారు. అత్యవసర సమయంలో డయల్ 100, పోలీస్ కంట్రోల్ రూం 8712686057కు ఫోన్ చేసి పోలీస్ సేవలను పొందాలన్నారు.



## చీఫ్ జస్టిస్‌పై దాడి దేశ ప్రజాస్వామ్యంపై దాడి

కారకులకు కఠిన శిక్షలు విధించాలి: మందకృష్ణ మాదిగ



**ప్రజాపక్షం/నల్లగొండ :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి మీద దాడి దేశ ప్రజాస్వామ్య విలువలపై దాడి అని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తీవ్రంగా ఖండించారు.ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు తమ నిరసన తెలిపిజిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ అక్టోబర్ 7న సుప్రీం కోర్టు బెంచ్‌లో జస్టిస్ బీఆర్ గవాయి వాదనలు వింటున్న సమయంలో రాకేష్ కిషోర్ అనే వ్యక్తి షూ విసరడం అనాగరిక చర్య అని ఆయన పేర్కొన్నారు. దళితుడైన చీఫ్ జస్టిస్‌పై జరిగిన ఈ దాడి ప్రజా స్వామిక వ్యవస్థను, రాజ్యాంగాన్ని అవమానపరచే ప్రయత్నం అన్నారు.ఈ దాడి వెనుక ఉన్న ఆధిపత్య శక్తులను గుర్తించి కఠిన శిక్షలు విధించాలని, ఈ ఘటనపై సుప్రీం కోర్టు ప్రజాస్వామిక దృక్పథం కలిగిన సీనియర్ లేదా రిటైర్డ్ న్యాయమూర్తులతో స్వతంత్ర విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద నరేష్ మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు జానకి రామయ్య చౌదరి, మాదిగ ఉద్యోగుల సంఘం జాతీయ నాయకులు దైద సత్యం మాదిగ, ఎంజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గాదె రమేష్ మాదిగ, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు బకరం శ్రీనివాస్ మాదిగ పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## దరఖాస్తులు సత్వరమే పరిష్కారం
కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌లతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పిసిఈఓ వెంకట రెడ్డి, డిఆర్‌డిఓ నర్సింహులు, ఆర్‌డిఓ నవీన్, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లు బాగుంటేనే గ్రామాలు అభివృద్ధి



**ప్రజాపక్షం/కొత్తకోట :** బీటీ రోడ్డు శాంక్షన్ చేయించి, భూమి పూజ చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) కొత్తకోట మండల పరిధిలోని ఎన్‌హెచ్ 44హైవే మమ్మాలపల్లి గ్రామం నుంచి పుల్లారెడ్డి కుంట వరకు గల బీటీ రోడ్డును 97 లక్షల పైచిలుకు శాంక్షన్ చేయించి, భూమి పూజ చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ బీటీ రోడ్డు రూ.97 లక్షలతో బీటీ రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. రోడ్లు బాగుంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మారుమూల గ్రామాల రోడ్లు అభివృద్ధి చెందుతాయని పనులను నాణ్యతగా చేసి విలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం నాంచరమ్మ పేటలో 18 తారీఖున జరిగే ఉర్సే షరీఫ్ వాహీద్, రమేష్ నాయక్ ఆధ్వర్యంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) చేతుల మీదుగా పోస్టర్ ను విడుదల చేశారు. తదనంతరం రానిపేట గ్రామానికి చెందిన సయ్యద్ అబ్దుల్ వైద్య ఖర్చుల నిమిత్తం 1,50,000/ ఎల్వోసిని అందజేసిన ఎమ్మెల్యే జిఎంఆర్ ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ''పోలీస్ ఫ్లాగ్ డే'' సందర్భంగా ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు
ఎస్పీ డి.జానకి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న నిర్వహించే ''పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం'' సందర్భంగా, దేశం కోసం ప్రాణాలు అర్పించిన ధైర్యవంతులైన పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ, తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ఆన్‌లైన్ వ్యాసరచన పోటీ నిర్వహించబడుతుందని మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి తెలిపారు. ఈ పోటీల్లో 6వ తరగతి నుండి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. పోటీలు తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో నిర్వహించబడతాయి. విద్యార్థులు తమ వ్యాసాలను అక్టోబర్ 28 వ తేదీ లోపు సమర్పించాలి. ఉత్తమంగా ఎంపికైన ముగ్గురు విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. అలాగే జిల్లా స్థాయిలో 1వ,2వ,3వ స్థానాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయబడతామని ఎస్పీ పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ప్రతిభను ప్రదర్శించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించాలని ఎస్పీ సూచించారు. వ్యాసరచన అంశం (డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్ నుండి ఎలా దూరంగా ఉండగలరు.)

**పోటీలో పాల్గొనే విధానం:**
మీపేరు, విద్యార్హత, ఇతర వివరాలు నమోదు చేయండి. మీ వ్యాసాన్ని పేపర్‌పై రాసి, దాని ఫోటో లేదా పిడిఎఫ్ రూపంలో (500 పదాలు మించకూడదు) అప్‌లోడ్ చేసి సబ్మిట్ చేయండి.

**జిల్లాలో గ్రీవెన్స్ డే కార్యక్రమం**
**11 ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ డి.జానకి**
జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఎస్పీ డి.జానకి 11 మంది ఫిర్యాదుదారుల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ, సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో నేరుగా మాట్లాడి, బాధితులకు చట్టపరమైన సహాయం అందించడమే కాకుండా, వారి సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ. ''ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ కావడమే మా ప్రధాన లక్ష్యం. పోలీస్ స్టేషన్‌కి వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని మర్యాదపూర్వకంగా అతిథ్యంతో స్వీకరించి, వారి సమస్యను సవివరంగా విని, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం న్యాయం జరిగేలా చూడాలి'' అని సూచించారు.

## విద్యార్థులకు షూ పంపిణీ



**ప్రజాపక్షం/దామరగిద్ద :** దామరగిద్ద మండలంలోని ఒత్తుగుంట్ల ప్రాథమిక పాఠశాలలో సోమవారం బీజేపీ మండల నాయకులు రామలింగప్ప పాఠశాలలోని విద్యార్థులకు షూ, సాక్స్ పంపిణీ చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎదగాలని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఉద్దేశంతో పేద విద్యార్థులకు షూ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం శ్రీ దేవితో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## గీతన్న బీమా పథకాన్ని అమలు
కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ బిజ్వార్ మహేష్ గౌడ్ డిమాండ్

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** కల్లుగీత వృత్తి చేస్తూ సహజ మరణం పొందిన గీత కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహకారం అందించే గీతన్న బీమా పథకాన్ని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ బిజ్వార్ మహేష్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని బిజ్వార్ గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ దూవాలయ సన్నిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేతివృత్తులలోనే అత్యంత ప్రమాదకరమైన వృత్తి కల్లుగీత వృత్తి అని అలాంటి వృత్తిని కల్లుగీత కార్మికులు గత్యంతరం లేని పరిస్థితుల్లో తమ కుటుంబాల పోషణ కోసం చేస్తున్నారని, ప్రభుత్వాలు ఎన్ని మారిన గీతన్నల తలరాతలు మారడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో అమరుల స్ఫూర్తితో చైతన్యమై, ప్రభుత్వాలను మెడలు వంచి మేల్కొనే విధంగా ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉన్నదని అందుకు కల్లుగీత కార్మిక సోదరులంతా పెద్ద ఎత్తున కదలాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల భూమి కేటాయిస్తూ నీటి వసతి కల్పించాలని, పెన్షన్ రూ. నాలుగు వేలు ఇవ్వాలని, ప్రతి గీత కార్మికుడికి మోటార్ సైకిల్ ఇవ్వాలని మహేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గౌడ సంఘం నాయకులు రవి గౌడ్, వెంకప్ప గౌడ్, సురేందర్ గౌడ్, పూజారి నారాయణ గౌడ్, నరసింహా గౌడ్ పాల్గొన్నారు.

# అవసరమైన నిధులు తెస్తా.. జడ్చర్లను అభివృద్ధి చేస్తా
ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణంలో వరద నీటి కష్టాలను శాశ్వితంగా తొలగించడానికి అవసరమైన అదనపు నిధులను తీసుకువస్తానని, జడ్చర్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి హామీ ఇచ్చారు. వరద నీటి కాల్వల నిర్మాణం కోసం ఇది వరకే మంజూరైన రూ.14 కోట్లు కాకుండా, ప్రస్తుతం రోడ్లు, డ్రైన్ల కోసం రూ.12.5 కోట్లు కూడా మంజూరయ్యాయని, ఇవి కాకుండా మరో రూ.70 కోట్లు జడ్చర్ల అభివృద్ధి కోసం తీసుకురావడానికి కృషి చేస్తున్నారని వెల్లడించారు. జడ్చర్ల, బాదేపల్లి, కావేరమ్మ పేట ప్రాంతాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. జడ్చర్లలో రూ.14 కోట్లతో చేపడుతున్న వరద కాల్వల స్ట్రామ్ వాటర్ డ్రైన్స్ నిర్మాణానికి అనిరుధ్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేసి, నిర్మాణ పనులను ప్రారంభించారు. జడ్చర్ల పట్టణంలో భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పుడు ముంపునకు గురవుతున్న ప్రాంతాలకు సంబంధించిన వీడియోను ప్రదర్శించారు. ఈ సందర్భంగానే ఏర్పాటు చేసిన సమావేశంలో మీడియా ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. పట్టణంలో వరద నీటి కష్టాలను పూర్తిగా తొలగించడానికి వాన నీళ్లు రోడ్లపై నిలుకుండా చేయడానికి వరద కాల్వల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. పట్టణ ప్రగతిలో భాగంగా ప్రస్తుతం మంజూరైన రూ.12.5 కోట్ల నిధులలో రూ.5 కోట్లను జడ్చర్ల పాత బజారు ప్రాంతానికే కేటాయించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. కావేరమ్మ పేట కూడా తమ సొంత గ్రామమే అని ఆ ప్రాంతాన్ని కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ కౌన్సిలర్లు కూడా తమ ప్రాంతాలకే నిధులన్నీ ఇవ్వాలని పట్టుబట్టకుండా అన్ని ప్రాంతాల అభివృద్ధికి సహకరించాలని అనిరుధ్ రెడ్డి కోరారు. జడ్చర్ల పట్టణ అభివృద్ధి కోసం రూ.70 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఈ నిధులు మంజూరైతే జడ్చర్ల పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. ఎలాంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయకుండానే గతంలో ఉన్న బిఆర్‌ఎస్ నేతల సహకారంతో మార్టిగేజ్‌ను విడిపించుకుపోయారని అనిరుధ్‌రెడ్డి విమర్శించారు. ఈ సందర్భంగా కొందరు రియల్ వ్యాపారుల పేర్లను ప్రస్తావిస్తూ తాము చేయాల్సిన పనులు చేయకుండా తప్పించుకుపోయిన రియల్టర్లను నడిరోడ్డున నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత, కమీషనర్ లక్ష్మారెడ్డి, ఇతర కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే పదవి కోసం నన్ను కూడా చంపవచ్చు**
**ఎర్ర శేఖర్‌పై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**
సర్పంచ్ పదవి కోసమే తన సొంత తమ్ముడ్ని కాల్చి చంపాడు అని ఎమ్మెల్యే



పదవి కోసం తనను కూడా చంపొచ్చని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం నాడు జడ్చర్ల పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినా అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే శేఖర్ కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిసిందని అడగగా ఆయన పై విధంగా స్పందించారు. అసెంబీకల ఎన్నికల ముందు ఎర్ర శేఖర్ కాంగ్రెస్‌ని వీడి టిఆర్‌ఎస్‌లో చేరారని తిరిగి ఇప్పుడు మళ్ళీ కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతుండడం జరుగుతుందని పేర్కొన్నారు. ఏది ఏమైనా ఎర్ర శేఖర్ ఎమ్మెల్యే పదవి కోసం తనను చంపిన ఆశ్చర్యం లేదని కాంగ్రెస్ పార్టీలో ఫ్యాక్షనిస్టులకు స్థానం లేదని ఆయన ఘాటుగా స్పందించారు. జడ్చర్లలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చూస్తారని ఆయన మరోసారి పునరుద్ఘాటించారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి
కలెక్టర్ బదావత్ సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ప్రజలు తమ సమస్యల పరిష్కారానికై ప్రజావాణిలోనే కాకుండా ఎప్పుడైన ఆర్జీలు ఇవ్వడానికి వచ్చే దరఖాస్తుదారులతో గౌరవంగా వ్యవహరించి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా అధికారులకు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయంతో కలిసి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆర్జీలు స్వీకరించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో48 ఫిర్యాదులు అందాయన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వివిధశాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధితశాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటినివెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెంట్లు, అన్నిశాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

**ప్రతి ఒక్కరూ సిపిఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి**
ఆకస్మిక మరణాలను నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ సిపిఆర్ నిర్వహించే విధానాలను తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. సిపిఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్)పై అవగాహన కల్పించేందుకు సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశమందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివకుమార్ జిల్లా అధికారులకు సిపిఆర్ ప్రక్రియను వివరంగా చూపించారు. డిఎంహెచ్‌ఓ డాక్టర్ రవికుమార్ జిల్లా అధికారులతో సిపిఆర్‌పై ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేలాదిమంది గుండెపోటుతో ఆకస్మికంగా మరణిస్తున్నారని, ఈమరణాలను నివారించాలంటే ప్రతి ఒక్కరూ సిపిఆర్ ప్రక్రియ నేర్చుకోవాలని సూచించారు. ప్రతిఇంటిలో కనీసం ఒకరు అయినా సిపిఆర్ నేర్చుకుంటే ఎవరైనా గుండెపోటుతో కుప్పకూలినప్పుడు వెంటనే ప్రథమచికిత్స ఇవ్వగలరు. ఇది ఒక ప్రాణాన్ని కాపాడటమేకాకుండా ఒక కుటుంబాన్ని కాపాడినట్లే అవుతుందన్నారు. సిపిఆర్‌పై ప్రజల్లో అవగాహన పెరిగితే గుండెపోటుతో కుప్పకూలినవారికి వెంటనే ప్రథమచికిత్స అందించగలమని, వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చి, వాహనం వచ్చేవరకు సిపిఆర్‌చేస్తే అనేకప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవికుమార్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, వివిధశాఖల జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు లేని జిల్లాగా మార్చాలి
కలెక్టర్ సిక్తా పట్నాయక్



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేటను బాల్య వివాహాలేని జిల్లాగా మార్చాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. బాల్య వివాహా ముక్త భారత్ లో యాక్సెస్ టూ జస్టిస్, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ భాగస్వామ్యంతో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో విజన్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రచార బోర్డులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్, ప్రణీత్ పాల్గొన్నారు. అనంతరం విజన్ ఎన్ జీవో సమన్వయ కర్త రవి కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో 450 జిల్లాలో పనిచేస్తున్న 250కి పైగా ఎన్‌జిఓలు, ప్రభుత్వంతో పాటు ఇతరుల మద్దతుతో గత రెండేళ్లుగా దాదాపు 4 లక్షలు బాల్య వివాహాలు నిరోధించడంలో సహాయపడిందన్నారు. అలాగే గ్రామాలలో, పట్టణాలలో బాల్యవివాహాలు నిర్వహించవద్దని, పూజారులకు, ఫాస్టర్, ఇమామ్‌లకు సూచనలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. నారాయణపేట జిల్లా బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చాలనే లక్ష్యంతో తమ సంస్థ పని చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు అసోసియేట్ నరేష్, కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్స్ రమేష్, స్వప్న పాల్గొన్నారు.

**ప్రజావాణికి 21 ఫిర్యాదులు**
ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రజావాణి హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 21 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ ప్రణీత్, కలెక్టరేట్ ఏవో జయసుధ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులను చట్ట ప్రకారం పరిష్కరించాలి
జిల్లా ఎస్పీ డాక్టర్.వినీత్



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను చట్ట ప్రకారం వెంటనే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డాక్టర్.వినీత్, పోలీసు అధికారులకు తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాలనికి జిల్లాలో వివిధ మండలాల నుండి 4 ఫిర్యాదులు రాగా వాటిని జిల్లా ఎస్పీ డాక్టర్.వినీత్ పరిశీలించి పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదులను పెండింగ్లో ఉంచరాదని వెంటనే చట్టప్రకారం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు స్వయంగా ఫోన్లో మాట్లాడి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు పోలీసులు ఎల్లప్పుడూ కట్టబడి ఉంటారని ప్రతి ఒక్కరూ చట్ట పరమైన మార్గాల్లోనే తమ సమస్యలు తెలియజేయాలని, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని ఎస్పీ, తెలిపారు. ప్రస్తుతం టెక్నాలజీతో పాటు సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయని ప్రజలు వాటిపై జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని, ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100కి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

# బాల్య వివాహాల నిరోధానికి పకడ్బందీ చర్యలు
జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**ప్రజాపక్షం/వనపర్తి :** బాల్య వివాహాలు వధూవరుల తల్లిదండ్రులతో పాటు వివాహంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిపై కేసు నమోదు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. వనపర్తి జిల్లాలో మధ్యలోనే చదువు మానేసిన 181 మంది విద్యార్థులను తిరిగి కళాశాలల్లో చేర్పించాలని అధికారులను ఆయన ఆదేశించారు. జిల్లా బాల్య వివాహాలు జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అందుకు లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సెప్టెంబర్ 17 నుండి ప్రారంభమైన పోషణ మాసం కార్యక్రమం సందర్భంగా ఇచ్చిన లక్ష్యాలు, చేపట్టిన కార్యక్రమాలపై జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి వివరాలు వెల్లడించారు. వనపర్తి జిల్లాలో 498 మంది ఎత్తుకు తగ్గ బరువు, వయసుకు తగ్గ ఎత్తు లేని పిల్లలను ఎన్.ఆర్.సి సెంటర్ లో వైద్యంతో పాటు పౌష్టికాహారం అందించి వైద్య చేయించినట్లు తెలిపారు. జనవరి 1 నుంచి ఇప్పటి వరకు వనపర్తి జిల్లాలో 31 బాల్య వివాహాలు కేసులు నమోదు అయినట్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో 181 మంది విద్యార్థులు కళాశాల నుండి మధ్యలోనే చదువు మానేసినట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఇందులో 121 అబ్బాయిలు ఉండగా 60 మంది అమ్మాయిలు ఉన్నట్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించి జిల్లా కలెక్టర్ చదువు మానేసిన అమ్మాయిలు ఎక్కడున్నారో గుర్తించి తిరిగి కళాశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ, సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. పౌష్టికాహార లోపంతో ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లలను క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహిస్తూ ఆరోగ్యవంతులుగా ఉండేటట్లు సంబంధిత అంగన్వాడి కార్యకర్తలు చూసుకోవాలని సూచించారు. ఈ వారంలో తల్లి పాల పై అవగాహన కార్యక్రమానికి గర్భిణీ, బాలింత మహిళల భర్తలు సైతం సదస్సుకు హాజరయ్యే విధంగా చూడాలని సూచించారు. అనంతరం ఆర్.డి.ఎస్ స్వచ్ఛంద సంస్థ చిన్నమ్మ థామస్ వారు రూపొందిఇంచిన ఇచ్చట బాల్య వివాహం నిర్వహించబడవు అనే గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పిల్లలకు అన్న ప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతం కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్.ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, ఆర్డీఓ సుబ్రమణ్యం,



జిల్లా సంక్షేమ అధికారిని సుధారాణి పిడిఆర్‌డిఓ ఉమాదేవి జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజావాణి ఫిర్యాదుల సత్వర పరిష్కార బాధ్యత అధికారులదే**
ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య, ఆర్డిఓ సుబ్రమణ్యం, డిప్యూటీ కలెక్టర్ రంజిత్‌తో కలిసి ప్రజల ఆర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజావాణి సహా సీఎం ప్రజావాణి నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మొత్తం 34 ఫిర్యాదులు వచ్చాయి.

## అచ్చంపేట పట్టణ సుందరీకరణకు రూ.11కోట్లతో మాస్టర్‌ప్లాన్

**ప్రజాపక్షం/అచ్చంపేట :** అచ్చంపేట పట్టణ సుందరీకరణకు రూ.11కోట్ల మాస్టర్‌ప్లాన్ ఏర్పాటు చేయడం జరిగిందని ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. సోమవారం పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. పట్టణంలోని నూతనంగా పార్కు ఏర్పాటు చేయడం, స్టేడియం విస్తరణ గ్యాలరీ, ట్యాంక్‌బండ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ట్యాంక్‌బండ్‌వద్ద అచ్చంపేట నియోజకవర్గాన్ని గతంలో అభివృద్ధిచేసిన నాయకుల కాంస్య విగ్రహాలను ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా అండర్‌డ్రైనేజి అచ్చంపేట పట్టణమంతా చేయనున్నట్లు తెలిపారు. ఆకాశదీపాలు, రోడ్డువిస్తరణ, సిసిరోడ్ల నిర్మాణంపై దృష్టిసారించనున్నట్లు తెలిపారు.

## విక్రయదారులు అనుమతి తీసుకోవాలి
జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**ప్రజాపక్షం/వనపర్తి :** ప్రజల భద్రత, క్షేమం దృష్టిలో ఉంచుకొని రాబేయే దీపావళి పండుగను ప్రజలందరూ ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని వనపర్తి జిల్లా ఎస్పీ రావులగిరిధర్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..దీపావళి పండుగ సందర్భంగా బాణాసంచా విక్రయాల కోసం డివిజనల్ స్థాయి పోలీసు అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా నిల్వచేసిన, తయారుచేసిన, దుకాణాలను నెలకోల్పిన, సరైన భద్రతా ప్రమాణాలు లేకుండా విక్రయాలు జరిపినా, ప్రేలుడు పదార్థాల చట్టం 1884, రూల్స్1933 సవరణ 2008 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపావళి పండుగ సందర్భంగా వనపర్తి జిల్లా పరిధిలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా టపాసుల విక్రయ దుకాణాలు రద్దీ ప్రదేశాలు, ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు లేదా పెట్రోల్ బంకులు సమీపంలో వివాదస్పద స్థలాలలో ప్రజలు నివసించే ప్రాంతాలలో ఏర్పాటు చేయకుండ సంబంధిత అధికారులు తహశీల్దార్, ఫైర్ విభాగం, పోలీసుశాఖ సూచించిన ప్రదేశాల్లో మాత్రమే లైసెన్స్ ఉన్న వ్యాపారులు బాణసంచ విక్రయాలను తగు జాగ్రత్తలు తీసుకొంటూ జరుపుకోవాలని ఎస్పీ తెలిపారు.

## పాఠశాల అభివృద్ధికి శ్రీకారం



**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండలం గుమ్మడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని వివిధ అభివృద్ధి పనులు, మరమ్మత్తులకు గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ భూజల భువనేశ్వర్ రెడ్డి విరాళంతో డయాస్ నిర్మాణం, కాంపౌండ్ వాల్ మరమ్మత్తులు, విద్యార్థులకు ఆర్వో వాటర్ ప్లాంట్, వైఫై ప్రింటర్, ప్రహరీ గేటు విరాళంగా అందజేశారు. సోమవారం రోజు కాంపౌండ్ వాల్ మరమ్మత్తులకు సోదరుడు ఖంగేదర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నరసింహా రావు, ఉపాధ్యాయులు పనులను పూజా కార్యక్రమం నిర్వహించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి , వెంకట్రాంరెడ్డి, రవి కుమార్ రెడ్డి, సుధాకర్ , నిరంజన్ రెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/బిజినేపల్లి :** ప్రస్తుతం రాబోయే యాసంగిలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులకొరత సకాలంలో ఎరువులవాడకంపై అవగాహన సదస్సు నిర్వహించాలని భారతీయకిసాన్‌సంగ్ మండల అధ్యక్షుడు రఘుబాబు సోమవారం మండల వ్యవసాయ అధికారికి వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయేయాసంగిలో వరి, మొక్కజొన్న ఇతర పంటలపై అవగాహనసదస్సు నిర్వహించాలని మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్‌ని కోరారు. సకాలంలో ఎరువులకొరత యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో భారతీయకిసాన్‌సంగ్ సభ్యులు ఆంజనేయులు, చంద్రయ్య, జిల్లా కార్యదర్శిలు మండల కార్యదర్శి పాల్గొన్నారు.


# రీల్

## ప్రతిరోజూ ఒక ఛాలెంజ్

**- రిషబ్ శెట్టి**



జై హనుమాన్ చేస్తున్న హీరో, డైరెక్టర్ రిషబ్ శెట్టి. కాంతార: చాప్టర్ 1 చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.509 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసి కొత్త బెంచ్ మార్క్‌ని క్రియేట్ చేసింది. కాంతార: చాప్టర్ 1 ప్రస్తుతం బాక్సాఫీసు వద్ద సంచలనం సృష్టిస్తూ సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా హీరో, దర్శకుడు రిషబ్ శెట్టి విలేకరులతో మాట్లాడారు. కాంతార చేసినప్పుడే ప్రీక్వేల్ ఆలోచన కూడా ఉంది. కాంతారాకి వచ్చిన అద్భుతమైన రెస్పాన్స్ చూసి ప్రీక్వేల్ స్క్రిప్ట్ రాయడం మొదలుపెట్టాం. కాంతారతో జానపద కథలకు మళ్లీ పునర్వైభవం తీసుకొచ్చారని ప్రశంసించారు. కథని చాలా నిజాయితీగా చెప్పాలనుకున్నాం. అది ప్రేక్షకులకు నచ్చింది. ఇండియా జానపద కథలకు నిలయం. ఈ సినిమా విజయం మరిన్ని జానపద కథలు రావడానికి అవకాశం కల్పించడం చాలా ఆనందంగా ఉంది. నాకు జానపద కథలు చేయడం ఇష్టం. కాంతార మా ప్రాంతంలో జరిగిన కథ. అందుకే లొకేషన్ కూడా మా ప్రాంతంలోనే తీసుకోవడం జరిగింది.కాంతార చాలా కాంప్లికేటెడ్ స్క్రిప్ట్. ఈ సినిమా చేయడం ఒక పెద్ద ఛాలెంజ్‌తో కూడుకున్నది. ఈ సినిమా చేస్తున్నప్పుడు ప్రతిరోజు ఒక ఛాలెంజ్‌గా ఉండేది. రుక్మిణి ప్రీవియస్ సినిమాలు చూసి సెలెక్ట్ చేశాను. అలాగే గుల్షన్ దేవయ్య, జయరాం పాత్రలు కూడా అద్భుతమైన ఆదరణ పొందాయి. ప్రతి ఒక్కరూ తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. ఎన్టీఆర్ నాకు సోదరుడు లాంటివారు. ఆయన చాలా గొప్ప సపోర్ట్ ఇచ్చారు. ఆయన సపోర్టుకి జీవితాంతం రుణపడి ఉంటాను. ప్రస్తుతం జై హనుమాన్ చేస్తున్నాను. ఇంకొన్ని ఐడియాస్ ఉన్నాయి. అయితే వాటికి ఇంకా సమయం పడుతుంది.




## 'ఆంధ్ర కింగ్ తాలూకా' టీజర్ విడుదల

మైత్రి మూవీ మేకర్స్ నిర్మించింది. ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటించగా, ఉపేంద్ర ఆన్‌స్క్రీన్ సూపర్ హీరోగా కనిపించనున్నారు. వివేక్ మెర్విన్ సంగీతం అందించారు. ఇప్పటివరకు విడుదలైన రెండు పాటలు చార్ట్‌బస్టర్‌లుగా నిలిచాయి. ఈరోజు, మేకర్స్ టీజర్‌ను రిలీజ్ చేశారు. రామ్ సినిమాలను ఆరాధిస్తూ, ఆంధ్ర కింగ్‌ని ఆరాధిస్తూ పెరుగుతాడు. అంకితభావంతో ఉన్న అభిమానిగా, అతను తన అభిమాన స్టార్ విజయాలను సెలబ్రేట్ చేసుకుంటాడు. అతనిని సమర్థిస్తూ గొడవల్లో కూడా పాల్గొంటాడు. అతను తన హీరోని ఎంతగా ప్రేమిస్తాడో, అంతే తీవ్రంగా అతన్ని ప్రేమించే ఒక అమ్మాయి ఉంది. మురళి శర్మ చెప్పిన హార్డ్ హిట్టింగ్ డైలాగ్‌తో టీజర్ ముగుస్తుంది.రామ్ పోతినేని ఈ చిత్రంలో ఒక సినిమా అభిమాని పాత్రలో ఒదిగిపోయారు. ప్రతి హీరో అభిమానికి ఈ పాత్రలో తామే ఉన్నట్టు అనిపించేలా నటించారు. తన ఎనర్జీ తో రామ్ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. భాగ్యశ్రీ బోర్స్ రామ్ లవ్ క్యారెక్టర్ లో గ్రేస్‌ఫుల్, ఎమోషనల్ గా కనిపించింది. రామ్ తల్లిదండ్రులుగా రావు రమేష్, తులసి బాగా నటించారు. రామ్ స్నేహితుడిగా సత్య హ్యూమర్ అందించగా, ఒక సీన్‌లో మురళీ శర్మ ఆకట్టుకున్నారు.ఇది సినిమాను వేడుకలా జరుపుకునే చిత్రం. ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇచ్చే ఈ టీజర్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. భారీ అంచనాలతో ఆంధ్ర కింగ్ నవంబర్ 28న థియేటర్లలో విడుదల కానుంది.

## డిసెంబర్ 12న 'మోగ్లీ' రిలీజ్



'బబుల్ గమ్'తో సక్సెస్‌ని అందుకున్న హీరో రోషన్ కనకాల 'మోగ్లీ 2025'తో ప్రేక్షకులను అలరించబోతున్నాడు. జాతీయ అవార్డు గ్రహీత, దర్శకుడు సందీప్ రాజ్ (కలర్ ఫోటో) దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఫారెస్ట్ నేపథ్యంలో సాగే యూనిక్ రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన 'మోగ్లీ 2025' ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. మోగ్లీ 2025' డిసెంబర్ 12న థియేటర్లలోకి వస్తుంది. డిసెంబర్ రెండవ వారంలో ఎలాంటి పెద్ద సినిమాలు లేకపోవడం'మోగ్లీ 2025'కు పెద్ద ప్లస్ పాయింట్‌గా కానుంది.ఈ చిత్రానికి రామ మారుతి ఎం సినిమాటోగ్రఫీని, కాల భైరవ సంగీతం అందిస్తున్నారు. స్క్రీన్ ప్లేను రామ మారుతి ఎం, రాధాకృష్ణ రెడ్డి రాశారు. కోదాటి పవన్ కళ్యాణ్ ఎడిటర్‌గా, కిరణ్ మామిడి ఆర్ట్ డైరెక్టర్‌గా, నటరాజ్ మాదిగొండ యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ అందిస్తున్నారు.




యాక్షన్ థ్రిల్లర్ కాటాలన్ ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై షరీఫ్ మహమ్మద్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో హీరోగా అంటోని వర్గీస్ పెపే మాస్ అవతార్‌లో కనిపిస్తున్నారు. మంటల చుట్టూ, సిగరెట్‌తో, కళ్లలో జ్వాలలతో కనిపిస్తున్న అతని లుక్ అదిరిపోయింది. రక్తంతో తడిసిన ముఖం, చేతులు యాక్షన్ ఇన్‌టెన్సిటీని సూచిస్తున్నాయి. డెబ్యుటెంట్ డైరెక్టర్ పాల్ జార్జ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా గ్రాండ్ పూజా కార్యక్రమాలలో ప్రారంభమైంది. పాన్‌ఇండియా కాన్సెప్ట్‌గా భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. థాయ్‌లాండ్ యాక్షన్ సన్నివేశాలను ప్రపంచ ప్రఖ్యాత ఒంగ్ బాక్ సిరీస్ యాక్షన్ డైరెక్టర్ కెచా ఖాంఫక్డీ తన టీమ్‌తో కలిసి రూపొందించారు. అదే సిరీస్‌లో నటించిన పాంగ్ కూడా ఈ సినిమాలో కనిపించనుంది. సినిమాకు అజనీష్ లోకనాథ్ మ్యూజిక్ అందిస్తున్నారు. కాటాలన్‌లో తెలుగు నటుడు సునీల్ (పుష్ప, జైలర్ 2 ఫేమ్), కబీర్ దుహాన్ సింగ్ (మార్కో), రాపర్ బేబీ జీన్, రాజ్ తిరందాసు (పుష్ప ఫేమ్), బాలీవుడ్ నటుడు పార్థ్ తివారి (కిల్ ఫేమ్), అలాగే మలయాళ సినీ నటులు జగదీష్, సిద్ధిక్, వ్లాగర్‌సింగర్ హనాన్ షా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కథ, స్క్రీన్‌ప్లేలను జోబీ వర్గీస్, పాల్ జార్జ్, జెరో జేకబ్ సంయుక్తంగా రాశారు. డైలాగ్స్‌ను ఉన్నీ ఆర్. రాశారు. కట్టలన్ సినిమా మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్ రిలీజ్ కానుంది.

## యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణలో పూరి-సేతుపతి సినిమా



తమిళ నటుడు విజయ్ సేతుపతి హీరోగా సంయుక్త హీరోయిన్‌గా నటిస్తున్న పూరి సేతుపతి సినిమా చివరి షెడ్యూల్ ప్రారంభం అయింది. విజయ్ సేతుపతిపై అత్యంత కీలకమైన సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. సమాజంలో జరిగే అన్యాయాలపై ఒక సామాన్య పౌరుడు చేసే తిరుగుబాటుతో ఈ కథను తెరకెక్కిస్తున్నారు. నెలాఖరు వరకు జరిగే షెడ్యూల్ తో దాదాపుగా షూటింగ్ పూర్తవుతుంది. భారీ యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. పాటలు చిత్రీకరణ కూడా ఇదే షెడ్యూల్‌లో పూర్తి చేస్తామని సమర్పకురాలు చార్మి తెలిపారు. ఈ సినిమాను తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మళయాళం భాషలలో విడుదల చేయనున్నారు. జేబి మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ సినిమాను పూరి జగన్నాథ్, ఛార్మి కలిసి నిర్మిస్తున్నారు.

## చాలా 'సర్‌ప్రైజ్' అయ్యా!

**రాశి ఖన్నా**



ఉస్తాద్ భగత్ సింగ్ సహా హిందీలో నాలుగు సినిమాలు చేస్తున్న హీరోయిన్ రాశి ఖన్నా 'తెలుసు కదా' సినిమా 17న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ రాశి ఖన్నా విలేకరులతో చిట్ చాట్ చేశారు. చాలా ట్రయాంగిల్ లవ్ స్టోరీస్ చూసుకుంటాం. కానీ ఇందులో ఒక యూనిక్ పాయింట్ వుంది. ఆ పాయింట్ మీరు థియేటర్స్‌లో చూడాలి. అది ఆడియన్స్‌ని ఎక్సయిట్ చేస్తుంది. ఈ సినిమా షూటింగ్‌లో చాలా సర్ ప్రైజ్ అయ్యాను. ఈ సినిమా చూసిన తర్వాత ఆడియన్స్ లవ్, బౌండరీస్ గురించి మాట్లాడుకుంటారు. ఇలాంటి పాయింట్‌తో సినిమా ఇప్పటివరకూ నేను చూడలేదు. కథ చాలా ఎంజాయ్ చేశాను. నీరజ ప్రతి క్యారెక్టర్‌ని అద్భుతంగా రాసింది. చాలా లేయర్స్ వున్నాయి. ఇందులో మూడు పాత్రలు చాలా డిఫరెంట్‌గా వుంటాయి. ఆ మూడు పాత్రలు బ్యాలెన్స్ చేయడం చాలా టఫ్. నేను చాలా లవ్ స్టోరీస్ చేశాను. ఇందులో అంజలి పాత్రలో కనిపిస్తాను. నా రియల్ లైఫ్‌కి ఆ పాత్రకు ఏ మాత్రం పోలికలు లేవు. సిద్ధు ఆన్ సెట్‌లో క్రాఫ్ట్ మీద చాలా సీరియస్‌గా వుంటారు. ఆయనకి ప్రతి క్రాఫ్ట్ మీద చాలా గ్రిప్ వుంటుంది. ఆయనతో వర్క్ చేయడం చాలా మంచి ఎక్స్ పీరియన్స్. నీరజ కథ చెప్పినప్పుడు షాక్ అయ్యాను. అంత యూనిక్ స్క్రిప్ట్ ఎలా రాయగలిగారనిపించింది. తనకు ప్రతి విషయంపై నాలెడ్జ్ వుంది. ఒక ఎక్స్ పీరియన్స్ డైరెక్టర్‌తో వర్క్ చేసినట్లుగానే అనిపించింది. నాకు మైథలాజిక్ సినిమాలు ఇష్టం, అలాగే హార్రర్ బ్యాక్ డ్రాప్ వున్న కథలు కూడా ఇష్టం.శ్రీనిధి గురించి చెప్పాలంటే మా కాంబినేషన్‌లో చాలా మంచి సీన్స్ వున్నాయి. తను చాలా ఫన్ పర్సన్. మేము మంచి ఫ్రెండ్స్ అయ్యాం. పవన్ కళ్యాణ్‌తో ఉస్తాద్ భగత్ సింగ్ చేస్తున్నాను. పవన్ కళ్యాణ్‌తో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్ పీరియన్స్. ఆయన ఫాలోయింగ్ నెక్స్ట్ లెవల్. హిందీలో నాలుగు ప్రాజెక్ట్స్ చేస్తున్నాను.

## అఖండ-2: తాండవం అద్భుతమైన బ్యాక్ గ్రౌండ్ స్కోర్

'గాడ్ ఆఫ్ ది మాసెస్' నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ దర్శకుడు బోయపాటి శ్రీను డైనమిక్ అండ్ పవర్ ఫుల్ ఫోర్త్ కొలాబరేషన్‌లో మోస్ట్ అవైటెడ్ హైఆక్టేన్ సీక్వెల్ 'అఖండ 2: తాండవం' పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉంది.14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమాను తేజస్విని నందమూరి మర్పిస్తున్నారు. థమన్ అందిస్తున్న బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌లో వీరు సంస్కృత శ్లోకాలతో మంత్ర ముగ్ధులను చేయబోతున్నారు. ఈ శ్లోకాలు, వేద మంత్రాలు ప్రేక్షకులకు గూస్ బంప్స్ తెచ్చేలా వుండబోతున్నాయి. థమన్ అందిస్తున్న పవర్ ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ సినిమాకి హై వోల్టేజ్ ఎనర్జీ అందించబోతోంది. ఈ చిత్రంలో సంయుక్త ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. ఆది పినిశెట్టి ఓ పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. హర్షాలి మల్హోత్రా కీలక పాత్రలో కనిపించనున్నారు. అఖండ 2: తాండవం డిసెంబర్ 5న గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.



## మార్కెట్‌కు రక్ష! (మొదటి పేజీ తరువాయి)

తిరుగులేనిదిగా ఉండబోదని వారు స్పష్టం చేశారు. కొత్త నీరు వచ్చి పాతనీటిని తోసిపారేసినట్టుగా మార్కెట్‌లో 'సృజనాత్మక విధ్వంసం' కొనసాగినప్పుడే ఆర్థికమాద్యం నుండి బయటపడే అవకాశాలు ఉంటాయని తమ పరిశోధనల ద్వారా వివరించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా స్థిరమైన వృద్ధి అవకాశాలకు మార్గాలను ఈ శాస్త్రవేత్తలు వివరించారు. సరికొత్త ఆలోచనలతో ఆవిష్కృతమైన ఆర్థికవృద్ధి గురించి వివరించినందుకుగాను ఈ ముగ్గురికి నోబెల్ బహుమతి ప్రకటించారు. స్వీయ ఉత్పత్తి ప్రక్రియలో నవీన ఆవిష్కరణలు ఒకదానితో మరొకటి ముడిపడి విజయవంతం కావాలంటే వాటిల్లో ఏదో ఒకటి పనిచేస్తుందని మనం తెలుసుకుంటే మాత్రమే సరిపోదనీ, ఎందుకు పనిచేస్తాయన్న విషయాన్ని కూడా సశాస్త్రీయంగా వివరించేందుకు మనం తెలుసుకోవాల్సిన అవసరం ఉంటుందని, సంక్షోభ పరిస్థితుల్లో ఇది కీలకపాత్ర వహిస్తుందని మోకిరీ తన ఆవిష్కరణ ద్వారా తెలియజేశారని నోబెల్ కమిటీ తన ప్రకటనలో వివరించింది.

అదేవిధంగా మిగిలిన ఇద్దరు ఆర్థికవేత్తలు ఫిలిప్ అఘియన్, పీటర్ హోవిట్ కూడా స్థిరమైన వృద్ధివెనుక పనిచేసే యంత్రాంగం ఏమిటో అధ్యయనం చేశారని తెలిపింది. 1992లో ప్రచురితమైన ఒక వ్యాసంలో 'సృజనాత్మక విధ్వంసం' పేరుతో నిర్మించిన గణితశాస్త్ర నమూనా గురించి వివరించారు. ఈ నమూనా గురించి కూడా వారు అధ్యయనం చేశారు. ఒక అత్యుత్తమమైన కొత్త వస్తువు ఆవిష్కృతమైనప్పుడు మార్కెట్‌లో అప్పటివరకూ చలామణీలో ఉన్న దాని తాలూకూ పాతతరం వస్తువు అంతర్ధానమై ఈ కొత్త వస్తువు దానిస్థానంలో వచ్చిచేరుతుంది. పాత వస్తువు అంతర్ధానం కావడాన్నే వారు క్రియేటివ్ డెస్ట్రక్షన్‌గా పేర్కొన్నారు. అంటే పాత వస్తువును ఇక ఎవరూ కొనుగోలు చేయరు. క్రమంగా అది మ్యూజియం వస్తువుగా మారుతుంది. ఐతే ఆర్థికవృద్ధి ఎప్పటికీ తిరుగులేనిదిగా, ప్రశ్నింపసాధ్యంకానిదిగా ఉండదని కూడా వారు తమ పరిశోధనల్లో నిరూపించారు. ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణల ద్వారా క్రియేటివ్ డెస్ట్రక్షన్ చేయాల్సి ఉంటుందని వారు వివరించారని నోబెల్ కమిటీ పేర్కొంది.

## బందీలు విడుదల

**(మొదటి పేజీ తరువాయి)**

పాలస్తీనియన్లు ఇజ్రాయెలీ జైళ్ళలో మగ్గుతున్నారు. వీరిలో 53మంది మహిళలు, 350 మంది పిల్లలు ఉన్నారు. ఇజ్రాయెల్ బందీల కుటుంబీకులు, మిత్రులు, బంధువులు,స్నేహితులు రెండేళ్ళుగా ఎదురుచూస్తున్న ఉదయం ఎదురుకావడంతో ఆ ప్రాంతమంతా వేలాదిమంది ప్రజల హర్షధ్వానాలు,కేరింతలతో ప్రతిధ్వనించింది. ఆదివారం సాయంత్రం నుండే హోస్టేజెస్ స్క్వేర్ వద్ద లక్షమంది ప్రజలు గుమిగూడి శుభోదయం కోసం కళ్ళు కాయలుకాసేట్టుగా జాగారం చేశారు. తొలి విడత ఏడుగురు బందీలను రెడ్‌క్రాస్‌కు హమాస్ స్వాధీనం చేయగా వారంగా ఉదయంనాటికి ఇజ్రాయెల్‌లోకి అడుగుపెట్టడంతో ఆ ప్రాంతం అంతా భావోద్వేగాలతో నిండిపోయింది. విడుదలైన బందీలలో 28 ఏళ్ళు వయసుగల గాలీ–జీవ్ బెర్మన్ అనే ఇద్దరు కవల పిల్లలున్నారు. వారి తిరిగిరాక వేలాదిమంది ప్రజల్లో ఉద్వేగాన్ని నింపింది. మధ్యాహ్నం నాటికి రెండో విడతగా 13 మంది బందీలను కూడా రెడ్‌క్రాస్‌కు ఇజ్రాయెల్ స్వాధీనం చేసింది. బందీలు ఇజ్రాయెల్‌లోకి అడుగుపెట్టక ముందే ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తున్న వారి బంధువులు వీడియో ద్వారా వారితో సంభాషించే సదుపాయం రెడ్‌క్రాస్ కల్పించింది. ఈ చారిత్రక ఘట్టాన్ని స్వయంగా తిలకించేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్వయంగా వెళ్ళారు. అక్కడి నుండి తర్వాత ఈజిప్ట సదస్సులో పాల్గొన్నారు. గాజాలో 2023 అక్టోబరు ఏడో తేదీన మొదలైన యుద్ధం 734 రోజులు కొనసాగింది. ఈ యుద్ధంలో 67,000 మంది పాలస్తీనియన్లు మరణించారు. 20 లక్షలమంది ప్రజల్లో 90 శాతం మంది నిరాశ్రయులయ్యారు.



ఇజ్రాయెల్ పార్లమెంట్ (నెస్సెట్)లో ట్రంప్ ప్రసంగిస్తుండగా, రికగ్నైస్ పాలస్తీనా(పాలస్తీనాను గుర్తించాలి) అని ముద్రించిన పేపర్‌ను ప్రదర్శిస్తూ, నినాదాలు చేసిన వామపక్ష నెస్సెట్ సభ్యులు అయిమాన్ ఒడే, ఒఫర్ కాస్సిఫ్‌లను వెంటనే బైటికి తీసుకెళ్తున్న భద్రతా సిబ్బంది

## సిబిఐ ఛార్జిషీట్

**(మొదటి పేజీ తరువాయి)**

వ్యాఖ్యానించింది. 2004–2009 మధ్య కాలంలో లాలూ ప్రసాద్ యాదవ్ రైల్వే మంత్రిగా పని చేశారు. భారతీయ రైల్వేకు చెందిన రెండు బిఎన్ఆర్ హోటళ్లను ముందుగా ఐఆర్‌సిటిసికి బదిలీ చేసి, వాటి నిర్వహణ కాంట్రాక్టులను బిహార్‌లోని సుజాత హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించారని ఛార్జిషీట్‌లో సిబిఐ తెలిపింది. ఆ ఒప్పందానికి బదులుగా లాలూ ప్రసాద్ యాదవ్ ఒక బినామీ కంపెనీ ద్వారా ఖరీదైన ప్రాంతంలో మూడు ఎకరాల భూమిని పొందారని పేర్కొంది. ఈ క్రమంలో టెండర్ ప్రక్రియను తారుమారు చేసి ఆ ప్రైవేట్ సంస్థకు సహాయం చేశారని ఆరోపించింది. ఆ రెండు హోటళ్లు ఒకటి రాంచీలో ఉండగా, మరోకటి పూరీలో ఉందని ఈ వ్యవహారం 2004 నుంచి 2014 మధ్య జరిగిందని తెలిపింది. కాగా, 'ఇది సాధారణ కోర్టు ప్రక్రియ. సోమవారం హాజరు కావాలని కోర్టు సమన్లు జారీ చేయడంతో ఇక్కడికి వచ్చాం. ఈ కేసును న్యాయస్థానంలోనే పోరాడుతాం. ఎన్నికల దగ్గరకు రాగానే కోర్టు కేసులు వస్తాయని కొన్ని రోజుల నుంచి మేము చెబుతూనే ఉన్నాం. మేము కోర్టు తీర్పును గౌరవిస్తాం. వీటన్నింటిపైనా ఇప్పటికీ పోరాడుతున్నాం. ఆయన రైల్వే మంత్రిగా చరిత్రలోనే ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆయనకు మేనేజ్‌మెంట్ గురు అనే పేరు ఉంది' అని లాలూ కుమారుడు తేజస్వీ యాదవ్ అన్నారు.

## సిబిఐ విచారణ (మొదటి పేజీ తరువాయి)

కదిలించిందన్నారు. అన్ని పార్టీల ఆందోళనలను తొలగించడానికి సమగ్ర దర్యాప్తు అవసరం ఉందని అభిప్రాయపడ్డట్లు సుప్రీం తెలిపింది. సెప్టెంబర్ 27న కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతిచెందగా అనేకమంది గాయపడ్డారు. ఈ ఘటనపై సిబిఐ విచారణకు ఆదేశించాలని టివికె కోరగా మద్రాస్ హైకోర్టు అందుకు నిరాకరించింది. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు తీర్పును టివికె సుప్రీంలో సవాల్ చేసింది. మరో వైపు డిఎంకె సర్కార్‌పై టివికె పార్టీ తీవ్ర ఆరోపణలు చేసింది. 'విజయ్ ర్యాలీకి ఆలస్యంగా వచ్చాడనే ఆరోపణలు పూర్తిగా నిరాధారం. పోలీసులు టివికె సభ్యులను ఉగ్రవాదుల్లాగా భావించి వారిపై దాడి చేశారు. టివికెను అణచివేయడానికి డిఎంకె ప్రయత్నాలు చేసింది. విజయ్ మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 10 గంటల మధ్య వచ్చాని టివికె జనరల్ సెక్రటరీ ఆధవ్ అర్జున చెప్పారు.

## సుప్రీం కోర్టు


**(మొదటి పేజీ తరువాయి)**

నిరాకరించింది. ఈ అంశంపై ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. తాను ఫిర్యాదు చేసినప్పటికీ ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదని పిటిషనర్ తెలియజేయగా.. రాజకీయ అంశాలకు కోర్టులను వేదిక చేసుకోవద్దని, ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కోవాలని చెప్పింది. కాగా బిజెపి, ఎన్నికల సంఘం కలిసి దేశంలో ఓట్ల చోరీకి పాల్పడుతున్నాయని రాహుల్‌గాంధీ మండిపడ్డారు. కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతో ఏర్పడిందని విమర్శించారు. ప్రధాన మంత్రి కూడా ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని ఆరోపించారు. కొందరు పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించడం కోసం ప్రజల ఓటు హక్కును దొంగిలించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని విమర్శలు చేశారు. త్వరలో బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదేవిధంగా ఓట్లు దొంగలించడానికి కుట్ర పన్నుతున్నారన్నారని ఆరోపించారు. మహారాష్ట్రతోపాటు ఇతర రాష్ట్రాల్లో కూడా ఓట్ల చోరీ చేయడంలో ఎన్‌డిఏ ప్రభుత్వం విజయవంతమైందని విమర్శించారు. బిహార్‌లో మాత్రం ఒక్క ఓటు కూడా చోరీ చేయనివ్వబోమని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై సిట్ విచారణ కోసం పిల్ వేయగా సుప్రీం కోర్టు తోసిపుచ్చింది.












Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com